సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+4 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 269
బుధవారం 20-12-2023
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'



విద్యా రంగానికి రూ.69,289 కోట్లు
వైద్య రంగానికి 29,488 కోట్లు
వ్యవసాయ రంగానికి 1,73,050 కోట్లు
మహిళా సంక్షేమానికి 2,10,425 కోట్లు

విద్య

- పేదవారి చదువు ఖర్చు పూర్తిగా ప్రభుత్వానిదే
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు వసతి, భోజనానికి ఏటేటా రూ.20 వేలు
- జగనన్న అమ్మఒడి • జగనన్న విద్యా దీవెన
- జగనన్న వసతి దీవెన • జగనన్న విద్యా కానుక
- జగనన్న గోరుముద్ద • జగనన్న విదేశీ విద్యాదీవెన
- 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు పంపిణీ
- ఇంగ్లీషు మీడియం - సిబిఎస్ఇ సిలబస్, టోఫెల్ శిక్షణ
- డిజిటల్ లైబ్రరీలు • వైఎస్సార్ విద్యోన్నతి పథకం
- టీచర్ల ట్రైనింగ్ కోసం యూట్యూబ్ చానెల్
- కన్‌సిస్టెంట్ రిథమ్స్ ఇన్ స్కూల్స్
- 17,805 కోట్లతో 45,975 స్కూళ్ల నిర్మాణం, ఆధునీకరణ
- ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం, యువతకు ప్రోత్సాహం.
- 41.53 కోట్ల విలువైన 5 లక్షల స్పోర్ట్స్ కిట్లు పంపిణీ

ప్రగతి పథం

- 15,004 గ్రామ వార్డు సచివాలయాలు -542 పౌరసేవలు
- 2.5 లక్షల గ్రామ వాలంటీర్ల నియామకం
- 1.34 లక్షల సచివాలయాల సిబ్బంది నియామకం
- కడపలో స్టీల్ ప్లాంట్
- వైఎస్సార్ నవోదయం - వైఎస్సార్ నవశకం
- నియోజకవర్గానికో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్
- స్పందన కార్యక్రమం • రివర్స్ టెండరింగ్
- మసీదులకు కొత్త హంగులు • యుద్ధ ప్రాతిపదికన నీటి ప్రాజెక్టులు
- అవినీతి రహిత పాలన
- చిన్న పరిశ్రమలకు వెయ్యి కోట్ల ప్రోత్సాహం
- బీమా మిత్రలకు 3 వేలు • పాలన, అభివృద్ధి వికేంద్రీకరణ
- గడప గడపకు మన ప్రభుత్వం • జగనన్న పచ్చతోరణ
- (APCO's) అవుట్ సోర్సింగ్ కు ప్రత్యేక కార్పోరేషన్
- టిడ్కో ఇళ్లు • కమ్యూనిటీ భవనాలు • ఎల్ఈడీ వీధి దీపాలు
- APONE అప్లికేషన్ ఫర్ ఇండస్ట్రీస్
- ఫిష్ ఆంధ్రా మార్టులు - వాహనాలు
- 4 పోర్టులు, 10 షిప్పింగ్ హార్బర్లు పనులు ప్రారంభం
- ఆర్.టి.సి. ప్రభుత్వంలో విలీనం, 50 వేల మంది ఉద్యోగులకు లబ్ధి
- విశాఖ జిఐఎస్‌లో 13.1 లక్షల కోట్ల ఒప్పందాలు
- 1.47 లక్షల ఉద్యోగ అవకాశాలు

5 ఏళ్లలో మొత్తం సాయం 5 లక్షల కోట్లు

ప్రత్యక్షంగా ప్రజలకు సాయం
3 లక్షల కోట్లు రూపాయలు
పరోక్షంగా ప్రజలకు సాయం
2 లక్షల కోట్లు రూపాయలు

రైతులు

- 10,778 రైతు భరోసా కేంద్రాలు
- ప్రతి రైతు కుటుంబానికి రూ.67500
- రైతన్నలకు వడ్డీలేని రుణాలు • రైతు కమీషన్ ఏర్పాటు
- వ్యవసాయానికి పగటిపూటే తొమ్మిది గంటల ఉచిత విద్యుత్
- ఆక్వా రైతులకు రూ.1.5లకు విద్యుత్ పంపిణీ
- పేదలకు భూపంపిణీ - భూములపై సర్వహక్కుల కల్పన
- వైఎస్సార్ పంటల బీమా పథకం ఐదేళ్లపాటు సాయం
- దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ
- జగనన్న భూహక్కు - భూరక్ష పథకం • ఈ క్రాప్ బుకింగ్
- మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్లు • పాల శీతలీకరణ కేంద్రాలు
- మొబైల్ వెటర్నరీ అంబులెన్స్ • వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్స్
- వైఎస్సార్ రైతు భరోసా రథం • జగనన్న జీవక్రాంతి
- వైఎస్సార్ యంత్ర సేవ • పశు కిసాన్ క్రెడిట్ కార్డులు
- సబ్సిడీలో విత్తనాలు, ఎరువుల పంపిణీ
- కౌలు రైతులకు కార్డులు • రైతులకు కాల్ సెంటర్ 155251
- వైఎస్సార్ పాలంబడి • జగనన్న పాల వెల్లువ
- ధరల స్థిరీకరణ నిధి రూ.3000 కోట్లు • వైఎస్సార్ రైతు బీమా

చట్టాలు

- దిశ చట్టం • షెడ్యూల్డ్ కులాల కమిషన్
- షెడ్యూల్డ్ తెగల కమిషన్ • శాశ్వత బీసీ కమిషన్
- నామినేటెడ్ పదవుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు 50 శాతం
- ఆలయాలు, ట్రస్టుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలు, మహిళలకు 50 శాతం
- పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు
- కౌలుదారులకు హక్కుల బిల్లు
- కొత్త మద్య నియంత్రణ చట్టం
- ముందస్తు న్యాయ పరిశీలన అనంతరమే టెండర్లు
- లోకాయుక్త ఏర్పాటు • వ్యవసాయ మార్కెట్లపై కొత్త బిల్లు
- పాఠశాల, విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్
- ఉన్నత విద్య కమిషన్ • ల్యాండ్ టైట్లింగ్ యాక్టు
- విద్యుత్ చట్టాలు సవరణ బిల్లు
- విశ్వవిద్యాలయాల కొత్త చట్టం
- ఆర్కిటెక్చర్, లలితకళల విశ్వవిద్యాలయాల బిల్లు
- చిరుధాన్యాల బోర్డు • పప్పు దినుసుల బోర్డు
- యూనివర్సిటీల క్లస్టర్ • మునిసిపాలిటీల కొత్త చట్టం
- ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం
- సహకార సంఘాల కొత్త చట్టం

అన్నొచ్చాడు... అన్నీ ఇచ్చాడు... అందరికీ ఇచ్చాడు...

(FROM THE PEOPLE... FOR THE PEOPLE... WITH THE PEOPLE...)

వైద్యం

- 8.480 కోట్లతో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు
- వైద్య ఖర్చు రూ.1,000 దాటితే ఆరోగ్యశ్రీ వర్తింపు
- వైఎస్సార్ ఆరోగ్య శ్రీ రూ.25 లక్షల వరకు పెంపు
- ఆరోగ్యశ్రీ పరిధిలోకి 3257 వ్యాధులు, ఆపరేషన్లు
- 104, 108 లకు 1704 కొత్త వాహనాలు
- చికిత్స, విశ్రాంతి సమయంలో కుటుంబానికి ఆర్థిక సాయం
- వైఎస్సార్ డయాగ్నోస్టిక్స్ ల్యాబ్‌లు ● జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు
- టెలీ మెడిసిన్ సేవలు ● ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్
- వైఎస్సార్ ఆరోగ్య రక్ష (ఉద్యోగుల కొరకు)
- దివ్యాంగులకు సదరం శిబిరాలు ● వైఎస్సార్ సంజీవిని మందుల షాపులు
- 2004 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు ● మహాప్రస్థానం వాహనాలు
- కరోనా సమయంలో ప్రజలకు అండ
- 16,852 కోట్లతో 10,674 హెల్త్ క్లినిక్‌లు
- ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఒక్కరికీ వైద్యపరీక్షలు
- 53,166 మంది వైద్యసిబ్బంది నియామకం
- ఉద్దానంలో కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి

మహిళలు

- మహిళలకు 31లక్షల ఇళ్ల పట్టాలు
  - 22 లక్షల ఇళ్ల నిర్మాణం
- మహిళలకు వడ్డీ లేని రుణాలు
- నామినేటెడ్ పదవుల్లో మహిళలకు 50 శాతం
- స్థానిక సంస్థల కొలువుల్లో మహిళలకు 50 శాతం
- నామినేటెడ్ పనుల్లో మహిళలకు 50 శాతం
- ఆశావర్కర్లకు జీతం రూ.10,000లకు పెంపు
- యానిమేటర్లకు జీతం రూ. 10 వేలకు పెంపు
- అంగన్‌వాడి టీచర్లకు 11,500
- జగనన్న మహిళా మార్టులు
- జగనన్న తోడు పథకంలో రుణాలు
- మహిళలకు స్త్రీ నిధి
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ
- ఎంఎస్ఎంఇలో 5.58 లక్షల మహిళల రిజిస్ట్రేషన్
- వైఎస్సార్ ఆసరా ● వైఎస్సార్ చేయూత


సంక్షేమ పథకాలు

- రూ.3000 వైఎస్సార్ పించన్ పథకం
- అగ్రీ గోల్డు బాధితులకు సాయం
- నాయి బ్రాహ్మణులకు, రజక, దర్జీలకు ఆర్థిక సాయం
- వైఎస్సార్ గృహ వసతి
- వైఎస్సార్ మత్స్యకార నేస్తం ● చేపల పడవలకు డీజిల్ సబ్సిడీ
- వైఎస్సార్ మత్స్యకార భరోసా ● కళ్యాణ కానుక
- కాపునేస్తం ● మత్స్యకార బీమా
- వాహన మిత్ర ● నేతన్న నేస్తం
- లా నేస్తం ● ఆలయాలకు ప్రత్యేక నిధి
- పోలీసులకు వీక్లీ ఆఫ్ ● అర్చకులకు , మత పెద్దలకు జీతాలు
- దయాలసిస్ పేషంట్ల పెన్షన్ రూ.10 వేలకు పెంపు
- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 27 శాతం మధ్యంతర భృతి
- ఉద్దానం కిడ్నీ బాధితులకు రూ.500 కోట్లతో సాయం
- ఎస్సీ, ఎస్టీకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్
- మధ్యాహ్న బోజన కార్మికులకు రూ.3 వేలు
- పోలీసు సిబ్బందికి రూ.40 లక్షల బీమా
- కళ్యాణ మిత్రలకు వేతనం పెంపు
- అన్ని కులాలకు కమిషన్లుతో మెరుగైన సంక్షేమం


హిందూధర్మ రక్షణ

- రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా దేవదాయ శాఖకు బడ్జెట్
- వంశపారంపర్య అర్చకత్వానికి ఆమోదం
- 6709 దేవాలయాలకు నిత్య ధూప దీప నైవేద్యాలకు ప్రత్యేక నిధులు
- అర్చక స్వాములకు లేదు పదవీ విరమణ
- యాదవ మిరాశీ హక్కులకు చట్టంతో ప్రాణ ప్రతిష్ఠ
- కరోనా సమయంలో 40 వేల అర్చక స్వాములకు రూ.5 వేలు సాయం
- ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో 500 నూతన దేవాలయాల నిర్మాణానికి శ్రీకారం
- జీర్ణస్థితికి చేరిన ఆలయాల పునర్నిర్మాణం
- సి.సి. కెమెరాలతో ఆలయాల్లో భద్రత మరింత పటిష్టం
- గరిష్ఠ నిధులతో బ్రాహ్మణ కార్పొరేషన్
- ఆంధ్రప్రదేశ్ అర్చక శిక్షణ అకాడమీ ఏర్పాటు
- దేవాలయ కమిటీల్లో ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం రిజర్వేషన్
- ఆలయ కమిటీల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్
- గుడికో గోమాత
- దేవుడి మాన్యం ఆక్రమణలపై ఉక్కుపాదం
- కాణిపాకం వినాయకుని బంగారు రథం
- దేశంలోని ప్రముఖ నగరాలలో శ్రీవారి ఆలయాల నిర్మాణం
- గోశాలలకు ప్రాధాన్యం, గో ఆధారిత నైవేద్యం
- టి.టి.డి చే 3250 నూతన దేవాలయాలకు శ్రీకారం

డా|| చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, M.A., B.L., Ph.D.,



సంక్షేమ సారథీ.. శిరసాభివందనం...
21 DEC
భవిష్యత్ తరాల దార్శనికుడా... సకల వర్గాల సంక్షేమ స్వాప్నికుడా...
నాయకుడా! వర్ధిల్లు వెయ్యేళ్ళు...
చెవిరెడ్డి మోహిత్ రెడ్డి
M.S., (London)
చంద్రగిరి



సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 269

బుధవారం 20-12-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

స్టార్క్‌కు 24.75 కోట్లు... కమిన్స్‌కు 20.50 కోట్లు

ఐపీఎల్‌-2024 వేలంలో ఆస్ట్రేలియా స్టార్ ప్లేయర్లు మిచెల్ స్టార్క్, ప్యాట్ కమిన్స్ కొత్త రికార్డులు నమోదు చేశారు. దుబాయ్‌లో మంగళవారం జరిగిన వేలంలో కోల్‌కతా జట్టు రూ. 24 కోట్ల 75 లక్షలకు స్టార్క్‌ను... సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు రూ. 20 కోట్ల 50 లక్షలకు కమిన్స్‌ను కొనుగోలు చేశాయి.

- వివరాలు 10లో



మంటలు రేపిన మాక్ పార్లమెంట్

పార్లమెంట్ ఉభయసభల నుంచి తమ సస్పెన్షన్‌ను నిరసిస్తూ విపక్ష ఎంపీలు చేపట్టిన కార్యక్రమం తీవ్ర దుమారానికి తెర తీసింది.


వివరాలు 6లో ▸



మళ్లీ అక్కడే కూర్చుంటారు

సార్వత్రిక ఎన్నికల్లో విపక్షాలు గతంలో కంటే తక్కువ సీట్లు గెలిచి మళ్లీ విపక్షానికే పరిమిత మవుతాయని ప్రధాని మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸



విచారణ త్వరగా పూర్తి చేయండి

జ్ఞానవాపి కేసుపై విచారణను 6 నెలల్లోగా పూర్తి చేయాలని జిల్లా కోర్టుకు అలహాబాద్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

వివరాలు 6లో ▸



చైనాలో భూకంపం

వాయవ్య చైనాలో సోమవారం అర్ధరాత్రి భూకంపం సంభవించి 127 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్‌చెక్

కౌలు రైతన్నలపై

రామోజీ కుళ్లు

- పెత్తందారీ పోకడలతో 'ఈనాడు' రోత రాతలు
- 25.86 లక్షల మందికి సీసీఆర్సీ కార్డులిచ్చిన ప్రభుత్వం ఇదే
- భూ యజమానులతో సమానంగా కౌలుదారులకు సంక్షేమ ఫలాలు

4 లో

అప్పులంటూ అబద్ధాల డప్పు

టీడీపీ హయాంతో పోల్చితే ఇప్పుడు అప్పులు తక్కువే

- ఆస్తుల కల్పనకు వెచ్చించే మూలధన వ్యయం ఇప్పుడే అధికం
- అనధికారిక డిపాజిట్లు మార్గదర్శిలోనే ఉంటాయ్ రామోజీ!
- అప్పులు, పెండింగ్ బిల్లులంటూ ఊహాజనిత ప్రచారాలు
- ప్రభుత్వాలకు అనధికారిక అప్పులుండవనే ఇంగితజ్ఞానం లేదా?
- తప్పుడు కథనాలతో మరోసారి దిగజారుడు తనాన్ని చాటుకున్నారు
- ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి దువ్వూరి కృష్ణ



రూ.5,858 కోట్ల రుణాన్ని మార్కెట్ నుంచి అదనంగా పొందేందుకు ఏపీకి కేంద్రం అనుమతించిందని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ఎక్స్‌లో చేసిన పోస్ట్

సాక్షి, అమరావతి: రాష్ట్రం అప్పులపై 'ఈనాడు' రామోజీ అట్టడుగు స్థాయికి దిగజారి తప్పుడు కథనాలు ప్రచురించారని, నిరాధారమైన గణాంకాలతో దుష్ప్రచారానికి దిగారని ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి దువ్వూరి కృష్ణ తీవ్రంగా మండిపడ్డారు. ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీయటమే లక్ష్యంగా అప్పులపై పదేపదే దుష్ప్రచారం చేస్తున్నారని, టీడీపీ రాజకీయ ప్రయోజనాల కోసం పాకులాడుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర అప్పులపై ఆర్బీఐ భయపడిందని, కేంద్ర ఆర్థిక శాఖ హెచ్చరించిందని, స్టాక్ ఎక్స్ఛేంజ్ మదుపరులను అప్రమత్తం చేసిందని, ఆర్థిక దిగ్గజాలు భయపడుతున్నారని, ఏపీ అప్పులను చూసి దేశం ఆశ్చర్యపోతోందంటూ దుర్మార్గంగా వండి వార్చిన కథనాలను చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వంపై ఆ పత్రికకు ఉన్న ద్వేషం, కక్ష అర్థం అవుతున్నాయన్నారు. ఈనాడు కథనంలో

మిగతా 4వ పేజీలో ▶

ఇండియా కూటమిలో

లుకలుకలు


తాజా భేటీలో మరోసారి బట్టబయలు

దళిత కార్డుతో ప్రధాని అభ్యర్థి ఖర్గే!

భేటీలో మమత, కేజ్రీవాల్ ప్రతిపాదన

వ్యతిరేకిస్తూ వాకౌట్ చేసిన నితీశ్, లాలూ.. ప్రధాని ఎవరన్నది గెలిచాక చూద్దాం: ఖర్గే

6 లో





రాష్ట్రం గజగజ

అన్ని జిల్లాల్లోనూ పెరిగిన చలి తీవ్రత

సగటున 2 డిగ్రీలు తగ్గిన ఉష్ణోగ్రతలు

వణుకుతున్న విశాఖ ఏజెన్సీ ప్రాంతం

పగటి ఉష్ణోగ్రతలు కూడా తగ్గుదల

11 లో

ఆరోగ్యశ్రీ కొత్త కార్డుల

పంపిణీ షురూ



- పథకంపైనా విస్తృత ప్రచారం
- అన్ని నియోజక వర్గాల్లో ప్రారంభించిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు
- ప్రజల స్మార్ట్‌ఫోన్లలో ఆరోగ్యశ్రీ, దిశ యాప్‌ల డౌన్‌లోడ్
- అదే సమయంలో ప్రజలకు వాటి ప్రయోజనాలను వివరిస్తున్న సిబ్బంది
- ప్రజారోగ్యానికి సీఎం వైఎస్ జగన్ పెద్దపీట : మంత్రి విడదల రజిని

2 లో

అసైన్డ్ భూములకు హక్కులపై

మరింత స్పష్టత



- హక్కుల కల్పన ఆలస్యమవకుండా ప్రభుత్వం చర్యలు
- అన్ని అంశాలపైనా రెవెన్యూ యంత్రాంగానికి ఆదేశాలిస్తూ జీవో నంబర్ 596 జారీ
- అసైన్డ్ జల వనరుల పోరంబోకు భూములకూ యాజమాన్య హక్కులు
- అసైన్‌దారు పేరు ఏ రెవెన్యూ రికార్డులో ఉన్నా దాన్ని పరిగణనలోకి తీసుకోవాలి

2 లో

పోలిపల్లి భూ బాధితుల ఆందోళన



- లోకేశ్ సభ జరిగే గ్రామంలోనే టీడీపీ నాయకుల భూ అక్రమాలు
- న్యాయం చేయాలంటూ భూమి యజమాని వారసుల ఆందోళన
- టీడీపీ నాయకులు ఆక్రమించిన భూమిలో ప్లకార్డులతో నినాదాలు
- తమకు జరిగిన అన్యాయంపై పవన్ ప్రశ్నించాలని డిమాండ్
- న్యాయం జరిగే వరకు పోరాడతామని స్పష్టీకరణ

4 లో



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

జగనన్న పాల వెల్లువ జీవితాన్నిచ్చింది

గుంటూరు జిల్లా క్రోసూరులో ఇద్దరు పిల్లలు సాయిభార్గవి, స్నేహశ్రీతో కలసి అద్దె ఇంట్లో జీవిస్తున్నాం. పెద్దమ్మాయి ఇంటర్, చిన్నమ్మాయి ఎనిమిదో తరగతి చదువుతున్నారు. మా కుటుంబ పోషణ కోసం మా కన్నవారు రెండు గేదెలు కొనుగోలు చేసి ఇచ్చారు. గతంలో నేను ప్రైవేట్ డెయిరీలో పాలు పోసేదానిని. వారు లెక్కల్లో తేడా చేయడమే కాకుండా చాలా తక్కువ డబ్బులు ఇచ్చేవారు. అమూల్ డెయిరీ రాకతో నా జీవితంలో కొత్త వెలుగులు తెచ్చింది. ఇతర డెయిరీలకంటే పాల ధర అధికంగా ఇస్తుండడంతో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాను. గేదెల సంతతి పెరగడంతో ప్రస్తుతం ఆ సంఖ్య పదికి చేరింది. గతంలో డెయిరీల్లో పాలు పోస్తే నాణ్యత ఎంత ఉన్నా ఫ్యాట్ పది శాతం మించి లెక్కించేవారు కాదు. లీటరుకు 80 రూపాయలు మాత్రమే ఇచ్చేవారు. దీంతో నేను నష్టపోయేదానిని. అమూల్ డెయిరీలో మాత్రం పాల నాణ్యత 12 శాతానికి కూడా లెక్క కట్టి లీటరుకు 103 రూపాయలు ఇస్తున్నారు. అంటే లీటరుకు నేను అదనంగా 23 రూపాయలు పొందుతున్నాను. నేను రోజూ ఉదయం 13 లీటర్లు, సాయంత్రం 10 లీటర్లు



పాలు పోస్తున్నాను. ఇప్పుడు వ్యాపారం బాగుంది. ఇంకో గేదె కొనుగోలుకు దరఖాస్తు చేసుకున్నాను. త్వరలోనే రుణం కూడా మంజూరవుతుందని అధికారులు చెప్పారు. ఒంటరి మహిళను కావడంతో ప్రతి నెలా రూ.2,750 పింఛను వస్తోంది. మా చిన్నమ్మాయికి అమ్మ ఒడి పథకం కింద ప్రతి ఏటా రూ.15 వేలు వస్తుండడంతో పిల్లల చదువులకు కూడా ఇబ్బంది లేకుండా పోయింది. పాల విక్రయం ద్వారా.. పశువుల మేత, దాణా ఖర్చులు, అద్దెలు పోను నెలకు రూ.10 వేలు మిగులుతున్నాయి. ఉన్నంతలో ఇబ్బంది లేకుండా జీవిస్తున్నాం.

– దాసం చెంచులక్ష్మి, క్రోసూరు
(ఎస్ఎస్ జిలాని, విలేకరి, క్రోసూరు)

అప్పు లేకుండా వ్యవసాయం

మాది సన్నకారు రైతు కుటుంబం. మాకు నరసన్నపేట సమీపంలో ఒకటిన్నర ఎకరం భూమి ఉంది. నాలుగేళ్ల క్రితం వరకు ఖరీఫ్ వస్తుందంటే చాలు పెట్టుబడుల కోసం వడ్డీ వ్యాపారుల వద్దకు పరుగులు పెట్టాల్సి వచ్చేది. వారు దయతలచి ఇచ్చిన అప్పుతో సాగు చేసేవాళ్లం. పంట చేతికి వచ్చాక వ్యాపారులకు నచ్చిన ధరకే ధాన్యం ఇవ్వాల్సి వచ్చేది. లేకపోతే వడ్డీతో సహా డబ్బు చెల్లించేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఈ ప్రభుత్వం వచ్చాక వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద ఖరీఫ్‌కు ముందు పెట్టుబడి సాయంగా కొంత మొత్తాన్ని, పంట చేతికొచ్చే సమయంలో మరి కొంత మొత్తాన్ని బ్యాంకుల్లో ప్రభుత్వం జమ చేస్తోంది. ఏటా రూ.13,500 వంతున వచ్చింది. దీంతో మా కష్టాలన్నీ తీరుతున్నాయి. అవసరమైన ఎరువులు, విత్తనాలు ఆర్బీకేల ద్వారా రాయితీపైనే కొనుగోలు చేసుకుంటున్నాం. పండిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుండటంతో మద్దతు ధర లభిస్తోంది. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రైతులకు అంతా మేలు జరుగుతోంది. నాకు ఇద్దరు కుమారులున్నారు. వారిద్దరికీ పెళ్లిళ్లు చేశాను. నా భార్య కాలం చేయడంతో చిన్నబ్బాయి దగ్గర ఉంటున్నాను. అందరం కలసికట్టుగా వ్యవసాయం చేసుకుంటున్నాం.



– నేతింటి కిత్తయ్య, భవానీపురం, నరసన్నపేట, శ్రీకాకుళం జిల్లా
(ఎం.రవి, విలేకరి, నరసన్నపేట)

చీకటి నుంచి వెలుగులోకి..

మా నాన్న పేరూరి కుజుడు ఏడాది కిందట చనిపోయారు. మాది తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు. నిరుపేద కుటుంబం. మా అమ్మ కూలీ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తోంది. ఆమెకు వితంతు పింఛను రూ.2,750 వస్తోంది. వచ్చే నెల నుంచి రూ.3 వేలకు పెరుగుతుందని చెబుతున్నారు. మేము ఉన్నత చదువులు చదవాలని కోరిక ఉన్నా, దానికయ్యే ఖర్చు ఎలా భరించాలా అని సతమతం అయ్యాం. పరీక్ష ఫీజులు, ట్యూషన్ ఫీజులు చెల్లించుకోలేక చదువుకు స్వస్తి పలకాలేమోనని భయపడ్డాం. కానీ ఈ ప్రభుత్వం వచ్చాక ఫీజు రీయింబర్స్‌మెంట్ (విద్యా దీవెన) చేస్తోంది. అందువల్లే



నేను ఈ రోజు డిగ్రీ చదువుకుంటున్నాను. బ్యాంక్ ప్రవేశ పరీక్షకు కోచింగ్ తీసుకొని ఉద్యోగంలో స్థిరపడాలని అనుకుంటున్నా. కింది నుంచి పైదాకా విద్యారంగానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. అందువల్లే మా లాంటి పేదలెందరో ఉన్నత చదువులు చదువుకోగలుగుతున్నారు. మరికొందరైతే ఏకంగా విదేశాలకు వెళ్లి చదువుకుంటున్నారు. పిల్లలకు ఉద్యోగాలొస్తేనే మాలాంటి వాళ్లం చీకటి నుంచి వెలుగులోకి వస్తాం. పేదరికం నుంచి బయటపడతాం.

– పి.లీల, డిగ్రీ ద్వితీయ సంవత్సరం, నిడదవోలు
(గాడి శేఖర్ బాబు, విలేకరి, నిడదవోలు)

అసైన్డ్ భూములకు హక్కులపై మరింత స్పష్టత

- హక్కుల కల్పన ఆలస్యమవకుండా ప్రభుత్వం చర్యలు
- అన్ని అంశాలపైనా రెవెన్యూ యంత్రాంగానికి ఆదేశాలిస్తూ జీవో నంబర్ 596 జారీ
- అసైన్డ్ జల వనరుల పోరంబోకు భూములకూ యాజమాన్య హక్కులు
- అసైన్‌దారు పేరు ఏ రెవెన్యూ రికార్డులో ఉన్నా దాన్ని పరిగణనలోకి తీసుకోవాలి



సాక్షి, అమరావతి : అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించే విషయంలో రెవెన్యూ యంత్రాంగానికి ప్రభుత్వం మరింత స్పష్టత ఇచ్చింది. పలు కారణాలతో హక్కులు కల్పించేందుకు వెనుకాడుతున్న నేపథ్యంలో వాటన్నింటిపైనా ఎలా ముందుకెళ్లాలో తెలియజేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ మంగళవారం జీవో నంబర్ 596 జారీ చేశారు. పలు జిల్లాల కలెక్టర్లు, జేసీలు, ఆర్డీవోలు, తహశీల్దార్లతో ఇటీవల నిర్వహించిన వర్క్‌షాప్‌లో చర్చించిన మీదట అసైన్డ్ భూములపై ఆంక్షలు తొలగించే అంశాలపై తాజా ఆదేశాలు జారీ చేశారు. చుక్కల భూములు, ఈనాం భూములు, జాయింట్ ఎల్‌పీఎంల విభజన, ప్రొవిజనల్ పట్టాలు, ఎస్సీ కార్పొరేషన్ భూములకు సంబంధించి స్పష్టత ఇచ్చారు.

ఈ కేసుల్లో యాజమాన్య హక్కులివ్వాలి

- డీకేటీ రిజిస్టర్, డీకేటీ పట్టా ఆఫీస్ కాపీ, అసైన్‌మెంట్ కమిటీ మినిట్స్ లేకపోయినా వెబ్‌ల్యాండ్ అడంగల్, పీఎల్ఆర్, పాత అడంగల్, 10 (1) రిజిస్టర్ వంటి ఏదో ఒక రెవెన్యూ రికార్డులో సంబంధిత రైతు పేరు ఉన్నా, 2017 22ఏ జీవోలు లేక 20 సంవత్సరాల క్రితం జారీ అయిన పట్టాదారు పాస్‌బుక్ ఆధారంగానైనా సంబంధిత భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలి. ఆ భూమిని కేటాయించిన పట్టాదారు ఆధీనంలో ఉంటేనే హక్కులు ఇవ్వాలి. ఒకవేళ ఎవరైనా పట్టాదారు సమర్పించిన పాస్‌బుక్ నకిలీదని తహశీల్దార్ ధ్రువీకరిస్తే, దానిని నిరూపించే బాధ్యత కూడా సంబంధిత తహశీల్దార్‌దే. కాల క్రమంలో రెవెన్యూ పరిపాలనలో జరిగిన మార్పుల వల్ల రికార్డులు అందుబాటులో లేవనే కారణంతో అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులను నిరాకరించకూడదు.

- భూ బదలాయింపు (లాండ్ కన్వర్షన్) జరిగి, అసైన్‌మెంట్ జరిగి 20 సంవత్సరాలు పూర్తయిన జల వనరుల పోరంబోకు భూములపై యాజమాన్య హక్కులివ్వాలి.

- భూ బదలాయింపు జరగకపోయినప్పటికీ, సుప్రీంకోర్టు ఉత్తర్వులు, హైకోర్టు రిట్ పిటిషన్ 140/2022 ఆదేశాల ప్రకారం మినహాయింపు పొందిన భూములకు హక్కులు కల్పించాలి.
- ఏడబ్ల్యూడీ భూములుగా మార్చకుండా తోపు/మేత పోరంబోకులను అసైన్ చేస్తే ఇప్పుడు జిల్లా కలెక్టర్లు ఏడబ్ల్యూడీగా మార్చి వాటికి యాజమాన్య హక్కులివ్వొచ్చు.
- డి పట్టా జారీ అయినా, రికార్డుల్లో ఆ సర్వే నంబర్‌తో సరిపోలకపోతే, వారి ఆధీనంలో ఉన్న భూమి సర్వే నంబర్‌ను నమోదు చేయాలి. అలాంటి భూములకు యాజమాన్య హక్కులు ఇవ్వడం కోసం వారికి భూమి అసైన్ చేసిన పాత తేదీని పరిగణనలోకి తీసుకోవాలి.
- ఖాతా నంబర్ 10 వేల లోపు ఉండి, మిగులు భూమిగా రికార్డయి, అసైన్డ్ భూములుగా నమోదవని వాటిని అసైన్‌మెంట్ రీ వెరిఫికేషన్‌కు పంపాలి. ఇలాంటి భూములకు యాజమాన్య హక్కులిచ్చేందుకు ఎలక్ట్రానిక్ రెవెన్యూ రికార్డుల్లో పట్టాదార్ పేరును మార్చవచ్చు.

- అసైన్డ్ భూములైనా ఆన్‌లైన్ రెవెన్యూ రికార్డుల్లో నమోదుకాని భూములను అసైన్డ్ భూముల జాబితాలో చేర్చేలా దరఖాస్తులను స్వీకరించడానికి ఏపీ సేవా పోర్టల్‌లో ఆప్షన్ ఉంది. ఇలాంటి కేసులను సుమోటోగా స్వీకరించేందుకు జేసీల లాగిన్‌లో అవకాశం కల్పిస్తాం. ఆ తర్వాత నిబంధనల ప్రకారం ఆ భూములకు హక్కులు ఇవ్వాలి.

- అసైన్‌మెంట్ చేసిన రాస్తా పోరంబోకు భూములను ఇప్పుడు భూ మార్పిడి (లాండ్ కన్వర్షన్) చేసి వాటికి హక్కులివ్వాలి
- ఆర్ఎస్ఆర్‌లో అటవీ భూమిగా నమోదైన భూమి అసైన్‌మెంట్ జరిగి ఆర్ఓఆర్ రికార్డుల్లోనూ నమోదై ఉంటే.. ఆ భూమిని అటవీ చట్టంలోని సెక్షన్ 4(1) కింద నోటిఫికేషన్ జారీ చేయకపోతే దానిపై హక్కులివ్వొచ్చు.
- భూమి స్వభావంలో 'ప్రభుత్వ భూమి – నాట్ ఎలాటెడ్'గా నమోదై.., వాస్తవానికి అసైన్‌మెంట్ జరిగి ఉన్న కేసులను జిల్లా స్థాయి వెరిఫికేషన్‌కు పంపాలి. వెరిఫికేషన్‌లో ఆ భూముల హక్కుల కల్పనకు అర్హత సాధిస్తే అప్పుడు వాటిపై హక్కులు ఇవ్వొచ్చు.
- అర్హత ఉన్న అసైన్డ్ భూములు పొరపాటున పట్టా భూమిగా నమోదై 22ఏ జాబితాలో ఉంటే, జిల్లా కలెక్టరు వాటిని ఆ జాబితా నుండి తొలగించాలి. రిమార్క్స్ కాలమ్‌లో యాజమాన్య హక్కులు ఇచ్చిన విధానాన్ని నమోదు చేయవచ్చు.

- రికార్డులు అందుబాటులో లేని, నీటి వనరులుగా గుర్తించిన కారణంగా యాజమాన్య హక్కులు ఇచ్చే విషయంపై నిర్ణయం తీసుకోలేని అసైన్డ్ భూములన్నింటినీ మళ్లీ ధ్రువీకరణ కోసం వీఆర్వో లాగిన్‌కు పంపాలి. ధ్రువీకరణలో అర్హత పొందితే వాటికి హక్కులివ్వాలి.

- 20 సంవత్సరాల క్రితం జారీ అయిన తాత్కాలిక పట్టాలైనా, డీకేటీ పట్టాలు జారీ అయ్యాయా లేదా అనే దాంతో సంబంధం లేకుండా వాటిపై యాజమాన్య హక్కులివ్వాలి.

నేడు 'జగనన్న విదేశీ విద్యాదీవెన' జమ

- అర్హులైన 390 మంది విద్యార్థులకు రూ.41.60 కోట్లు..
- సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన 95 మందికి..
- వారిలో తిరిగి మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన 11 మంది అభ్యర్థులకు ప్రోత్సాహకంగా రూ.100.50 లక్షలు..
- మొత్తం రూ.42.6 కోట్లు నేడు బటన్ నొక్కి జమచేయనున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: విదేశాల్లోని టాప్ యూనివర్సిటీల్లో ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం పేద విద్యార్థులకు సైతం కల్పిస్తూ.. మరోవైపు, సివిల్ సర్వీస్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి అత్యున్నత స్థాయి విధానపరమైన నిర్ణయాల్లో భాగస్వామి కావాలన్న విద్యార్థుల కలల సాకారానికి ఆర్థిక తోడ్పాటునందిస్తూ.. 'జగనన్న విదేశీ విద్యాదీవెన, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం అందించనున్నారు. విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసిస్తున్న అర్హులైన 390 మంది విద్యార్థులకు రూ.41.6 కోట్లను, సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన 95 మంది, వారిలో తిరిగి మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన 11 మంది అభ్యర్థులకు ప్రోత్సాహకంగా రూ.100.5 లక్షలను మొత్తం రూ.42.6 కోట్లను ముఖ్యమంత్రి జగన్ బుధవారం తన క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి వారి ఖాతాల్లో నేరుగా జమచేయనున్నారు.



జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం

సివిల్ సర్వీస్ పరీక్షలో ప్రిలిమినరీ పరీక్ష పాసైన విద్యార్థులకు రూ.1లక్ష ప్రోత్సాహకం.. మెయిన్స్ పరీక్షలో ఉత్తీర్ణులైతే అదనంగా మరో రూ.50 వేల ప్రోత్సాహకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. అలాగే, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాల అభ్యర్థులు తమ లక్ష్యాన్ని చేరుకోవడానికి అవసరమైన శిక్షణతోపాటు వారు సొంతంగా ప్రిపేర్ అయ్యేందుకు ఆర్థికంగా తోడ్పాటునందిస్తోంది. అభ్యర్థులు ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలు పాసైన ప్రతిసారీ రాష్ట్ర ప్రభుత్వం ఈ నగదు ప్రోత్సాహకం అందిస్తోంది.

నిజానికి.. గత ప్రభుత్వంలో సివిల్ సర్వీసెస్ ప్రైవేట్ కోచింగ్ సెంటర్లకు మేలు కలిగేలా అరకొరగా పథకాన్ని అమలుచేసింది. కానీ, వైఎస్ జగన్ ప్రభుత్వం లంచాలకు, వివక్షకు తావులేకుండా అర్హులైన ప్రతి అభ్యర్థికీ లబ్ధిచేకూరుస్తూ నేరుగా వారి ఖాతాల్లో జమచేస్తోంది.

జగనన్న విదేశీ విద్యాదీవెన

కేవలం శ్రీమంతుల పిల్లలకే అందుబాటులో ఉన్న విదేశీ విద్యను పేద విద్యార్థులు సైతం అభ్యసించే వీలు కల్పిస్తూ.. వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్/ టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్ ప్రకారం ఇంజనీరింగ్, మెడిసిన్, లా, జర్నలిజం తదితర 21 ఫ్యాకల్టీలలో ప్రవేశం పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు రూ.1.25 కోట్ల వరకు, ఇతర విద్యార్థులకు రూ.1 కోటి వరకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోపాటు విమాన ప్రయాణం, వీసా ఖర్చులను ప్రభుత్వం భరిస్తోంది. దీనిద్వారా ప్రపంచంలోని టాప్–320కి పైగా అత్యుత్తమ కళాశాలల్లో ఉచితంగా చదువుకునేందుకు మన రాష్ట్ర విద్యార్థులకు అవకాశం కల్పిస్తోంది. ఇక గడిచిన 10 నెలల్లో కేవలం 'జగనన్న విదేశీ విద్యాదీవెన' కింద 408 మంది విద్యార్థులకు ప్రభుత్వం రూ.107.08 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించింది. ఇతర వివరాల కోసం https:// jnanabhumi.ap.gov.in ను చూడవచ్చు.

రేపు 'అల్లూరి' జిల్లాలో సీఎం జగన్ పర్యటన



సాక్షి,అమరావతి: సీఎం జగన్ ఈ నెల 21న (గురువారం) అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలో పర్యటించనున్నారు. 8వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లు అందజేసి, అనంతరం జరిగే బహిరంగ సభలో ఆయన పాల్గొననున్నారు. ఉదయం 8.30 గంటలకు తాడేపల్లి నుంచి బయలుదేరి చింతపల్లి మండలం చౌడుపల్లి చేరుకుంటారు. అక్కడి నుంచి చింతపల్లి చేరుకుని గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో మాట్లాడి ట్యాబ్‌లు అందజేయనున్నారు. ఆ తర్వాత అక్కడి నుంచి బయలుదేరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

దివ్యాంగులకు మరో వరం

- సంక్షేమం, అభివృద్ధిలో ఐదు శాతం
- ప్రభుత్వ ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో దివ్యాంగులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరో వరం ఇచ్చింది. ఇప్పటికే విద్యలో ఐదు శాతం, ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించిన సంగతి తెలిసిందే. తాజాగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో వారికి ఐదు శాతం రిజర్వేషన్లు వర్తింపజేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో పేదరిక నిర్మూలన పథకాలకు మాత్రమే దివ్యాంగులకు మూడు శాతం రిజర్వేషన్ ఉండేది. ఇకపై అన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల్లో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ వర్తిస్తుంది. వ్యవసాయ సాగు భూమి కేటాయింపు, గృహనిర్మాణం, ఉపాధి, వ్యాపారం, ఎంటర్‌ప్రైజెస్, రిక్రియేషన్ సెంటర్స్, ప్రొడక్షన్ సెంటర్ తదితర ప్రోత్సాహకాలకు సైతం ఐదు శాతం రిజర్వేషన్ వర్తిస్తుంది. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయడంలో అన్ని శాఖల అధిపతులు, జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని జయలక్ష్మి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆరోగ్యశ్రీ కొత్త కార్డుల పంపిణీ షురూ

సాక్షి, అమరావతి/పట్నంబజార్ (గుంటూరు) : పేద, మధ్యతరగతి ప్రజలపై వైద్య ఖర్చుల భారం పడకుండా సీఎం జగన్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంపై ప్రచార కార్యక్రమంతో పాటు కొత్తగా రూపొందించిన ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డుల పంపిణీ మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైంది. ఈ పథకం కింద వైద్యఖర్చుల పరిమితిని రూ.25 లక్షలకు ప్రభుత్వం పెంచిన విషయం తెలిసిందే. దీంతో విస్తరించిన ప్రయోజనాలతో కూడిన కొత్త స్మార్ట్‌కార్డులను అందజేస్తూ, పథకం సేవలు ఎలా పొందాలన్న దానిపై ప్రతిఒక్కరికీ వివరించే ప్రచార కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోంది. ఈ ప్రచార, స్మార్ట్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ప్రతి నియోజకవర్గంలో ఎంపిక చేసిన గ్రామాలు, పట్టణాల్లో వార్డులు/డివిజన్లలో ప్రచారం, కార్డుల పంపిణీ చేపట్టారు. సరికొత్త ఫీచర్లతో 1.48 కోట్ల స్మార్ట్ కార్డులను వైద్యశాఖ ముద్రించింది.

ఇంటింటికీ వెళ్లి అవగాహన..

కుటుంబంలో ఎవరికైనా దురదృష్టవశాత్తు జబ్బుచేసినా, ప్రమాదం జరిగినా ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్యసేవలు పొందడం ఎలా అనేదానిపై ప్రజాప్రతినిధులు, ఏఎన్ఎం, సీహెచ్ఓ, వలంటీర్లతో కూడిన బృందాలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రొసీజర్లను 1,059 నుంచి 3,257కు పెంచడం, ఆరోగ్య ఆసరా కింద చికిత్స అనంతరం అందిస్తున్న భృతి, రూ.25 లక్షల వరకూ ఉచిత వైద్యసేవలు ఇలా పథకం ప్రయోజనాలన్నీ ప్రజలకు తెలియజేశారు. ప్రజలు సులువుగా పథకం సేవలు పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆరోగ్యశ్రీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

యాప్‌ను రూపొందించింది. దీనిని ప్రతి ఇంటిలో మొబైల్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేయించి, కుటుంబ సభ్యుల ఐడీ ద్వారా లాగిన్ చేయించి వినియోగంపై అవగాహన కల్పించారు. యాప్‌లో లాగిన్ కావడం ద్వారా పథకం కింద అందే వైద్యసేవలు, నెట్‌వర్క్ ఆస్పత్రులు, గతంలో పొందిన చికిత్సల వివరాలను ఏ విధంగా తెలుసుకోవచ్చో ఏఎన్ఎం, సీహెచ్ఓలు ప్రజలకు వివరించారు. పథకం కింద సేవలు పొందడంలో ఇంకా ఏవైనా అనుమానాలు, సందేహాలు ఉంటే '104' ఫోన్‌ను ఎలా సంప్రదించాలన్న దానిపైనా అవగాహన కల్పించారు. ఇక పనిలో పనిగా ఇప్పటివరకూ దిశ యాప్‌ను ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోని యువతులు, మహిళలు ఉన్నట్లైతే వారి ఫోన్లలో కూడా యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి, అత్యవసర సమయంలో యాప్ ఎలా సహాయపడుతుందో వివరిస్తున్నారు.

ఆరోగ్యశ్రీకి ఏటా రూ.4వేల కోట్లు : మంత్రి రజిని

కాగా, ఆరోగ్యశ్రీ ద్వారా ఎటువంటి రోగాలకు చికిత్స లభిస్తుంది, సందేహాలను నివృత్తి చేస్తూ ప్రచురించిన పోస్టర్లను గుంటూరులో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ఆవిష్కరించి ఆరోగ్యశ్రీ కొత్త స్మార్ట్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక విప్లవాత్మక నిర్ణయాలకు శ్రీకారం చుట్టి వాటిని అమలుచేశారన్నారు. వచ్చే జనవరి 1 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష' సెకండ్ ఫేజ్ కార్యక్రమాన్ని చేపట్టేందుకు దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. సీఎం జగన్ బాధ్యతలు చేపట్టాక ప్రతిఏటా రూ.4వేల కోట్లు చొప్పున ఆరోగ్యశ్రీకి కేటాయించారని.. విలేజ్ క్లినిక్‌లు, పీహెచ్‌సీ, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లతో పాటు వైద్యానికి సంబంధించి రూ.17వేల కోట్లతో నాడు–నేడు కింద అభివృద్ధి పనులు చేశారని తెలిపారు. అలాగే, వైద్య విభాగంలో రాష్ట్రవ్యాప్తంగా 53 వేల పోస్టులను భర్తీచేశారన్నారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఒక మెడికల్ కళాశాల ఏర్పాటుచేస్తున్నామని, ఇందులో భాగంగా ఇప్పటికే ఐదు కళాశాలలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఆరోగ్యశ్రీ సీఈఓ డీకే బాలాజీ, జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డి, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, మేయర్ కావటి మనోహర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ

శిక్షణ పూర్తిచేసుకున్నవారికి పోస్టింగ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ, శిక్షణ పూర్తిచేసుకున్న వారికి పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. తొమ్మిదిమంది అధికారులను బదిలీచేశారు. ఎనిమిదిమందికి సబ్ కలెక్టర్లుగా పోస్టింగ్ ఇచ్చారు.

బదిలీ అయిన అధికారులు..

అధికారి	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
హెచ్ఎం ధ్యానచంద్ర	సచివాలయాల అదనపు డైరెక్టర్	వీసీ, ఎండీ శాప్
టి.ఎస్.చేతన్	జేసీ, సత్యసాయి జిల్లా	డైరెక్టర్, సచివాలయాలు
జె.శివశ్రీనివాసు	జేసీ, అల్లూరి సీతారామరాజు జిల్లా	డైరెక్టర్, బీసీ సంక్షేమశాఖ
శుభం బన్సాల్	సబ్ కలెక్టర్, రంపచోడవరం	జేసీ, తిరుపతి జిల్లా
గీతాంజలి శర్మ	సబ్ కలెక్టర్, తెనాలి	సచివాలయాల అదనపు డైరెక్టర్
అభిషేక్‌కుమార్	సబ్ కలెక్టర్, ఆదోని	జేసీ, సత్యసాయి జిల్లా
కొల్లాబత్తుల కార్తిక్	సబ్ కలెక్టర్, పెనుకొండ	జేసీ, అల్లూరి సీతారామరాజు జిల్లా
సేదు మాధవన్	సబ్ కలెక్టర్, మార్కాపురం	సీఈవో, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్
శోభిక ఎస్.ఎస్.	సబ్ కలెక్టర్ కందుకూరు	ప్రత్యేక అధికారి, మధ్యాహ్న భోజనం

శిక్షణ పూర్తిచేసుకుని సబ్ కలెక్టర్లుగా పోస్టింగ్ పొందిన అధికారులు

అధికారి	పోస్టింగ్	అధికారి	పోస్టింగ్
పి.ధాత్రిరెడ్డి	పాడేరు	ప్రకాష్ జైన్	తెనాలి
అపూర్వ భరత్	పెనుకొండ	రాహుల్ మీనా	మార్కాపురం
అశుతోష్ శ్రీవాత్సవ	కొవ్వూరు	శివనారాయణ్ శర్మ	ఆదోని
గొబ్బిల విద్యాధరి	కందుకూరు	ఎస్.ప్రశాంత్‌కుమార్	రంపచోడవరం

రాష్ట్రానికి రూ.5,858 కోట్ల అదనపు రుణం

విద్యుత్ సంస్కరణలు సమర్థంగా అమలు చేసినందుకు కేంద్రం అనుమతి

సాక్షి, న్యూఢిల్లీ : రాష్ట్రంలో విద్యుత్ సంస్కరణలు సమర్థవంతంగా అమలు చేసినందుకు 0.5 శాతం అదనంగా రుణాలు పొందేందుకు ఏపీ ప్రభుత్వానికి కేంద్రం అనుమతినిచ్చింది. విద్యుత్తు సంస్కరణల్లో మూడు ప్రధాన అంశాలు అమల్లోకి తీసుకొచ్చినందుకు ఈ అవకాశం ఇస్తున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌కు 2022–23 సంవత్సరానికి రూ.5,858 కోట్లు అదనపు రుణాలు తీసుకోవడానికి అనుమతించినట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంగళవారం ఎక్స్ ఖాతా ద్వారా ప్రకటించింది. విద్యుత్ రంగంలో పనితీరు ఆధారంగా స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ)లో సాధారణ నికర రుణ పరిమితికంటే 0.50 శాతం అదనపు రుణాన్ని తీసుకోవడానికి 15వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసినట్లు తెలిపింది. దీనిని అనుసరించి 2022–23 ఆర్థిక సంవత్సరానికి ఆరు రాష్ట్రాలకు రూ.27,238 కోట్లు అనుమతించినట్లు పేర్కొంది. 2021–22లో ఇదే విధంగా 12 రాష్ట్రాలకు రూ.39,175 కోట్లు అనుమతించినట్లు తెలిపింది. 2021–22 సంవత్సరానికి కూడా విద్యుత్ రంగంలో సంస్కరణలకు ఏపీ రూ.3,716 కోట్లు అదనపు రుణాలకు కేంద్రం అనుమతించింది.

విద్యుత్ 'పొదుపు'తో ఇంధన భద్రత

సాక్షి, అమరావతి: విద్యుత్ పొదుపు పాటించడం ద్వారా ఇంధన భద్రతకు తోడ్పాటునందించిన వివిధ సంస్థలు, పరిశ్రమల నిర్వాహకులకు ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు–2023లను రాష్ట్ర ప్రభుత్వం ప్రదానం చేయనుంది. రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14న మొదలైన జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాలు బుధవారంతో ముగుస్తున్నాయి. ఈ నేపథ్యంలో విద్యుత్‌ను పొదుపు చేయడం ద్వారా బిల్లులు తగ్గించుకోవడం, తద్వారా వాతావరణంలో కర్బన ఉద్గారాలను తగ్గించుకోవడంపై ఏపీఎస్ఈసీఎం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.ఎ.వి.పి.కుమారరెడ్డి పలు సూచనలు, చిట్కాలు అందించారు. 'సాక్షి'కి ఆయన వెల్లడించిన విద్యుత్ ఆదా మార్గదర్శకాలు ఇలా..

■ ఇంటి నుంచి బయటకు వెళ్లేముందు లైట్లు, టీవీ ఆఫ్ చేసి వెళ్లాలి. ■ పగటిపూట కర్టెన్లను తెరిచి సూర్య కాంతిని వినియోగించుకోవాలి. ■ ఏసీ ఆన్‌లో ఉన్నప్పుడు కిటికీలు లేదా తలుపులు తెరవరాదు. ■ డ్రైయర్‌ని ఉపయోగించకుండా దుస్తులు ఆరుబయట ఆరబెట్టాలి. ■ లేత రంగు, వదులుగా ఉండే కర్టెన్‌లను ఉపయోగించాలి. పగలు కిటికీలు తెరిచి ఉంచాలి. ■ ఎల్ఈడీ బల్బులు వాడాలి. రాగి చోక్‌ల స్థానంలో ఎలక్ట్రానిక్ చోక్‌లను ఉపయోగించాలి. ■ సన్నని ట్యూబ్ లైట్లు మంచి కాంతిని ఇస్తాయి. ఫిలమెంట్ కంటే తక్కువ విద్యుత్తును వినియోగిస్తాయి. ■ ఎలక్ట్రిక్ ఐరన్, సీలింగ్ ఫ్యాన్ల కోసం సంప్రదాయ రెగ్యులేటర్లకు బదులు ఎలక్ట్రానిక్ రెగ్యులేటర్లను వాడాలి. ■ సీలింగ్ ఫ్యాన్‌ల కంటే ఎక్కువ ఎత్తులో ఎగ్జాస్ట్ ఫ్యాన్‌లను ఇన్‌స్టాల్ చేయాలి. ■ ఆటోమేటిక్ ఉష్ణోగ్రత కటాఫ్‌తో ఐరన్ బాక్స్‌లను ఎంచుకోండి. ఇస్త్రీ చేసేటప్పుడు దుస్తులపై ఎక్కువ నీళ్లు చల్లకూడదు. తడి బట్టలు ఇస్త్రీ చేయరాదు. ■ టీవీ, ఆడియో సిస్టమ్‌లు ఉపయోగంలో లేనప్పుడు పవర్ ఆన్ చేయవద్దు. ■ కంప్యూటర్ తప్పనిసరిగా ఆన్ చేసే ఉంచాల్సి వస్తే, కనీసం మానిటర్‌ను ఆఫ్ చేయాలి. ల్యాప్‌టాప్‌లు, సెల్ ఫోన్‌లు, డిజిటల్ కెమెరాల వంటి బ్యాటరీ ఛార్జర్‌లు అవసరం లేనప్పుడు అన్ ప్లగ్ చేయాలి. ■ ఆటోమేటిక్ టెంపరేచర్ కటాఫ్ ఉన్న ఎయిర్ కండీషనర్లకు ప్రాధాన్యత ఇవ్వాలి. ■ ఏసీతో పాటు ఫ్యాన్‌ని ఆన్‌లో ఉంచండి. రూఫ్ గార్డెన్ ఎయిర్ కండీషనర్‌పై భారాన్ని తగ్గిస్తుంది సన్ ఫిల్మ్‌లు, కర్టెన్లు ఉన్న కిటికీలను ఉపయోగించాలి. ■ మిక్సర్లు, గ్రైండర్లలో పొడి పదార్థాలను గ్రైండింగ్ చేయరాదు. మైక్రోవేవ్ ఓవెన్లు విద్యుత్, గ్యాస్ స్టవ్‌ల కంటే 50 శాతం తక్కువ శక్తిని వినియోగిస్తాయి. ■ వంట సమయానికి చాలా నిమిషాల ముందు ఎలక్ట్రిక్ స్టవ్‌లు ఆఫ్ చేయాలి. ■ నీలిరంగు మంట వస్తుంటే మీ గ్యాస్ స్టవ్ సమర్థవంతంగా పనిచేస్తుందని అర్థం. పసుపుగా వస్తే బర్నర్ శుభ్రపరచాలి. ■ వీలైనంత వరకు కుక్కర్లను ఉపయోగించండి. వంట చేసేటప్పుడు ప్యాన్‌లపై మూతలను ఉంచాలి. ■ ఎలక్ట్రిక్ వాటర్‌హీటర్‌కు బదులు సోలార్ వాటర్ హీటర్ ఉపయోగించాలి.

క్లుప్తంగా...

అధికారం కోసం బాబు అండ్ కో అడ్డదారులు

1,178వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నాయకులు

తాడికొండ: రాష్ట్రంలో ఎలాగైనా అధికారంలోకి రావాలని బాబు అండ్ కో అడ్డదారులు తొక్కుతున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం 1,178వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ 14 సంవత్సరాలు అధికారంలో ఉన్న చంద్రబాబు రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరుడికీ అందాల్సిన హక్కులను హరించివేశాడని మండిపడ్డారు. నాయకులు మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, పులిదాసు, నూతక్కి జోషి పాల్గొన్నారు.

లోకేశ్ చేసింది లక్ష్యం లేని యాత్ర

వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి కారుమూరి వెంకటరెడ్డి



సాక్షి, అమరావతి: రాజకీయాల్లో ఎంతో విలువైన పాదయాత్ర లక్ష్యాన్ని, అర్థాన్ని పూర్తిగా మార్చేసిన వ్యక్తి లోకేశ్ అని, ఆయన లక్ష్యం లేని యాత్ర చేశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కారుమూరి వెంకటరెడ్డి పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో 'సింగడు అద్దంకి వెళ్లాడు.. వచ్చాడు' అనే సామెత ఉందని.. ఆ సామెత చందంగా నారా సింగడు ఉరఫ్ లోకేశ్ రాష్ట్రంలో పాదయాత్ర మొదలుపెట్టి ముగించారని ఎద్దేవా చేశారు. అసలెందుకు నువ్వు యాత్ర చేశావంటే.. ఏమో చేశాను.. ముగించానని చెబుతున్నారన్నారు. యువగళం పేరిట ఆయన చేసిన యాత్రకు ఒక లక్ష్యమంటూ లేదని.. ఎవరి కోసం పాదయాత్ర చేశారో అతనికే తెలియడం లేదని అన్నారు. 2019లోనే టీడీపీ, జనసేన పతనం మొదలైందని, 2024లో 175కి 175 స్థానాలూ వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందన్నారు.

లోకేశ్‌కు మెచ్యూరిటీ వచ్చింది

మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు



ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): 'యువగళం' పాదయాత్రతో టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు మరో 30 నుంచి 40 ఏళ్ల పార్టీని నడిపించగల సామర్థ్యం వచ్చిందని మాజీ మంత్రి, విశాఖ ఈస్ట్ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. విశాఖ ఎంవీపీ కాలనీలోని తన నివాసంలో మంగళవారం గంటా శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడుతూ పాదయాత్ర ద్వారా లోకేశ్‌కు పూర్తి మెచ్యూరిటీ వచ్చిందని చెప్పారు. అన్ని అంశాలపైనా అవగాహనతో మాట్లాడుతున్నారని తెలిపారు.

రాష్ట్రంలో ప్రతిపక్ష పాత్ర పోషిస్తోంది బీజేపీనే..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



ఎంవీపీకాలనీ (విశాఖ): రాష్ట్రంలో బీజేపీ ప్రతిపక్ష పాత్ర పోషిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి చెప్పారు. ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలపై పోరాడుతున్న ఏకైక పార్టీ బీజేపీ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను వినియోగించుకుంటూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సొంతడబ్బా కొట్టుకుంటున్నదని ఆరోపించారు. మద్యం రేట్లు విపరీతంగా పెంచి, నాణ్యత లేని మద్యం సరఫరా చేస్తూ కోట్లు దండుకుంటున్నారన్నారు. విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్రానికి పంపలేదన్నారు. ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె విద్యాసంస్థ ఏర్పాటుకు విశాఖలో ఏ విధంగా భూమి కేటాయించారని ప్రశ్నించారు. ఎంపీ జీవీఎల్ నరసింహారావు, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు పాల్గొన్నారు.

'ఉక్కు' ప్రైవేటీకరణను అడ్డుకోవాలి: సీపీఎం



సాక్షి, అమరావతి: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయడానికి మూడేళ్లుగా కేంద్ర ప్రభుత్వం కుయుక్తులు పన్నుతోందని, దీన్ని అడ్డుకోవాలని రాష్ట్రానికి చెందిన ఎంపీలందరికీ లేఖ రాసినట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు చెప్పారు. విజయవాడలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమలో ఉత్పత్తికి కీలకమైన బ్లాస్ట్ ఫర్నెస్ 3 పనిచేసేందుకు సుమారు రూ.1,200 కోట్లు అవసరం ఉందన్నారు. ఆ నిధులను మంజూరు చేయకుండా ప్రైవేటుకు అప్పగించాలని కేంద్రం కుతంత్రాలు పన్నుతోందన్నారు.

పోలిపల్లి భూ బాధితుల ఆందోళన

లోకేశ్ యువగళం యాత్ర ముగింపు సభ జరిగే గ్రామంలోనే టీడీపీ నాయకుల భూ అక్రమాలు

న్యాయం జరిగే వరకు పోరాడతామని స్పష్టంచేసిన భూమి యజమాని వారసులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లిలో టీడీపీ కబ్జాదారుల చేతుల్లో మోసపోయిన బాధితులు మంగళవారం ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ టీడీపీ నేతలు కబ్జా చేసిన తమ భూముల్లో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన ప్రదర్శన చేశారు. ఇదే ప్రాంతంలో బుధవారం టీడీపీ ప్రధాన కార్యదర్శి లోకేశ్ పాదయాత్ర ముగింపు సభ జరుగుతోంది. 'అయ్యా చంద్రబాబు, లోకేశ్.. మీ తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు తప్పుడు పత్రాలు, ఫోర్జరీ సంతకాలతో మా భూములు కాజేశారు. ప్రశ్నిస్తే అధికార బలంతో అప్పట్లో మారణాయుధాలతో దాడిచేశారు. మమ్మల్ని భయపెట్టారు. ఇప్పుడు అక్కడే పాదయాత్ర ముగింపు సభ నిర్వహిస్తున్నారు. ప్రజలకు మేలు చేసే వారే అయితే తక్షణమే మా భూములను అప్పగించండి. మీ చిత్తశుద్ధిని నిరూపించుకోండి' అంటూ బాధితులు ఆందోళన చేశారు. ప్రశ్నిస్తాను అంటూ చెప్పే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా తమ సమస్యపై టీడీపీ నాయకులను ప్రశ్నించాలని కోరారు. పోలిపల్లికి చెందిన భూమి యజమాని తిరుమారెడ్డి ఆదినారాయణ వారసులు సుమారు 30 మంది మంగళవారం ఉదయం ఆ భూమిలోకి వెళ్లి నిరసన తెలిపారు. టీడీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు, మద్దతుదారులు తమకు వారసత్వంగా చెందాల్సిన సుమారు 73.58 ఎకరాలను ఫేక్ పట్టాదారు పుస్తకాలు, అధికారుల ఫోర్జరీ సంతకాలు, అక్రమ రిజిస్ట్రేషన్లతో కబ్జా చేశారని ఆరోపించారు. తమకే చెందిన మరో 1.74 ఎకరాల భూమి 2000 సంవత్సరంలో జాతీయ రహదారి విస్తరణలో పోయిందని, ఆ పరిహారం సుమారు రూ.18 లక్షలు కూడా నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు సోదరుడు, భోగాపురం మండల టీడీపీ అధ్యక్షుడైన కర్రోతు సత్యనారాయణ తప్పుడు పత్రాలతో కాజేశారని వాపోయారు. అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి తప్పుడు పత్రాలతో 3.02 ఎకరాల భూమిని సైతం సత్యనారాయణ ఆక్రమించాడని చెప్పారు. ఇదే అదనుగా మరికొందరు టీడీపీ నాయకులు కొందరు బినామీల పేర్లతో 10 ఎకరాలు, మరికొందరు బినామీల పేర్లతో 60.55 ఎకరాల భూమిని ఆక్రమించారన్నారు. తమ భూమిని తమకిచ్చేయాలని కోరిన తమపై మారణాయుధాలతో దాడి చేశారని తెలిపారు. అప్పటి టీడీపీ పాలనలో ఓ పోలీస్ అధికారి ఆక్రమణదారులకే సహకరించారని ఆరోపించారు. తర్వాత ఆయన భార్య, బావమరిది పేర్లతో దాదాపు నాలుగు ఎకరాలు బదలాయించుకోవడమే అందుకు సాక్ష్యమని చెప్పారు. ఆ పెత్తందారులు ఇన్నాళ్లూ తమను భయపెట్టారని, న్యాయం కోసం ఇప్పుడు ధైర్యంగా బయటకొచ్చి పోరాటం చేస్తున్నామని వెల్లడించారు. యువగళం సభ కోసం పోలిపల్లి వస్తున్న చంద్రబాబు, లోకేశ్ టీడీపీ కబ్జాదారులకు చెప్పి తమ భూమి తమకు తిరిగి ఇప్పించాలని కోరారు. పవన్ కళ్యాణ్ కూడా తమ సమస్యపై స్పందించాలన్నారు. తమకు న్యాయం జరిగే వరకూ ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



పోలిపల్లిలో యువగళం ముగింపు సభకు ఏర్పాట్లు

నేడు యువగళం ముగింపు సభ

బుధవారం లోకేశ్ పాదయాత్ర ముగింపు సభ కోసం పోలిపల్లిలో ఓ ప్రైవేట్ సంస్థ లేఅవుట్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ భారీ వేదిక నిర్మిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి ప్రత్యేక రైళ్లు, బస్సులు, వాహనాల్లో జనాన్ని తరలించడానికి ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమం కోసం లోకేశ్, ఆయన కుటుంబ సభ్యులు సోమవారం అర్ధరాత్రి ఓ ప్రైవేటు రిసార్ట్స్‌కు చేరుకున్నారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

సీట్ల మార్పు గెలుపు వ్యూహమే

మంత్రి మేరుగు నాగార్జున



నల్లజర్ల: సీట్ల మార్పు గెలుపు వ్యూహంలో భాగమేనని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున స్పష్టం చేశారు. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్లలో మంగళవారం ఆయన ఎమ్మెల్యే తలారి వెంకట్రావుతో కలసి విలేకరులతో మాట్లాడారు. సామాజిక సమీకరణలు, రాజకీయ పరిణామాలు, కార్యకర్తల అనుకూలత వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుని తమ పార్టీ అధిష్టానం సీట్లు మార్పిందన్నారు. గత ఎన్నికల్లో రాష్ట్రంలోని 29 ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాలలో 28 సీట్లను వైఎస్సార్‌సీపీ గెల్చుకుందన్నారు. ఈ దఫా అన్ని స్థానాలను కైవసం చేసుకునే ఉద్దేశంతో సీట్ల మార్పు అంశాన్ని పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిశీలిస్తున్నారన్నారు. అందితే జుత్తు.. అందకపోతే కాళ్లు పట్టుకున్న చందంగా చంద్రబాబు నాయుడు వైఖరి ఉందన్నారు. దేశ రాజకీయాలనే శాసించానని చెప్పే ఈ నాయకుడు సినిమా వాళ్ల ఇళ్లకు వెళ్లి సాష్టాంగపడే పరిస్థితికి దిగజారారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ సుపరిపాలనతో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఏం చేయాలో పాలుపోని స్థితిలో ఉన్నారన్నారు. యువగళం పేరుతో లోకేశ్ చేస్తున్న పాదయాత్ర ఉద్దేశం ఏమిటో ఆయనకే తెలియదని ఎద్దేవా చేశారు.

కౌలు రైతన్నలపై రామోజీ కుళ్లు

భూ యజమానులతో సమానంగా కౌలుదారులకు సంక్షేమ ఫలాలు.. అయినా పెత్తందారీ పోకడలతో రామోజీ రోత రాతలు



సాక్షి, అమరావతి: బడుగు బలహీన వర్గాలకు చెందిన వారే అత్యధికంగా ఉండే కౌలు రైతులకు మంచి చేస్తుంటే ఈనాడు రామోజీ కుళ్లుతో కుతకుతలాడిపోతున్నారు! వ్యవసాయాన్ని పండుగలా మార్చిన ఈ ప్రభుత్వంపై అభాండాలు వేస్తూ రోత రాతలకు తెగబడ్డారు. భూ యజమానులతోపాటు వాస్తవ సాగుదారులకూ సంక్షేమ ఫలాలను అందిస్తూ మేలు చేస్తున్న ప్రభుత్వం మరెక్కడైనా ఆయనకు కనిపించిందా? గత ప్రభుత్వాలు కనీసం ఆలోచన కూడా చేయని పంట సాగు హక్కుదారుల చట్టం 2019ని తేవడమే కాకుండా సీసీఆర్సీల ఆధారంగా అన్ని ప్రయోజనాలను సీఎం జగన్ అందిస్తున్నారు. వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం నుంచి పంట రుణాలు, సున్నా వడ్డీ రాయితీతో పాటు దురదృష్టవశాత్తూ ఆత్మహత్యలకు పాల్పడ్డ అన్నదాతల కుటుంబాలకు వారు కౌలు రైతులైనా సరే రూ.7 లక్షల చొప్పున పరిహారం అందిస్తున్నారు. కౌలు రైతులకు ఈ క్రాప్ ప్రామాణికంగా సబ్సిడీ విత్తనాలు, ఎరువులతోపాటు పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ), ఉచిత పంటల బీమాతో లబ్ధి చేకూరుస్తున్నారు. తుపాన్‌తో నష్టపోయిన అన్నదాతలను ఆదుకునేందుకు రంగు మారిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. గతంలో ఎప్పుడూ ఏ ప్రభుత్వమూ అలా కొనుగోలు చేయలేదు.

రికార్డు స్థాయిలో సీసీఆర్సీలు

భూ యజమాని హక్కులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా వాస్తవ సాగుదారులకు ప్రభుత్వం పంట సాగుదారు హక్కు పత్రాలు (సీసీఆర్సీ) జారీ చేస్తోంది.



ఏటా ఖరీఫ్‌కు ముందు ఆర్బీకేల ద్వారా గ్రామ స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. 2019 నుంచి ఇప్పటివరకు 25,86,178 మంది కౌలు రైతులకు సీసీఆర్సీలు జారీ చేశారు. అత్యధికంగా ఈ ఏడాది 8,25,054 మందికి సీసీఆర్సీలు జారీ అయ్యాయి. వాస్తవ సాగుదారులందరికీ పంట రుణాలివ్వాలన్న సంకల్పంతో పీఏసీఎస్‌లను ఆర్బీకేలతో అనుసంధానం చేశారు. సీసీఆర్సీలు లేని కౌలు రైతులను గుర్తించి జాయింట్ లయబిలిటీ గ్రూపులు (జేఎల్‌జీ) నెలకొల్పి రుణాలు అందిస్తున్నారు. 2019 నుంచి ఇప్పటివరకు 14.39 లక్షల మంది కౌలుదారులకు రూ.8,246 కోట్ల రుణాలు అందాయి.

కౌలు రైతుకూ సంక్షేమ ఫలాలు

దేశంలోనే తొలిసారిగా మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే కౌలు రైతులకు రూ.13,500 పెట్టుబడి సాయాన్ని అందచేస్తోంది. కేంద్రం ఇవ్వకున్నా వైఎస్సార్ రైతు భరోసాతో సహా భూ యజమానులకు వర్తింపచేసే సంక్షేమ ఫలాలన్నీ భూమిలేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సాగుదారులతో పాటు అటవీ, దేవదాయ భూమి సాగుదారులకు కూడా ప్రభుత్వం అందిస్తోంది. సీసీఆర్సీ కార్డుల ఆధారంగా 9.52 లక్షల మందికి రూ.1,235.03 కోట్ల మేర వైఎస్సార్ రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని అందచేశారు. రూ.లక్ష లోపు పంట రుణాలు పొందిన కౌలుదారులకు ఈ - క్రాప్ ఆధారంగా వైఎస్సార్ సున్నావడ్డీ రాయితీ కూడా అందేలా చర్యలు చేపట్టారు. ఇలా ఇప్పటి వరకు 30 వేల మందికి రూ.6.26 కోట్ల సున్నా వడ్డీ రాయితీని అందించారు. 3.55 లక్షల మందికి రూ.731.08 కోట్ల పంటల బీమా పరిహారం, 2.41లక్షల మందికి రూ.253.56 కోట్ల పంట నష్ట పరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ) పంపిణీ చేశారు. దురదృష్టవశాత్తూ ఆత్మహత్యకు పాల్పడ్డ కౌలు రైతుల కుటుంబాలకు భూ యజమానులతో సమానంగా రూ.7 లక్షల పరిహారాన్ని ప్రభుత్వం అందిస్తోంది. 2019 నుంచి ఇప్పటివరకు రూ.90.72 కోట్లు పరిహారం అందించగా కౌలు రైతులకు రూ.34.65 కోట్లు సాయం అందింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన రైతు ఆత్మహత్యలపై పునర్విచారణ జరిపి 474 మందికి రూ.23.70 కోట్లు పరిహారం కింద ఈ ప్రభుత్వమే చెల్లించింది. తాజాగా తుపాన్‌తో నష్టపోయిన కౌలు రైతులు, అటవీ భూ సాగుదారులకు సైతం పంట నష్ట పరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే కేంద్ర బృందాలు రాష్ట్రంలో పర్యటించాయి. 4.42 లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బ తిన్నట్లు గుర్తించి రూ.703 కోట్ల పెట్టుబడి రాయితీ ఇవ్వాలని అంచనా వేశారు. ప్రస్తుతం పంట నష్టం తుది అంచనాల ప్రక్రియ కొనసాగుతోంది. భూ యజమానులతో పాటు సీసీఆర్సీ కార్డులు పొందిన కౌలు రైతులకు కూడా 80 శాతం రాయితీతో 86 వేల క్వింటాళ్ల విత్తనాలను తిరిగి విత్తుకునేందుకు ప్రభుత్వం ఇప్పటికే సరఫరా చేసింది.

అప్పులంటూ అబద్ధాల డప్పు

▶ మొదటి పేజీ తరువాయి

డొల్లతనాన్ని నిరూపిస్తూ.. ఆర్బీఐ, కాగ్ అధికారిక నివేదికలను దువ్వూరి కృష్ణ బయటపెట్టారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో మీడియాకు వాస్తవాలను వివరించారు. అవి ఆయన మాటల్లోనే...



దువ్వూరి కృష్ణ

అబద్ధాలే.. ఆధారాలేవి?

ఊహాజనిత గణాంకాలతో, లేని అప్పులు ఉన్నాయంటూ ఈనాడు నిస్సిగ్గుగా పచ్చి అబద్ధాలను అచ్చు వేసింది. ప్రతి గొంతుతోనూ అబద్ధాలాడే 'దశకంఠుడి'గా రామోజీ దిగజారిపోయారు. రాష్ట్ర అప్పులు ఆర్బీఐ, కేంద్ర ఆర్థిక శాఖ నిబంధనల మేరకు పరిమితికి లోబడే ఉన్నాయి. కోవిడ్‌తో రెండేళ్లు ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ టీడీపీ హయాంలో కన్నా ఇప్పుడే రాష్ట్ర ప్రభుత్వ అప్పుల వృద్ధి తక్కువగా ఉంది. మార్కెట్ రుణాలతో పాటు నాబార్డు, విద్యుత్ సంస్థలు, వివిధ కార్పొరేషన్లు, బాండ్ల గ్యారెంటీతో పాటు గ్యారెంటీ ఇవ్వకుండా తీసుకున్న మొత్తం అప్పులు రూ.6.38 లక్షల కోట్లు మాత్రమే. దాన్ని రూ.10.11 లక్షల కోట్లుగా పేర్కొంటూ 'ఈనాడు' ఏ అధికారిక నివేదిక ఆధారంగా రాసిందో చెప్పాలి. లేదంటే కాగ్, ఆర్బీఐ అధికారిక నివేదికల ప్రకారం నేను వెల్లడించిన గణాంకాలను ప్రచురించాలి.

పెండింగ్ బిల్లులపై సొంత లెక్కలా?

పెండింగ్ బిల్లులు రూ.21 వేల కోట్లు మాత్రమే ఉన్నాయని ఇటీవల అసెంబ్లీలో ఆర్థిక మంత్రి ప్రకటించగా రూ.1.70 లక్షల కోట్లు పెండింగ్ బిల్లులున్నట్లు రామోజీ పచ్చి అబద్ధాలు ఎలా ప్రచురిస్తారు? ప్రభుత్వం బడ్జెట్‌లో చేసే అప్పులతో పాటు గ్యారెంటీతో చేసిన అప్పులు, గ్యారెంటీ ఇవ్వని అప్పులన్నీ కూడా ఎఫ్‌ఆర్‌బీఎం నిబంధనల మేరకు అసెంబ్లీకి సమర్పించాం. ఈనాడు తనకు నచ్చిన ఊహాజనిత గణాంకాలతో అప్పులపై తప్పుడు కథనాలు రాస్తోంది. అప్పులపై ఎన్నిసార్లు వాస్తవాలు వెల్లడించినా పదేపదే దుష్ప్రచారానికి పాల్పడుతూ టీడీపీ ప్రయోజనాల కోసం పనిచేస్తోంది.

హెచ్చరికలంటూ అవగాహనారాహిత్యం..

ఆర్బీఐ గానీ, కేంద్ర ఆర్థికశాఖగానీ అప్పులపై రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించలేదు. అసలు నిబంధనల మేరకు అప్పులకు అనుమతిస్తారు. ఒకవేళ నిబంధనలు మీరితే అప్పులు ఇవ్వడం నిలిపేస్తారు. అంతేగానీ హెచ్చరికలు ఉండవు. ఈ మాత్రం కనీస అవగాహన కూడా రామోజీరావుకు లేదు. కేంద్రానికి గానీ, రాష్ట్ర ప్రభుత్వాలకు గానీ అనధికారిక అప్పులు ఉండవనే సంగతి తెలియకపోవడం 'ఈనాడు' అవగాహనారాహిత్యానికి నిదర్శనం.

అనధికారిక అప్పులా?

మార్గదర్శి పేరుతో నిబంధనలకు విరుద్ధంగా అనధికారిక డిపాజిట్లు సేకరించడం రామోజీకే చెల్లింది. ప్రభుత్వాలకు బ్యాంకులు గానీ, ఆర్థిక సంస్థలు గానీ ఏ అప్పులిచ్చినా అవి అధికారికంగానే ఇస్తాయి. అనధికారికంగా ఒక్క రూపాయి కూడా ఇవ్వరనే కనీస ఇంగిత జ్ఞానం కూడా లేదా? మార్వాడీ దగ్గరకు వెళ్లి తాకట్టు పెట్టి అప్పులు తీసుకోవడం కేంద్రంతో పాటు ఏ రాష్ట్ర ప్రభుత్వానికీ సాధ్యం కాదు. ప్రభుత్వానికి అప్పులు చెల్లించే ఉద్దేశం లేదంటూ మరో అబద్ధాన్ని ఈనాడు అచ్చేసింది. అప్పులను వాయిదాల ప్రకారం ప్రభుత్వాలు తీరుస్తూ ఉంటాయి. తీర్చకపోతే డిఫాల్ట్ అవుతాయి. అది కూడా తెలియదా?

జీఎస్‌డీపీతో అప్పులను పోల్చి చూస్తే

వివరం	విలువ రూ. కోట్లలో
జూన్2014 నాటికి రాష్ట్ర ప్రభుత్వ, పీఎస్‌యూల అప్పు విలువ	1,53,346.80
మే 2019 నాటికి రాష్ట్ర ప్రభుత్వ, పీఎస్‌యూల అప్పు విలువ	4,12,288.00
టీడీపీ 5ఏళ్ల కాలంలో పెరిగిన అప్పు విలువ	2,58,941.20
టీడీపీ 5 ఏళ్ల కాలంలో మొత్తం రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువ	34,73,475.00
5 ఏళ్ల కాలంలో జీఎస్‌డీపీలో పెరిగిన అప్పుల వాటా	7.45%
మే 2019 నాటికి రాష్ట్ర ప్రభుత్వ, పీఎస్‌యూల అప్పు విలువ	4,12,288.00
మార్చి 2023 నాటికి రాష్ట్ర ప్రభుత్వ, పీఎస్‌యూల అప్పు విలువ	6,38,212.72
నాలుగేళ్ల కాలంలో వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం చేసిన అప్పు	2,25,924.72
నాలుగేళ్ల వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర జీఎస్‌డీపీ విలువ	43,34,191.00
నాలుగేళ్ల వైఎస్‌ఆర్‌సీపీ కాలంలో జీఎస్‌డీపీలో అప్పుల వాటా	5.21%

గత అప్పులకు ఇప్పుడు కోత

రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో అప్పుల శాతం టీడీపీ హయాంతో పోలిస్తే ఇప్పుడు తక్కువే. వాస్తవానికి గత సర్కారు నిబంధనల కంటే ఎక్కువగా అప్పులు చేసింది. దాంతో కేంద్రం ఇపుడు వాటిని తగ్గిస్తోంది. రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ బాండ్ల జారీ ద్వారా రుణం తీసుకోవడానికి సెబీ అనుమతించింది. అయితే అవసరం లేదు కాబట్టి తీసుకోలేదు. దీన్ని కూడా వక్రీకరిస్తూ రాజ్యాంగ విరుద్ధం అన్నట్లు తప్పుడు కథనాలు ప్రచురించారు.

పరిమితికి లోబడే గ్యారెంటీలు

గ్యారెంటీలు రాష్ట్ర ఆదాయంలో 80 శాతమే ఉన్నాయి. ఇవి నిబంధనల కన్నా తక్కువే. పెండింగ్ బిల్లుల విషయంలో 'ఈనాడు'వి పచ్చి అబద్ధాలు. జీతాలు గానీ పెన్షన్లు గానీ ఆగలేదు. అలాంటప్పుడు ఇన్ని పెండింగ్ బిల్లులు ఎలా ఉంటాయి? కోవిడ్ కారణంగా రాష్ట్రం 66 వేల కోట్లు రూపాయల ఆదాయం కోల్పోయినప్పటికీ టీడీపీ హయాంతో పోలిస్తే తక్కువగానే అప్పు చేసింది. గత సర్కారు హయాంతో పోల్చితే ఆస్తుల కల్పనకు వెచ్చించిన మూల ధన వ్యయం ఇప్పుడే ఎక్కువ.

రాష్ట్ర అప్పుల వివరాలు ప్రభుత్వాల వారీగా...(రూ. కోట్లలో)

వివరం	రాష్ట్ర విభజన సమయానికి	మే,2019లో టీడీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి	మార్చి,2023 నాటికి (నాలుగేళ్లలో)
రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యక్ష అప్పులు			
రాష్ట్ర ప్రభుత్వ అప్పు	1,18,050.93	2,71,797.56	4,28,715.70
ప్రభుత్వ గ్యారంటీతో అప్పు	14,028.23	59,257.31	1,44,875.00
మొత్తం రాష్ట్ర ప్రభుత్వ అప్పు	1,32,079.16	3,31,054.87	5,73,590.70
సగటున ఏడాదికి అప్పుల్లో వృద్ధి		20.17%	15.42%
ప్రభుత్వ గ్యారంటీ లేకుండా పీఎస్‌యూల అప్పుల వివరాలు			
విద్యుత్ రంగ కార్పొరేషన్ల మొత్తం అప్పు	29,703.04	69,596.27	97,492.08
విద్యుత్ కొనుగోళ్లకు చెల్లించాల్సిన బకాయిలు	2,893.23	21,540.96	11,602.87
మొత్తం విద్యుత్ రంగ అప్పులు	32,596.27	91,137.23	1,09,094.95
ప్రభుత్వ గ్యారంటీ లేని విద్యుత్ కార్పొరేషన్ అప్పులు	18,374.41	59,692.17	53,019.15
గ్యారంటీ లేకుండా చెల్లించాల్సిన బకాయిలు	21,267.64	81,233.13	64,622.02
విద్యుత్ రంగంలో సగటు అప్పుల వృద్ధి		30.74%	-5.79%
మొత్తం రాష్ట్ర ప్రభుత్వ అప్పులు, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల అప్పులు కలిపితే			
మొత్తం అప్పులు	1,53,346.57	4,12,288.04	6,38,217.85
సగటు అప్పుల వృద్ధిరేటు		21.87%	12.07%

వివరం	ఈనాడు పేర్కొన్న తప్పుడు సమాచారం	మార్చి,2023 నాటికి వాస్తవ విలువ రూ. కోట్లలో
బహిరంగ మార్కెట్ రుణాలు	3,76,000.00	3,11,234.90
ఉదయ్ బాండ్స్	8,256.00	8,256.00
నాబార్డు నుంచి రుణాలు	9,767.00	8,384.00
కేంద్రం నుంచి తీసుకున్న రుణాలు	33,118.00	28,066.40
ఇతర బాండ్స్	1,500.00	1,500.00
మొత్తం ప్రభుత్వ అప్పు	4,28,641.00	3,57,441.30
చిన్నమొత్తాల పొదుపు	6,602.00	7,772.90
ప్రావిడెంట్ ఫండ్	36,246.20	28,695.20
డిపాజిట్లు	28,286.20	30,350.10
రిజర్వ్ ఫండ్స్	77,195.00	71,191.60
ప్రజా ఖాతా	77,195.00	71,191.60
విద్యుత్ రంగంలో గ్యారంటీ లేని రుణాలు	95,000.00	53,019.15
పౌరసరఫరాల శాఖ రుణాలు	50,000.00	29,900.00
మద్యం, ఇతర కార్పొరేషన్ రుణాలు	1,95,000.00	1,14,975.00
కార్పొరేషన్ లోన్స్	3,40,000.00	1,97,894.15
మొత్తం అప్పులు	8,45,836.00	6,26,527.05
తేడా	2,19,308.95	

మూలధన వ్యయం వివరాలు

ఆర్థిక సంవత్సరం	మూలధన వ్యయం రూ.కోట్లలో
2014-19 టీడీపీ హయాంలో	
2014-15	7,265.00
2015-16	15,042.00
2016-17	15,707.00
2017-18	16,280.00
2018-19	21,845.00
మొత్తం	76,139.00
ఏడాదికి సగటు వ్యయం	15,227.80
2019-23 వైఎస్సార్ సీపీ పాలనలో..	
2019-20	17,601.00
2020-21	20,690.00
2021-22	18,511.00
2022-23(సవరించిన)	7,581.58
2023-24(మొదటి 6 నెలలు)	16,576.88
మొత్తం	80,960.46
సగటు వ్యయం	17,991.21

రామోజీ.. ఇదేం డ్రామా!

- వెబ్‌సైట్‌లో వాస్తవాలు.. పత్రికలో అబద్ధాలా?
- అవకాశం ఉన్నా అప్పు తీసుకోలేదని పత్రికలో రాయలేదు ఎందుకు?

సాక్షి, అమరావతి: రామోజీ రాతల్లో దురుద్దేశాలను పాఠకులు కష్టపడి గ్రహించాల్సిన అవసరం లేదు! ఎందుకంటే తన సొంత పత్రిక, వెబ్‌సైట్ ద్వారా వాటికి ఆయనే కౌంటర్లు వేసుకుంటున్నారు కాబట్టి!! కేంద్రం వద్దంటున్నా, ఆర్బీఐ హెచ్చరిస్తున్నా బేఖాతరంటూ రాష్ట్ర ప్రభుత్వం రుణాలు తీసుకుంటోందని ఈనాడు మంగళవారం ఓ కథనాన్ని అచ్చేసింది. అదే రోజు 'ఈనాడు డాట్‌నెట్' మాత్రం అందుకు విరుద్ధంగా మరో కథనాన్ని వదిలింది. విద్యుత్ రంగంలో సంస్కరణలు అమలు చేసినందుకుగాను అదనంగా 0.5 శాతం రుణాలు పొందేందుకు ఏపీ సహా ఆరు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందనేది ఆ వార్త సారాంశం. 2021–22లో దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాలకు ఈ అవకాశం దక్కగా ఈసారి మాత్రం ఆరు రాష్ట్రాలకే అవకాశం లభించిందని, అందులో ఆంధ్రప్రదేశ్‌కు కూడా ఉందని వెబ్‌సైట్ స్పష్టంగా పేర్కొంది. ఈ వెసులుబాటుతో ఏపీ రూ.5,858 కోట్ల రుణాన్ని 15వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు మార్కెట్ నుంచి అదనంగా పొందేందుకు కేంద్రం అనుమతించింది. ఇదే విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సామాజిక మాధ్యమం (ఎక్స్) ద్వారా స్వయంగా వెల్లడించారు. అదనపు రుణాలు పొందేందుకు అవకాశం ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం అలా తీసుకోలేదు. ఈనాడు పత్రిక మాత్రం రుణాలు ఎక్కువ తీసుకుంటున్నారని, కేంద్ర ప్రభుత్వం వద్దంటోందని అడ్డగోలుగా అబద్ధాలను వండి వార్చింది. అదే మీడియాకు చెందిన వెబ్‌సైట్ మాత్రం వాస్తవాలను బహిర్గతం చేయడంతో రామోజీ పన్నాగం బెడిసికొట్టింది. ఆయన ద్వంద్వ వైఖరికి ఇంత కన్నా నిదర్శనం ఏం కావాలి?



ఈనాడు వెబ్‌సైట్‌లో రాష్ట్రం రుణం పొందేందుకు కేంద్రం అనుమతి అంటూ పెట్టిన వార్త

ఇది కదా.. మానవత్వమంటే!

చిన్నారి గుండె మార్పిడికి విస్తృత చర్యలకు ఆదేశించిన సీఎం

- శ్రీకాకుళం నుంచి గుండెను తరలించేందుకు ప్రత్యేక హెలికాప్టర్ ఏర్పాటు
- 3 గంటల్లో తిరుపతికి గుండె తరలింపు
- 50 ఏళ్ల వ్యక్తి గుండెను 11 ఏళ్ల చిన్నారికి అమర్చిన వైద్యులు
- 6 గంటల పాటు శ్రమించిన డాక్టర్ల బృందం..ఆపరేషన్ విజయవంతం





హెలికాప్టర్‌లో తరలిస్తున్న గుండె (ఇన్‌సెట్‌లో) పొట్నూరు రాజేశ్వరరావు (ఫైల్)

తిరుపతి తుడా/శ్రీకాకుళం రూరల్: సీఎం వైఎస్ జగన్ మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. గుండె మార్పిడి అనివార్యమైన 11 ఏళ్ల చిన్నారికి సకాలంలో గుండెను శ్రీకాకుళం నుంచి తరలించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శ్రీకాకుళం నుంచి విశాఖ ఎయిర్‌పోర్ట్ కు చాపర్, అక్కడ నుంచి తిరుపతి విమానాశ్రయానికి ప్రత్యేక విమానాన్ని సమకూర్చడంతో..తిరుపతిలోని టీటీడీ శ్రీ పద్మావతి చిన్నపిల్లల గుండె చికిత్సాలయంలో చిన్నారికి వైద్యులు గుండె మార్పిడి చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు.

తెలంగాణ బిడ్డకు పునర్జన్మ

గుండె సంబంధిత సమస్యతో బాధపడుతోన్న తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాకు చెందిన ఎ.లహరిని నవంబర్ 6న తిరుపతిలోని చిన్న పిల్లల ఆసుపత్రికి కుటుంబీకులు తీసుకువచ్చారు. ఇక్కడ వైద్యులు అన్ని పరీక్షలు నిర్వహించి గుండె మార్పిడి అనివార్యమని తేల్చారు. అవయవదాన్ లో చిన్నారి వివరాలను నమోదు చేయించారు. ఈ క్రమంలో శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రిలో బ్రెయిన్ డెడ్ అయిన అదే జిల్లా టెక్కలి మండలం రావివలసకు చెందిన పొట్నూరు రాజేశ్వరరావు (50) గుండెను దానం చేసేందుకు కుటుంబీకులు ముందుకువచ్చారు. ఈ విషయాన్ని ఆస్పత్రి వర్గాలు వెల్లడించడంతో శ్రీ పద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రి వైద్యుల బృందం శ్రీకాకుళానికి వెళ్లింది. గుండె తరలింపు విషయంపై చర్చించి దానికి తగిన ఏర్పాట్లు చేయాలని సీఎంను కోరింది. దీంతో శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి ప్రత్యేక హెలికాప్టర్‌ను పంపాలని అధికారులను సీఎం జగన్ ఆదేశించారు. మధ్యాహ్నం విజయవాడ నుంచి శ్రీకాకుళంలోని జెమ్స్ ఆస్పత్రికి హెలికాప్టర్ చేరుకుంది. అక్కడి నుంచి గుండెను విశాఖ ఎయిర్‌పోర్ట్‌కు తరలించారు. అక్కడ అప్పటికే సిద్ధంగా ఉన్న విమానంలో గుండెను రేణిగుంట విమానాశ్రయానికి తరలించారు. అక్కడి నుంచి గ్రీన్ చానల్ ద్వారా టీటీడీ అంబులెన్స్‌లో గుండెను శ్రీ పద్మావతి చిన్నపిల్లల గుండె చికిత్సాలయానికి చేర్చారు. ఇదంతా మూడు గంటల్లోనే పూర్తి చేశారు. ఆరు గంటలు శ్రమించి చిన్నారికి గుండె మార్పిడిని వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి నేతృత్వంలోని వైద్యులు ఈ ఆపరేషన్‌ను ఉచితంగా చేపట్టారు. కాగా, రాజేశ్వరరావు లివర్‌ను విశాఖలోని పినాకిల్ ఆస్పత్రికి, కళ్లను శ్రీకాకుళంలోని రెడ్‌క్రాస్ సంస్థకు అందజేశారు. ఆయనకు భార్య నిర్మల, ఇద్దరు కుమారులు ఉన్నారు.

త్రిసభ్య ధర్మాసనమే విచారించాలి

- మీరే ఈ వ్యాజ్యాలను త్రిసభ్య ధర్మాసనానికి నివేదించండి
- హైకోర్టు న్యాయమూర్తిని కోరిన ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదులు
- విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్ర అభివృద్ధి పర్యవేక్షణ, సమీక్ష నిమిత్తం విశాఖపట్నంలో ప్రభుత్వ క్యాంపు కార్యాలయాల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను గుర్తిస్తూ ఐఏఎస్‌ల కమిటీ ఇచ్చిన నివేదికకు అనుగుణంగా ప్రభుత్వం జారీ చేసిన జీవో 2283ని సవాలు చేస్తూ రాజధాని రైతులు హైకోర్టులో దాఖలు చేసిన వ్యాజ్యాలను విచారించాల్సింది త్రిసభ్య ధర్మాసనమేనని రాష్ట్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది. జీవో 2283ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు మంగళవారం మరోసారి విచారించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదులు వేలూరు మహేశ్వరరెడ్డి, చింతల సుమన్ వాదనలు వినిపించారు. ప్రభుత్వ కార్యాలయాల తరలింపు వ్యవహారం ఇప్పటికే త్రిసభ్య ధర్మాసనం ముందు పెండింగ్‌లో ఉందని గుర్తు చేశారు. ఈ వ్యాజ్యాల విచారణ నుంచి తప్పుకోవాలని (రెక్యూజ్) మిమ్మల్ని (జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు) కోరడం లేదని, వీటిని త్రిసభ్య ధర్మాసనానికి పంపాలని మాత్రమే అభ్యర్థిస్తున్నామని వివరించారు. ఈ వ్యాజ్యాలను త్రిసభ్య ధర్మాసనం ముందుకు పంపాలని, వీటికి విచారణార్హత లేదంటూ తాము దాఖలు చేసిన అనుబంధ వ్యాజ్యాలపై ముందు నిర్ణయం వెలువరించాలన్నారు. ఆ తర్వాతే ప్రధాన వ్యాజ్యాల పూర్వాపరాల్లోకి వెళ్లాలని కోరారు. రాజధాని రైతులు ఒకవైపు త్రిసభ్య ధర్మాసనం ముందుకు ఈ వ్యాజ్యాలు వెళ్లాల్సిన అవసరం లేదని చెబుతూనే, మరోవైపు కార్యాలయాల తరలింపుపై త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేయాలని కోరుతున్నారన్నారు. ఇవి పరస్పర విరుద్ధమైన వాదనలన్నారు.

విచారణ జరగకుండా ప్రభుత్వం అడ్డుకుంటోంది

రైతుల తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు వాదనలు వినిపిస్తూ.. క్యాంపు కార్యాలయాల తరలింపు కొత్త అంశమని, అందుకే సింగిల్ జడ్జి ముందు పిటిషన్లు దాఖలు చేశామని, ఇవి త్రిసభ్య ధర్మాసనం ముందుకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం ఏదో ఒక కారణం చూపుతూ విచారణను అడ్డుకుంటోందన్నారు. ఇరుపక్షాల అనుబంధ వ్యాజ్యాలపై ఒకేసారి ఉత్తర్వులు జారీ చేస్తానని న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు తెలిపారు. తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేశారు.

ఉచిత ఇసుకతో బలవంతులకే లబ్ధి

- చంద్రబాబుకు ముందస్తు బెయిల్ ఇవ్వొద్దు
- హైకోర్టు విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి: గత టీడీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానం వల్ల కొందరు బలవంతులైన వ్యక్తులు మాత్రమే లబ్ధిపొందారని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. విధానపరంగా తప్పుడు నిర్ణయాలు తీసుకున్నప్పుడు ఆ నిర్ణయాలు తీసుకున్న వ్యక్తులకు ఏ రకంగానూ చట్టపరమైన, రాజ్యాంగపరమైన రక్షణలు ఉండవని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ వివరించారు. ఈ విషయంపై సుప్రీం కోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చిందన్నారు. కొందరు వ్యక్తులకు అయాచితలబ్ధి చేకూర్చేందుకు గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానంపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. ఉచిత ఇసుక విధానం వల్ల ప్రభుత్వ ఖజానాకు పెద్దమొత్తంలో నష్టం చేకూరిందని తెలిపారు. సీనరేజి చార్జీల రూపంలో రావాల్సిన ఆదాయాన్ని కోల్పోయిందన్నారు. ఇసుక తవ్వకాల వల్ల పర్యావరణానికి నష్టం కలిగించినందుకు అప్పటి ప్రభుత్వానికి జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) రూ.100 కోట్ల జరిమానా విధించిందని తెలిపారు. తరువాత 2019లో ప్రస్తుత ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యల పట్ల సంతృప్తి చెందిన ఎన్‌జీటీ ఆ జరిమానాను ఉపసంహరించిందని చెప్పారు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు కీలకదశలో ఉందన్నారు. అందువల్ల ఎలాంటి ఉత్తర్వులు జారీచేసినా, దర్యాప్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని చెప్పారు. చంద్రబాబుకు ముందస్తు బెయిల్ మంజూరు చేయవద్దని ఆయన హైకోర్టును అభ్యర్థించారు. ఏజీ వాదనలు ముగియడంతో వీటికి చంద్రబాబు సమాధానం ఇచ్చేందుకు వీలుగా విచారణ బుధవారానికి వాయిదా పడింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఉచిత ఇసుక పథకం పేరుతో కోట్ల రూపాయల మేర ఖజానాకు నష్టం కలిగించినందుకు సీఐడీ పలువురిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

అసమర్థుడి విజయోత్సవ సభ.. ఖరీదైన యాంకర్ పవన్

- పవన్‌కు నోట్లు, సీట్లు ఆఫర్ చేసిన చంద్రబాబు
- బాబు వద్ద కిరాయి తీసుకుని యాంకరింగ్ చేసేస్థాయికి దిగజారిన పవన్
- లోకేశ్ బఫూన్.. యువగళం హాస్యభరిత చిత్రం
- టీడీపీ తెల్లజెండా ఎత్తేంత వరకు లోకేశ్ నిద్రపోడు
- జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు



సాక్షి, అమరావతి: నేటితరం రాజకీయాల్లో అసమర్థుడిగా పేరుగాంచిన లోకేశ్.. యువగళం యాత్ర ముగింపు సందర్భంగా ఏర్పాటు చేస్తున్న విజయోత్సవ సభకి ఖరీదైన యాంకర్ పవన్‌కళ్యాణ్ అని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు. లోకేశ్ ఒక బఫూన్.. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర ఒక హాస్యభరిత చిత్రం అని విమర్శించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో అంబటి మాట్లాడారు. మొదట చంద్రబాబు ఆహ్వానించినప్పుడు దత్తపుత్రుడు పవన్ నిరాకరించారని చెప్పారు. దీంతో చంద్రబాబే నేరుగా దత్తపుత్రుడి ఇంటికి వెళ్లి సీట్లు, నోట్లు మాట్లాడటంతో దత్తపుత్రుడు సరేనన్నారని తెలిపారు. చంద్రబాబు వద్ద కిరాయి తీసుకుని యాంకరింగ్‌కు వెళ్లే స్థాయికి జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ దిగజారిపోయారని విమర్శించారు. దీన్ని రాష్ట్ర ప్రజలు, జనసేన కార్యకర్తలు గుర్తించాలని కోరారు. అంబటి ఇంకా ఏమన్నారంటే..

ఉత్తపుత్రుడిని సింహాసనం ఎక్కించేందుకు దత్తపుత్రుడి యాంకరింగ్

ఒక అసమర్థుడిని, ఒక శునకాన్ని కనకపు సింహాసనం ఎక్కించాలని చంద్రబాబు ప్రయత్నం చేస్తుంటే, దానికి జనసేన ప్రబుద్ధుడు పవన్ వెళ్తున్నారు. ఉత్తపుత్రుడిని కనకపు సింహాసనం ఎక్కించేందుకు దత్తపుత్రుడు యాంకరింగ్ చేయబోతున్నారు. 2019లో ఆయన, ఈయనా ఎక్కడా గెలవలేదు. కాకపోతే లోకేశ్‌కు జనం రారు. పవన్‌ను చూడ్డానికి మాత్రమే వస్తారు. ఆ విషయం పవనే చెప్పారు. దోచేసిన డబ్బుతో స్పెషల్ ఫ్లైట్, ట్రైన్‌లు, బస్సులు, కార్లు అన్నీ దించేశారు. రేపు తిరణాల చేయాలని యాంకర్లను తీసుకున్నారు. రేపు సినిమా చాలా కామెడీగా ఉంటుంది. లోకేశ్ జనవరి 27న కుప్పం నుంచి యువగళం పేరుతో ప్రారంభించిన యాత్ర ఎటువంటి ప్రభావం లేని, ఎవరూ గుర్తించని యాత్ర. ఆపసోపాలు పడుతూ, బ్రేకులు తీసుకుంటూ ముగించారు. ఈ సందర్భంగా పోలిపల్లిలో విజయోత్సవ సభ పెట్టారు. దాన్ని విజయవంతం చేయడం కోసం చంద్రబాబు నానా తంటాలు పడుతుండటం చూస్తే హాస్యాస్పదంగా కనిపిస్తోంది. లోకేశ్ 226 రోజుల పాటు 3,132 కిలోమీటర్లు నడిచాడని చెబుతున్నారు. పార్టీపైన, రాష్ట్రంపైన ఈ యాత్ర ప్రభావం ఏమీలేదని టీడీపీ వారు, ప్రజలు చెబుతున్నారు. పాదయాత్రతో లోకేశ్‌కు ఒళ్లు తగ్గింది కానీ బుర్ర మాత్రం ఏమీ పెరగలేదు. పవన్‌ను సోదరుడు అని లోకేశ్ పిలవగలడా? లేక పవన్‌గారు అంటాడా? అనే విషయం సభలో తెలుస్తుంది.

లోకేశ్ రాజకీయాలకు పనికొచ్చే వ్యక్తి కాదు..

టీడీపీ సదస్సుకు యాంకర్ ఉదయభానును తీసుకొచ్చి ఉపన్యాసాలు చెప్పించారు. ఆమెను చూడటానికి వచ్చిన జనాన్ని చూసి సదస్సు సక్సెస్ అయిందని చెప్పుకొనే ప్రయత్నం చేశారు. లోకేశ్ రాజకీయాలకు పనికొచ్చేవ్యక్తి కాదని అక్కడే తేలిపోయింది. టీడీపీ బతికే ఉందని చూపించాలని ప్రయత్నిస్తున్నారు. అందుకే ఖరీదైన వ్యక్తులైన బాలకృష్ణ, పవన్ పెద్ద ఆకర్షణీయమైన షో నిర్వహించబోతున్నారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఏబీఎన్, టీవీ 5లో ఊదరగొడితే లోకేశ్ పెద్ద నాయకుడైపోతాడనుకుంటున్నారు. యువగళం అంతగా విజయవంతమైతే బాలకృష్ణ, దత్తపుత్రుడి యాంకరింగ్ ఎందుకని ప్రశ్నిస్తున్నాను. యువగళం ఒక అట్టర్‌ప్లాప్ షో. అశుభాలతో సాగిన యాత్ర. బాబు రిమాండ్‌లో ఉంటే లోకేశ్‌కు లోకేషన్ లేకుండా పోయింది. టీడీపీ తెల్లజెండా ఎత్తేంత వరకు లోకేశ్ నిద్రపోడు. వైఎస్సార్‌సీపీ వచ్చే ఎన్నికలకు సంబంధించి అంతర్గతంగా మార్పులు చేర్పులు చేస్తుంది. ఇది సహజమైన విషయం. 175 సీట్లతో వైఎస్ జగన్ మళ్లీ సీఎం కాబోతున్నారు.

మంటలు రేపిన మాక్ పార్లమెంట్!

సస్పెన్షన్లపై పార్లమెంటు ఆవరణలో విపక్షాల నిరసన రాజ్యసభ చైర్మన్‌ను వ్యంగ్యంగా అనుకరించిన ఎంపీ

- నవ్వుల్లో మునిగిన ఎంపీలు, వీడియో తీసిన రాహుల్
- దారుణమైన మానసిక క్షోభకు గురయ్యా: ధన్‌ఖడ్
- విపక్షాల సంస్కారానికి నిదర్శనం: బీజేపీ

న్యూఢిల్లీ: పార్లమెంటు ఉభయ సభల నుంచి తమ సస్పెన్షన్‌ను నిరసిస్తూ విపక్ష ఎంపీలు చేపట్టిన కార్యక్రమం తీవ్ర రాజకీయ దుమారానికి తెర తీసింది. విపక్ష ఇండియా కూటమికి చెందిన రాజ్యసభ, లోక్‌సభ సభ్యులు మంగళవారం ఉదయం పార్లమెంటు ఆవరణలోని మకర ద్వారం మెట్లపై మాక్ పార్లమెంటు నిర్వహించారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీతో పాటు పలు విపక్షాల సభ్యులు అందులో పాల్గొన్నారు. మోదీ ప్రభుత్వ తీరును నిరసిస్తూ అచ్చంగా సభల్లో మాదిరిగానే సభ్యులంతా నినాదాలతో హోరెత్తించారు. పార్లమెంటు భద్రతా వైఫల్య ఘటనపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఉభయ సభల నుంచి విపక్ష సభ్యులను భారీగా సస్పెండ్ చేస్తున్న తీరును తీవ్రంగా ఆక్షేపించారు. పాలక పక్షానివి నియంతృత్వ పోకడలంటూ దుమ్మెత్తిపోశారు. పార్లమెంటులో అధికార పక్షానికి చెందిన సభ్యుల వ్యవహార శైలిని వ్యంగ్యంగా అనుకరించారు. ఆ క్రమంలో తృణమూల్ కాంగ్రెస్ లోక్‌సభ సభ్యుడు కల్యాణ్ బెనర్జీ ఉన్నట్టుండి లేచి నిలబడి రాజ్యసభలో చైర్మన్, ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ నడక తీరును, హావభావాలను, ఆయన సభను నిర్వహించే తీరును రకరకాలుగా అనుకరిస్తూ ఎద్దేవా చేశారు. అచ్చం ధన్‌ఖడ్ మాదిరిగానే కాస్త వెనక్కు వంగి నిలబడి, 'వెన్నెముక' అంటూ పలు అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. విపక్ష సభ్యులంతా నవ్వుతూ ఆయన్ను ప్రోత్సహించగా దీన్నంతటినీ రాహుల్ తన సెల్ ఫోన్లో వీడియో తీస్తూ కన్పించారు. మరికొందరు విపక్షసభ్యులు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సభను నడిపే తీరును కూడా వ్యంగ్యంగా అనుకరిస్తూ ఆటపట్టించారు. ఇదంతా టీవీ చానళ్లలో లైవ్‌గా ప్రసారమైంది. ముఖ్యంగా ధన్‌ఖడ్‌ను బెనర్జీ అనుకరించిన తీరు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.


మంగళవారం పార్లమెంటు ఆవరణలో రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్‌ను వ్యంగ్యంగా అనుకరిస్తూ తృణమూల్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ ప్రదర్శించిన హావభావాలు

సిగ్గుచేటు: బీజేపీ

విపక్షాల తీరుపై బీజేపీ మండిపడింది. విపక్ష సభ్యులు తమ ప్రవర్తనతో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ వ్యవస్థలను దారుణంగా హేళన చేశారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ మండిపడ్డారు. ఈ చర్యతో విపక్ష ఇండియా కూటమి సంస్కారరాహిత్యం అట్టడుగుకు దిగజారిందన్నారు. ప్రజాస్వామిక విలువల పరిరక్షకుడినని చెప్పుకునే రాహుల్ తీరు ప్రజాస్వామ్యానికి, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజలకు, దేశానికి సిగ్గుచేటంటూ ఆక్షేపించారు. వెనకబడ్డ సాదాసీదా నేపథ్యం నుంచి వచ్చి అత్యున్నత రాజ్యాంగ పదవులను అధిష్టించిన వారిని అవమానించడం ఇండియా కూటమి సంస్కృతి అంటూ బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఆరోపించారు. ''ఓబీసీ సామాజిక వర్గానికి చెందిన ధన్‌ఖడ్‌ను అవమానించి తీరు ఇందుకు తాజా నిదర్శనం. ఓబీసీ అయిన ప్రధాని నరేంద్ర మోదీని విపక్షాలు ఎంతగా అవమానిస్తున్నదీ దేశమంతా చూస్తూనే ఉంది. ఈ విషయంలో రాహుల్‌ను కోర్టు దోషిగా కూడా తేల్చింది. రాష్ట్రపతి ముర్మును కూడా అధీర్ రంజన్ చౌధరి రాష్ట్రపత్ని అంటూ అవమానించారు'' అన్నారు.



తీరని అవమానం: ధన్‌ఖడ్

విపక్ష సభ్యుల ప్రవర్తన అత్యంత దారుణ, సిగ్గుచేటు అంటూ రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్ మండిపడ్డారు. ఉదయం రెండుసార్లు వాయిదా పడ్డ రాజ్యసభ మధ్యాహ్నం తిరిగి సమావేశం కాగానే కాంగ్రెస్ ఎంపీ దిగ్విజయ్‌సింగ్ నినాదాలకు దిగగా కూర్చోవాల్సిందిగా ఆదేశించారు. విపక్ష ఎంపీలు తనను అనుకరిస్తూ ఎద్దేవా చేయడాన్ని ఆయన ప్రస్తావించారు. ''పార్టీల మధ్య వాగ్యుద్ధాలు, పరస్పర విమర్శలు సహజమే. కాకపోతే రాజ్యసభ చైర్మన్, లోక్‌సభ స్పీకర్ వంటి వ్యవస్థలపై కనీస గౌరవం చూపాలి. కానీ నేనిప్పుడే చానళ్లలో చూశా. చైర్మన్‌ను, స్పీకర్‌ను వ్యంగ్యంగా అనుకరిస్తూ ఒక ఎంపీ అత్యంత దారుణంగా ప్రవర్తిస్తుంటే మీ పార్టీ సీనియర్ నాయకుడు (రాహుల్) దాన్ని వీడియో తీస్తున్నాడు. ఆయన మీకంటే పెద్ద నాయకుడు. ఇది చాలా దారుణం. అభ్యంతరకరం. అత్యంత సిగ్గుచేటు. ఏమాత్రం అంగీకారయోగ్యం కాదు. దేనికైనా ఒక హద్దుంటుంది! కానీ ఈ దిగజారుడుతనానికి హద్దంటూ లేదా? మీకు సద్బుద్ధి కలగాలని ఆశించడం తప్ప ఏం చేయగలను?'' అంటూ మండిపడ్డారు. అనంతరం మరో కాంగ్రెస్ సభ్యుడు పి.చిదంబరాన్ని ఉద్దేశించి కూడా ధన్‌ఖడ్ తన ఆవేదన వెలిబుచ్చారు. ''రాజ్యసభ చైర్మన్ వంటి రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న వ్యక్తిని ఒకరు వ్యంగ్యంగా అనుకరిస్తుంటే, ఇంకొకరు వీడియో తీస్తుంటే చూసి నా హృదయం ఎంతగా క్షోభిల్లి ఉంటుందో మీరే ఊహించండి! దేశాన్ని చిరకాలం పాటు పాలించిన పార్టీ రాజ్యసభ చైర్మన్ వ్యవస్థను ఇంత దారుణంగా అవమానించడం దారుణం. మిస్టర్ చిదంబరం! ఏమిటిది? మీకో విషయం స్పష్టంగా చెప్పదలచుకున్నా. ఈ ఉదంతంతో నా మనసు ఎంతగానో గాయపడింది. పైగా ఆ వీడియోను మీ పార్టీ ఇన్‌స్టాగ్రాంలో, పార్టీ ట్విటర్‌లో కూడా పెట్టారు. తద్వారా నా రైతు నేపథ్యాన్ని, ఒక జాట్‌గా నా సామాజిక నేపథ్యాన్ని, రాజ్యసభ చైర్మన్‌గా నా హోదాను... ఇలా అన్నింటినీ తీవ్రంగా అవమానించారు'' అంటూ ధన్‌ఖడ్ తీవ్రంగా ఆక్షేపించారు.

మరో 49 మంది సస్పెన్షన్

141కి చేరిన ఎంపీల సంఖ్య

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో విపక్ష సభ్యుల సస్పెన్షన్ల పర్వం కొనసాగుతూనే ఉంది. లోక్‌సభలో మంగళవారం మరో 49 మందిపై వేటు పడింది. ఈ నెల 13వ తేదీన పార్లమెంట్‌లో చోటుచేసుకున్న భద్రతా వైఫల్యంపై కేంద్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలని, ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పార్లమెంట్ ఉభయ సభల్లో విపక్ష ఎంపీలు ఆందోళన కొనసాగిస్తున్నారు. సభలో ప్లకార్డులు ప్రదర్శించడం, బిగ్గరగా నినాదాలు చేస్తుండడం, సభా కార్యకలాపాలకు అడ్డు తగులుతుండడంతో లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్ విపక్ష సభ్యులపై సస్పెన్షన్ అస్త్రం ప్రయోగిస్తున్నారు. ఈ నెల 14న లోక్‌సభ నుంచి 13 మంది, రాజ్యసభ నుంచి ఒక విపక్ష ఎంపీ సస్పెండ్ అయ్యారు. ఈ నెల 18న లోక్‌సభలో 33 మంది, రాజ్యసభలో 45 మంది బహిష్కరణ వేటుకు గురయ్యారు. దీంతో ఇప్పటిదాకా ఉభయ సభల నుంచి సస్పెండైన మొత్తం విపక్ష ఎంపీల సంఖ్య 141కు చేరుకుంది.

లోక్‌సభలో అదే అలజడి

లోక్‌సభ మంగళవారం ఉదయం ప్రారంభం కాగానే విపక్ష సభ్యుల ఆందోళనకు దిగారు. భద్రతా వైఫల్యాన్ని ప్రస్తావించారు. నినాదాలు మొదలుపెట్టారు. ప్రభుత్వం తక్షణమే స్పందించాలని తేల్చిచెప్పారు. వారి ప్రవర్తనపై స్పీకర్ ఓంబిర్లా అసహనం వ్యక్తం చేశారు. సభకు సహకరించాలని పదేపదే కోరినా వారు వినిపించుకోలేదు. దాంతో సభను మధ్యాహ్నం 2 గంటల వరకు స్పీకర్ వాయిదా వేశారు. సభ పునఃప్రారంభమైన తర్వాత కూడా పరిస్థితిలో మార్పు రాలేదు. విపక్ష సభ్యులు ఆందోళన కొనసాగించారు. ఇటీవల పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఓటమిని తట్టుకోలేక విపక్షాలు పార్లమెంట్‌లో ఉద్దేశపూర్వకంగా రగడ సృష్టిస్తున్నాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ ఆరోపించారు. 49 మంది విపక్ష ఎంపీలను సభ నుంచి సస్పెండ్ చేయాలని కోరుతూ ఆయన ప్రవేశపెట్టిన తీర్మానం మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. 49 మంది సభ నుంచి బహిష్కరిస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన శశి థరూర్, మనీశ్ తివారీ, కార్తీ చిదంబరం, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన డింపుల్ యాదవ్, నేషనల్ కాన్ఫరెన్స్‌కు చెందిన ఫరూఖ్ అబ్దుల్లా, ఎన్సీపీకి చెందిన సుప్రియా సూలే, డీఎంకేకు చెందిన జగత్‌రక్షకన్; డీఎన్‌వీ సెంథిల్ కుమార్, జేడీ(యూ)కు చెందిన గిరిధర్ యాదవ్, బీఎస్పీకి చెందిన డానిష్ అలీ, ఆమ్‌ఆద్మీ పార్టీకి చెందిన సుశీల్‌కుమార్ రింకూ తదితరులపై మంగళవారం సస్పెన్షన్ వేటు పడింది. ప్రస్తుత శీతాకాల సమావేశాల్లో మిగిలిన సెషన్ అంతటికీ వారిని సస్పెండ్ చేశారు.

రాజ్యసభలో వాయిదాల పర్వం

భద్రతా వైఫల్యంపై ఎగువ సభలోనూ విపక్షాలు గళమెత్తాయి. మంగళవారం సభలో నిరసనలు, నినాదాలు కొనసాగించాయి. భద్రతా వైఫల్యంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో ప్రకటన చేయాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. దీంతో సభను ఏకంగా ఐదుసార్లు వాయిదా వేయాల్సి వచ్చింది!

ఇది మోదీస్వామ్య దౌర్జన్యం: కాంగ్రెస్

దేశంలో ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేయడమే మోదీ ప్రభుత్వ అసలు లక్ష్యమని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఆరోపించారు. పార్లమెంట్ నుంచి 141 మంది విపక్ష సభ్యులను సస్పెండ్ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో ప్రతిపక్షాలను లేకుండా చేసి, క్రూరమైన చట్టాలను ఆమోదించుకోవడానికి మోదీ సర్కారు కుట్రపన్నిందని మండిపడ్డారు. ఇది మోదీస్వామ్య దౌర్జన్యమని విమర్శించారు.


మంగళవారం సస్పెన్షన్ తర్వాత పార్లమెంటు ఆవరణలో బైఠాయించిన విపక్ష ఎంపీలు

పడిపోయిన విపక్షాల సంఖ్యాబలం

వరుస సస్పెన్షన్ల నేపథ్యంలో లోక్‌సభలో విపక్షాల సంఖ్యాబలం భారీగా క్షీణించింది. ప్రస్తుత శీతాకాల సమావేశాల్లో మూడింట రెండొంతుల మందిపై వేటు పడింది. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ నుంచి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా కేవలం 9 మంది సభలో మిగిలారు. ప్రతిపక్ష ఇండియా కూటమికి లోక్‌సభలో 138 మంది సభ్యులుండగా, ప్రస్తుతం 43 మంది మిగిలారు. ఏకంగా 95 మంది సస్పెన్షన్‌కు గురయ్యారు.



మంగళవారం జరిగిన ఇండియా కూటమి భేటీలో నేతలు స్టాలిన్, సోనియా, పవార్, ఖర్గే, లాలు, నితీశ్, మమత, రాహుల్, ఏచూరి

ఇండియా కూటమిలో లుకలుకలు

- మరోసారి బట్టబయలు
- 'దళిత పీఎం'గా ఖర్గే!
- మమత, కేజ్రీవాల్ ప్రతిపాదన
- వాకౌట్ చేసిన నితీశ్, లాలు

న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో విపక్షాల తరఫున తెరపైకి వచ్చిన 'దళిత ప్రధాని' కార్డు ఇండియా కూటమిలో లుకలుకలను మరోసారి తెరపైకి తెచ్చింది. ఇండియా కూటమి నాలుగో సమావేశం మంగళవారం ఢిల్లీలో జరిగింది. కాంగ్రెస్, తృణమూల్, ఆప్‌తో పాటు మొత్తం 28 విపక్షాల నేతలు భేటీలో పాల్గొన్నారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏను దీటుగా ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహాలతో పాటు కీలకమైన సీట్ల సర్దుబాటు తదితరాలపై లోతుగా చర్చించారు. ఈ సందర్భంగా కూటమి తరఫున ప్రధాని అభ్యర్థిగా కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే పేరును తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్‌లు మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్ ప్రతిపాదించారు. ''దళిత సామాజిక వర్గానికి చెందిన ఆయనను ప్రధాని అభ్యర్థిని చేస్తే వ్యూహాత్మకంగా ఎంతగానో కలిసొస్తుంది. దేశానికి తొలి దళిత ప్రధానిని అందించేందుకు కృషి చేస్తున్నామన్న సంకేతాలు ప్రజల్లోకి వెళ్తాయి'' అని వారన్నట్టు తెలిసింది. దీన్ని పలువురు నేతలు సమర్థించినా బిహార్ సీఎం, నితీశ్‌కుమార్, ఆర్జేడీ అధినేత లాలుప్రసాద్ తీవ్రంగా వ్యతిరేకించినట్టు సమాచారం. అసంతృప్తితో వారిద్దరూ భేటీ నుంచి వాకౌట్ చేశారని తెలుస్తోంది. అనంతరం జరిగిన సంయుక్త విలేకరుల సమావేశానికి కూడా నితీశ్, లాలు రాలేదు! ఇండియా కూటమిలో లుకలుకలకు ఇది మరోసారి అద్దం పట్టిందని భావిస్తున్నారు. మరోవైపు కూటమి పక్షాల మధ్య సీట్ల పంపకాన్ని పర్యవేక్షించే కమిటీకి ఖర్గేనే కన్వీనర్‌ను చేయాలని కూడా మమత ప్రతిపాదించారు.

సీట్ల పంపకంపై చర్చ

సీట్ల పంపకంపైనా భేటీలో వాడివేడిగా చర్చ జరిగినట్టు తెలుస్తోంది. ఈ అంశాన్ని వీలైనంత త్వరగా తేల్చాలని పలు పార్టీలు పట్టుబట్టాయి. డిసెంబర్ నెలాఖరు, లేదంటే జనవరి తొలి వారంలోగా గానీ సీట్ల సర్దుబాటును ఖరారు చేయాలన్న అభిప్రాయం వ్యక్తమైంది. బీజేపీకి ప్రత్యామ్నాయం తామేనని ప్రజలకు వివరించేలా సానుకూల అజెండాతో 'నేను కాదు, మేము' థీమ్‌తో ముందుకెళ్లాలన్న భావన వ్యక్తమైంది.

విజయానికి కృషి చేద్దాం: ఖర్గే

ప్రధానిగా తన పేరును ప్రతిపాదించడంపై ఖర్గే ఆచితూచి స్పందించారు. ముందుగా లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏపై ఇండియా కూటమి విజయం కోసం కృషి చేయాలని భేటీలో ఆయన పిలుపునిచ్చారు. ''లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే మన తొలి లక్ష్యం కావాలి. ప్రధాని ఎవరన్నది ఆ తర్వాత చూద్దాం'' అన్నారు. అనంతరం ప్రధాని అభ్యర్థిగా మీ పేరు ఖరారైందా అని ప్రశ్నించగా మీడియాతోనూ అదే చెప్పారు. విపక్ష ఎంపీల సస్పెన్షన్‌పై 22న కూటమి సారథ్యంలో దేశవ్యాప్త ఆందోళనలు చేపట్టనున్నట్టు ప్రకటించారు. ''సీట్ల పంపకం ఎక్కడికక్కడ రాష్ట్ర స్థాయిలోనే జరుగుతుంది. సమస్య ఉన్న చోట్ల మాత్రమే కూటమి జోక్యం చేసుకుంటుంది'' అని తెలిపారు.

సీట్లపై కాంగ్రెస్ కాస్త తగ్గాలి!

సీట్ల పంపకం విషయంలో కాంగ్రెస్ పట్టు విడుపులతో వ్యవహరించాలని మమత తదితరులు కుండబద్దలు కొట్టారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు తొలుత మమతే ఈ అంశాన్ని ప్రస్తావించారు. ''ఇతర పార్టీలు బలంగా ఉన్న రాష్ట్రాల్లో కాంగ్రెస్ కాస్త తగ్గాలి. యూపీలో సమాజ్‌వాదీ, పంజాబ్, ఢిల్లీల్లో ఆప్, పశ్చిమబెంగాల్లో తృణమూల్‌కు ప్రాధాన్యం దక్కాలి'' అన్నట్టు చెబుతున్నారు. సీట్ల పంపకం త్వరలో ఖరారు కాకుంటే కూటమి విజయావకాశాలు దెబ్బ తింటాయని కూడా హెచ్చరించినట్టు సమాచారం.

చైనాలో భూకంపం

127 మందికిపైగా దుర్మరణం 700 మందికిపైగా గాయాలు

బీజింగ్/జిషిషాన్: వాయవ్య చైనాను భూకంపం కుదిపేసింది. సోమవారం అర్ధరాత్రి గన్సు రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన ఈ భూకంపం ధాటికి చాలా ఇళ్లు నేలమట్టమై 127 మందికిపైగా జనం ప్రాణాలు కోల్పోయారు. పొరుగు రాష్ట్రం క్విన్‌ఘాయిలోనూ ఈ ప్రకంపనలు బీభత్సం సృష్టించాయి. రెండు రాష్ట్రాల్లో కలిపి 700 మందికి పైగా గాయాలపాలయ్యారు. శిథిలాల వద్ద యుద్ధప్రాతిపదికన గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. భూకంపం గ్రామీణ ప్రాంతాల్లో సంభవించడంతో మట్టి ఇళ్లు ఎక్కువగా కూలాయి. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. భూమి కంపించడంతో జనం ఇళ్లు వదిలి భయంతో బయటకు పరుగులు తీశారు. భూకంపం వార్త తెలిసి అధ్యక్షుడు జిన్‌పింగ్ యుద్ధప్రాతిపదికన వేలాదిగా సహాయక బృందాలు తరలివెళ్లి సహాయక చర్యల్లో పాల్గొనాలని అధికారులను ఆదేశించారు. ''భూకంపం ధాటికి విద్యుత్, నీటి సరఫరా వ్యవస్థలు దెబ్బతిన్నాయి. చలికాలం, అందునా మైనస్ 15 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత సహాయక చర్యలకు అవరోధంగా మారింది'' అని బ్లూ స్కై రెస్క్యూ టీమ్ చీఫ్ కమాండర్ వాంగ్ యీ చెప్పారు. గన్సు, క్విన్‌ఘాయి ప్రావిన్సుల్లో సంభవించిన ఈ భూకంపం కేంద్రస్థానం భూఉపరితలానికి 10 కిలోమీటర్ల లోతులో ఉందని చైనా యంత్రాంగం ప్రకటించింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.2గా నమోదైంది. భూకంపం వచ్చిన క్విన్‌ఘాయి ప్రావిన్స్.. తరచూ భూకంపాలొచ్చే టిబెట్ హిమాలయ ప్రాంతాన్ని ఆనుకుని ఉంది.

ఇజ్రాయెల్ ఐరన్ డోమ్‌పై హెజ్‌బొల్లా దాడి

టెల్ అవీవ్: ఒకేసారి వందలాదిగా దూసుకొచ్చే శత్రు దేశ చిన్నపాటి క్షిపణులను కూల్చేసే ఇజ్రాయెల్ 'ఐరన్ డోమ్' రక్షణ వ్యవస్థను ధ్వంసంచేశామని హెజ్‌బొల్లా సంస్థ ప్రకటించింది. క్షిపణులను ప్రయోగించే రెండు ఐరన్ డోమ్ లాంచర్‌లను ధ్వంసం చేశామని లెబనాన్‌కు చెందిన మిలిటెంట్ సంస్థ ప్రకటించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. భిన్న దిశలో దూసుకొచ్చే వందలాది శత్రు దేశ క్షిపణుల పథాన్ని కనిపెట్టి వాటిని నిలువరించేందుకు వెంటనే వందల క్షిపణులను ప్రయోగించే అత్యాధునిక రక్షణ వ్యవస్థగా 'ఐరన్ డోమ్' అంతర్జాతీయంగా పేరుగాంచింది. హెజ్‌బొల్లా ప్రకటనపై ఇజ్రాయెల్ స్పందించలేదు. సోమవారం మధ్యాహ్నం ఇజ్రాయెల్ ఉత్తర ప్రాంతం 'కబ్రీ'లో ఈ దాడి జరిగిందని వార్తలొచ్చాయి. దక్షిణ లెబనాన్‌లో హెజ్‌బొల్లా యోధుడి అంతిమయాత్రపై ఇజ్రాయెల్ గగనతలదాడి చేయడంతో ఆగ్రహించి హెజ్‌బొల్లా ప్రతిదాడి చేసింది. గాజా యుద్ధంలో జోక్యం చేసుకుంటే హమాస్ అంతానికి ప్రతిజ్ఞచేసినట్లే హెజ్బొల్లా మీదా దాడికి దిగుతామని ఇజ్రాయెల్ గతంలోనే హెచ్చరించింది. అక్టోబర్ ఏడున ఇజ్రాయెల్ సరిహద్దు గ్రామాలపైకి హమాస్ మిలిటెంట్ల దాడి తర్వాత హమాస్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు మొదలెట్టింది. హెజ్‌బొల్లా మిలిటెంట్లు లెబనాన్ హమాస్‌కు మద్దతుగా ఇజ్రాయెల్‌పై పోరుకు దిగారు. రోజూ గగనతల దాడులు చేస్తున్నారు.


మంగళవారం బీజేపీ పార్లమెంటరీ పార్టీ భేటీ సందర్భంగా ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్, బీజేపీ చీఫ్ జేపీ నడ్డా తదితరులు

మళ్లీ అక్కడే కూర్చుంటారు

విపక్షాలనుద్దేశించి ప్రధాని మోదీ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో విపక్ష పార్టీలు గతంలో కంటే తక్కువ సీట్లు గెలిచి మళ్లీ 'విపక్షం' పాత్రకే పరిమితం అవుతాయని ప్రధాని మోదీ జోస్యం చెప్పారు. మంగళవారం ఢిల్లీలో బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మోదీ మాట్లాడారు. '' దేశ ఉజ్వల భవితవ్యం కోసం మా శక్తియుక్తుల్ని వినియోగిస్తున్నాం. అధికార పీఠం నుంచి మమ్మల్ని కిందకు పడదోసేందుకు విపక్షాలు తమ బలాన్ని వాడుతున్నాయి. లోక్‌సభలో పొగబెట్టిన ఘటనను తమ స్వార్థ రాజకీయాల కోసం పక్కదోవ పట్టిస్తున్నారు. అందుకే 2024 లోక్‌సభ ఎన్నికల్లో విపక్ష పార్టీలు గతంలో కంటే తక్కువ సీట్లే సాధించి పార్లమెంట్‌లో మళ్లీ అదే విపక్షాల కుర్చీల్లో కూర్చుంటాయి. వాళ్లు ఓడిపోవడంతో ఖాళీ అయిన కుర్చీలను మా బీజేపీ ఎంపీలు భర్తీచేస్తారు'' అని మోదీ వ్యాఖ్యానించారు. '' లోక్‌సభలో ఆగంతకుల చొరబాటు ఘటనను అందరూ ముక్తకంఠంతో ఖండించాల్సిందే. కానీ, నిరుద్యోగిత, అధిక ధరలతో పెరిగిన అసహనంతోనే ఇలాంటి భద్రతా వైఫల్య ఘటనలు జరుగుతాయంటూ ఈ ఘటనను రాహుల్ గాంధీ, తదితర విపక్ష నేతలు పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారు. ఇటీవల మూడు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక అక్కసుతో లోక్‌సభలో పొగ ఘటనకు రాజకీయ కోణాన్ని కాంగ్రెస్ ఆపాదిస్తోంది. తమ రాజకీయ లబ్ధి కోసం విపక్షాలు ఈ ఘటనకు రాజకీయ రంగు పులుముతున్నాయి. ఈ ఉదంతం చాలు విపక్షాల వైఖరి ఏమిటో చెప్పడానికి. వీరి గురించి తెలుసు కాబట్టే దేశ ఓటర్లు వీరికి మళ్లీ విపక్ష స్థానమే కట్టబెడతారు'' అని మోదీ వ్యాఖ్యానించారు.

2024 ఎన్నికల్లో పొత్తులపై కాంగ్రెస్ కమిటీ

న్యూఢిల్లీ: 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇతర పార్టీలతో పొత్తులు కుదుర్చుకునేందుకు, సీట్ల పంపిణీపై చర్చలు జరిపేందుకు కాంగ్రెస్ పార్టీ అయిదుగురు సభ్యులతో ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటు చేసింది. నేషనల్ అలయెన్స్ కమిటీ పేరుతో ఏర్పాటైన ఈ కమిటీకి పార్టీ సీనియర్ నేత ముకుల్ వాస్నిక్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఇందులో రాజస్తాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లోత్, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ బఘేల్, కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, పార్టీ సీనియర్ నేత మోహన్ ప్రకాశ్ సభ్యులుగా ఉంటారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని కాంగ్రెస్ పార్టీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

భారత్ జోడో యాత్ర 2.0 జనవరిలో!

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిన రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర వచ్చే ఏడాది జనవరిలో రెండో విడత మొదలయ్యే అవకాశం ఉంది. యాత్రను జనవరి మొదటి వారం తర్వాత మొదలుపెట్టే వీలుందని సంబంధిత వర్గాలు మంగళవారం వెల్లడించాయి. తొలి విడత భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ కన్యాకుమారి నుంచి కశ్మీర్ దాకా పాదయాత్ర చేస్తూ స్థానికులతో మమేకం అయ్యారు. ఈసారి హైబ్రిడ్ మోడ్‌లో కాంగ్రెస్ పార్టీ యాత్రకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. కార్యకర్తలు రాహుల్‌తోపాటు పాదయాత్ర చేయడంతోపాటు అవసరమైన చోట్ల వాహనాల్లో యాత్రను అనుసరిస్తారని సమాచారం.

ఆరు నెలల్లో విచారణ పూర్తి చేయండి

ప్రయాగ్‌రాజ్: వారణాసిలోని ప్రఖ్యాత కాశీ విశ్వనాథుని ఆలయాన్ని ఆనుకుని ఉన్న జ్ఞానవాపి మసీదు కేసులో మంగళవారం కీలక పరిణామం సంభవించింది. మసీదు ప్రాంతంలో గతంలో ఉన్న ఆలయాన్ని పునరుద్ధరించాలంటూ హిందూ భక్తులు వేసిన పిటిషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన అర్జీలను అలహాబాద్ హైకోర్టు కొట్టివేసింది. విచారణను వేగవంతం చేయడం ద్వారా, మూడు దశాబ్దాలుగా నలుగుతున్న ఈ వివాదానికి ఆరు నెలల్లో ముగింపు పలకాలని జిల్లా కోర్టును ఆదేశించింది. వివాదాస్పద ప్రదేశంలోని మతపరమైన అంశాన్ని కోర్టులు మాత్రమే నిర్ణయించగలవని విచారణ సందర్భంగా జస్టిస్ రోహిత్ రంజన్ అగర్వాల్ వ్యాఖ్యానించారు.

అయోధ్య వేడుకలకు అద్వానీ, జోషిలకు వీహెచ్‌పీ ఆహ్వానం

అయోధ్య: అయోధ్యలో రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవాలకు హాజరు కావాల్సిందిగా బీజేపీ కురువృద్ధ నేతలు ఎల్‌కే అద్వానీ, మురళీ మనోహర్ జోషిలను మంగళవారం విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) ఆహ్వానించింది. 'రామ మందిరం ఉద్యమానికి ఆద్యులుగా ఉన్న ఎల్‌కే అద్వానీ, మురళీ మనోహర్ జోషిలను రామ మందిరం ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా ఆహ్వానించాం. వచ్చేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తామని ఇద్దరు సీనియర్ నేతలు తెలిపారు'అని వీహెచ్‌పీ సభ్యుడు అలోక్ కుమార్ చెప్పారు. ఎల్‌కే అద్వానీ(96), మనోహర్ జోషి(89)లను వారి వయస్సు, ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతిష్ఠా కార్యక్రమానికి రావొద్దని కోరగా, వారిద్దరూ అంగీకరించారంటూ రామాలయ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ సోమవారం చేసిన ప్రకటన వివాదాస్పదంగా మారిన సంగతి తెలిసిందే.

కేరళలో కొత్తగా 115 కోవిడ్ కేసులు

తిరువనంతపురం: కేరళలో కోవిడ్ ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. 24 గంటల వ్యవధిలో రాష్ట్రంలో కొత్తగా 115 కేసులు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్య శాఖ మంగళవారం తెలిపింది. దీంతో, రాష్ట్రంలో మొత్తం యాక్టివ్ కేసుల సంఖ్య 1,749కు చేరినట్లు వెల్లడించింది. అదేవిధంగా, మంగళవారం ఉదయం 8 గంటల సమయానికి కేరళ మినహా దేశవ్యాప్తంగా కొత్తగా 142 కోవిడ్ కేసులు నమోదయ్యాయని వివరించింది. ఇదే సమయంలో కోవిడ్ బాధితుల మరణాలేవీ లేవని తెలిపింది.


ఐస్‌లాండ్‌లోని రెకిజేన్స్ దీవిలో అగ్ని పర్వతం బద్దలవడంతో సోమవారం రాత్రి నుంచి లావా ఇలా భారీగా ప్రవహిస్తోంది



ఏడీసీపీ వెంకటరత్నం బదిలీ

విజయవాడ స్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా క్రైం ఏడీసీపీ పి.వెంకటరత్నం విశాఖపట్నం క్రైం డీసీపీగా బదిలీ అయ్యారు. ఆమెను పోలీస్ కమిషనర్ టి.కె.రాణా మంగళవారం అభినందించారు.



క్యూలైన్ పనులకు పూజలు

ఇంద్రకీలాద్రి: భవానీ దీక్ష విరమణ నేపథ్యంలో దుర్గగుడి ఘాట్‌రోడ్డులో క్యూలైన్ పనులకు మంగళవారం ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ రామారావు పూజలు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 522.50 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 834.30 అడుగుల వద్ద ఉంది.

న్యూస్‌రీల్

కృష్ణా వర్సిటీ స్విమ్మింగ్ జట్ల ఎంపిక



విజయవాడ స్పోర్ట్స్: సౌత్‌వెస్ట్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల స్విమ్మింగ్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే కృష్ణా యూనివర్సిటీ మహిళలు, పురుషుల జట్లను ఎంపిక చేసినట్లు ఎంపిక కమిటీ చైర్‌పర్సన్, సప్తగిరి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.డి.శ్రీదేవి మంగళవారం తెలిపారు. ఇటీవల తమ కళాశాల ఆధ్వర్యంలోనే యూనివర్సిటీ అంతర కళాశాలల స్విమ్మింగ్ పోటీలను నిర్వహించామని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన ఎంపిక పోటీల్లో అత్యంత క్రీడా నైపుణ్యం కలిగిన క్రీడాకారులను యూనివర్సిటీ జట్లకు ఎంపిక చేశామన్నారు. పురుషుల జట్టుకు బి.బాలగంగాధర్, పి.శరణ్‌చౌదరి, ఎండీ పర్వేజ్‌మహరూఫ్, ఎం.హర్షవర్ధన్, కార్తికేయ, మహిళల జట్టుకు డి.మానస, వి.శృతిశిరీష ఎంపికయ్యారని వివరించారు. జట్ల ఎంపిక కమిటీ మేనేజర్‌గా డాక్టర్ ఆర్.రఘురామ్, సభ్యులుగా డాక్టర్ డి.యుగంధర్, డాక్టర్ బి.సి.హెచ్.సంగీతరావు వ్యవహరించారని తెలిపారు.

మోపిదేవి ఆలయంలో మహా పూర్ణాహుతి



మోపిదేవి(అవనిగడ్డ): స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం మహా పూర్ణాహుతి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఆలయ ఏసీ ఎన్.ఎస్.చక్రధరరావు ఆధ్వర్యంలో ప్రాతఃకాలార్చన, గోపూజ, నిత్య హోమం, బలిహరణ, పంచామృత స్నపన, వసంతోత్సవం, మహాపూర్ణాహుతి నిర్వహించారు. ఉదయం 11 గంటలకు శేషవాహనంపై స్వామివారి ఊరేగింపు, రాత్రి ఏడు గంటలకు ద్వాదశ ప్రదక్షిణలు, రాత్రి ఎనిమిది గంటలకు స్వామివారి పుష్ప శయ్యాలంకృత పర్యంకసేవ జరిగాయి. వేదపండితుడు కొమ్మూరి ఫణికుమార్ శర్మ, ఆలయ ప్రధానార్చకుడు బుద్ధు పవన్‌కుమార్ శర్మ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

బాడీబిల్డింగ్ పోటీల్లో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు



పెనమలూరు: రాష్ట్ర స్థాయి బాడీబిల్డింగ్ పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. ఈ నెల 17వ తేదీన అనకాపల్లిలో జరిగిన మిస్టర్ ఆంధ్ర రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారని జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి తాళ్లూరి అశోక్ తెలిపారు. 65 కిలోల విభాగంలో కె.బాలకృష్ణ, 80 కిలోల విభాగంలో ఆర్.గోపీకృష్ణ, 85 కిలోల విభాగంలో ఎన్.గిరీష్, 90 కిలోల విభాగంలో ఎస్.ఉదయ్ కుమార్ బంగారు పతకాలు, 85 కిలోల విభాగంలో జి.సతీష్‌కుమార్ రజతం, అబ్దుల్ ఆసిఫ్ కాంస్య పతకం సాధించారని, 55 కిలోల విభాగంలో ఎండీ జాఫర్ సాదిక్ ఐదో స్థానంలో నిలిచాడని వివరించారు. కానూరు అశోక్ జిమ్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులను గన్నవరం సర్కిల్ డీఎస్పీ జయసూర్య, డీఎస్పీ కె.ధర్మేంద్ర మంగళవారం అభినందించారు. పెనమలూరు సీఐ టి.వి.వి.రామారావు, ఎస్‌ఐ రమేష్, అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఈదా రాజేష్, అధ్యక్షుడు మనోహర్, నాగేశ్వరరావు, రాజు, సాజిత్ పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో సోనికాసాయికి కాంస్యం



విజయవాడ స్పోర్ట్స్: జాతీయ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో విజయవాడ క్రీడాకారిణి పరసా సోనికా సాయి సత్తా చాటింది. అసోంలోని గువాహటిలో ఈ నెల 18వ తేదీ ప్రారంభమైన చాంపియన్‌షిప్ పోటీలకు ఇండియన్ రైల్వేస్ నుంచి ఆమె ప్రాతినిధ్యం వహించింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో అసోం క్రీడాకారిణిపై 3–0 తేడాతో గెలిచి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. సోనికా ప్రస్తుతం విజయవాడ డీఆర్ఎం కార్యాలయంలోని ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తోంది.

పొత్తు పొడవక ముందే పేచీ

- ఉమ్మడి జిల్లాలో మూడు సీట్ల కోసం జనసేన పట్టు
- ససేమిరా అంటున్న తెలుగుదేశం పార్టీ నాయకులు
- రెండు పార్టీల మధ్య ముదురుతున్న వివాదం
- ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో కాడివదేసిన తెలుగుతమ్ముళ్లు



సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఎమ్మెల్యే సీట్ల విషయమై తెలుగుదేశం, జనసేన పార్టీల మధ్య పేచీ మొదలైంది. పొత్తు ఖరారై, సీట్ల పంపిణీ జరగక ముందే రెండు పార్టీల మధ్య తలెత్తిన విభేదాలు ఆ పార్టీల శ్రేణులను గందరగోళానికి గురిచేస్తున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడ తూర్పు, పశ్చిమం, జగ్గయ్యపేట, కృష్ణా జిల్లాలోని పెనమలూరు నియోజకవర్గాల్లో ఏవైనా మూడింటిని తమకు కేటాయించాలని జనసేన పార్టీ నాయకులు పట్టుబడుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లో రెండు సీట్లకు తగ్గేదిలేదని భీష్మించారని సమాచారం. అదే జరిగితే ఆ రెండు సీట్లతో పాటు, విజయవాడ ఎంపీ సీటుపైనా పూర్తిగా ఆశలు వదులుకోకతప్పదన్న భావనలో టీడీపీ ఉంది. లోకేష్ పాదయాత్ర ముగిసిన తరువాత ఆయన్ను, చంద్రబాబును కలిసి విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో ఏ ఒక్క ఎమ్మెల్యే సీటునూ జనసేనకు ఇవ్వడానికి వీలులేదని ఒత్తిడి చేయాలని టీడీపీ నాయకులు నిర్ణయించారని సమాచారం.

ముదురుతున్న వైరం

విజయవాడలో పవన్‌కల్యాణ్ సామాజికవర్గానికి రాజకీయంగా పట్టు దొరికితే, తెలుగుదేశం పార్టీ రాజకీయ ప్రయోజనాలకు విఘాతమని చంద్రబాబు కూడా భావిస్తున్నారు. అనివార్యమైతే ఒకటి, రెండు సీట్లు జనసేనకు ఇచ్చినా, ఆ పార్టీ అభ్యర్థులను ఓడించాలని టీడీపీ ధ్యేయంగా పెట్టుకొంది. జనసేనకు, ఆ పార్టీకి దన్నుగా ఉన్న సామాజికవర్గానికి ఉమ్మడి జిల్లాలో స్థానం లేకుండా చేయాలన్నదే టీడీపీ ఎత్తుగడ. ఈ విషయం బయటకు పొక్కడంతో జనసేన కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీట్ల వ్యవహారంపై తాడోపేడో తేల్చుకొనేందుకు సిద్ధంగా ఉన్నామని తేల్చి చెబుతున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేన మధ్య వైరం ముదురుపాకాన పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

స్తబ్దుగా టీడీపీ

జిల్లాలో జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తున్న తెలుగుదేశం పార్టీ నేతలు కొన్ని నియోజకవర్గాల్లో కాడిపడేటం ఆ పార్టీ శ్రేణులను కలవరపెడుతోంది. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు నియోజకవర్గంలో పర్యటించకుండా స్తబ్దుగా ఉండిపోయారు. తనకు టికెట్ వస్తుందా? రాదా? అనే మీమాంశతో సతమతం అవుతున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని నాని ఇప్పటికే టీడీపీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఎంపీ టికెట్ విషయాన్ని ఎటూ తేల్చకపోవడంతో పార్టీ అధిష్టానంపైనా గుర్రుగా ఉన్నారు. తనకు ఎంపీ టికెట్ ఇవ్వని పక్షంలో తన కుమార్తెకు విజయవాడ పార్లమెంటరీ పరిధిలో ఓ అసెంబ్లీ స్థానం కేటాయించాలని పట్టుబడుతున్నారని తెలిసింది. మరోవైపు తన తమ్ముడు కేశినేని చిన్నికి ఎంపీ టికెట్ ఇస్తే సహకరించేది లేదని కేశినేని నాని షరతు విధించడంతో ఎటూ పాలుపోక చంద్రబాబు తలపట్టుకున్నట్లు పార్టీ శ్రేణుల్లోనే చర్చ సాగుతోంది. జనసేనతో పొత్తు తలనొప్పితో పాటు సొంత పార్టీలో నెలకొన్న అసంతృప్తులపై చంద్రబాబు అసహనం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. జగ్గయ్యపేట నియోజకవర్గంలో సైతం టీడీపీ వర్గాలు స్తబ్దుగా ఉన్నాయి. కృష్ణా జిల్లా పెనమలూరులో టీడీపీ రాజకీయ కార్యకలాపాలు చల్లబడ్డాయి. టీడీపీ, జనసేన మధ్య విభేదాలు ఆ రెండు పార్టీలకు కొమ్ముకాస్తున్న సామాజికవర్గాల మధ్య ఆధిపత్య పోరుకు వేదికగా మారుతున్నాయి.

అభ్యర్థులు లేకుండానే..

జనసేన తరఫున పోటీ చేసేందుకు బలమైన అభ్యర్థులు లేకుండానే మూడు సీట్లు ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు పట్టుపట్టడంతో టీడీపీ శ్రేణులు రగిలిపోతున్నాయి. గత సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలిచిన విజయవాడ తూర్పు సీటు కావాలని జనసేన పట్టుబట్టడంపై ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారనే చర్చ టీడీపీ వర్గాల్లో సాగుతోంది. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో టీడీపీ తరఫున పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఇప్పటికే నలుగురు అభ్యర్థులు ప్రకటించారు. టీడీపీ నాయకుల తీరును ఆ సీటును ఆశిస్తున్న జనసేన కార్యకర్తలు జీర్ణించుకోలేక పోతున్నారు. మొత్తం మీద జనసేన, టీడీపీ మధ్య సీట్ల పొత్తు పొడవక ముందే విభేదాలు తీవ్రమవుతున్నాయి.

బాలోత్సవం ప్రారంభం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పిల్లల్లో ఉన్న ఆసక్తిని తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహించాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు సూచించారు. పీబీ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో అమరావతి బాలోత్సవం మంగళవారం ఉదయం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా లక్ష్మణరావు హాజరై ప్రసంగించారు. ప్రస్తుత విద్యా విధానంలో మార్కులకు ప్రాధాన్యత ఇచ్చి పిల్లల ఆకాంక్షలను తల్లిదండ్రులు అణిచివేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఆటపాటలతో కూడిన విద్యావిధానం అవసరమని స్పష్టంచేశారు. 1990 సంవత్సరం వరకు విద్యావిధానం ప్రభుత్వం ఆధీనంలో ఉండేదని, ఏ ప్రభుత్వ పాఠశాలను చూసినా ఐదు ఎకరాల విస్తీర్ణంలో, క్రీడా మైదానంతో ఉండేదని గుర్తుచేశారు. ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల వల్ల పరిస్థితులు మారాయన్నారు. పిల్లలు ఏ రంగంలో ఆసక్తి చూపుతున్నారో తల్లిదండ్రులు గమనించి వారిని అందులో ప్రోత్సహిస్తే రాణిస్తారని సూచించారు.

26 జిల్లాల్లో బాలోత్సవం

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం మనీష్‌కుమార్ మాట్లాడుతూ.. పిల్లలను వికాసవంతులుగా చేయడానికి నిర్వహిస్తున్న బాలోత్సవంలో తాము భాగస్వాములు కావడంతో సంతోషంగా ఉందన్నారు. అమరావతి బాలోత్సవం కార్యదర్శి పి.మురళీకృష్ణ మాట్లాడుతూ.. ఆరేళ్ల క్రితం విజయవాడలో ఏర్పాటైన అమరావతి బాలోత్సవం ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించిందన్నారు. 26 జిల్లాల్లో 40 చోట్ల బాలోత్సవం నిర్వహిస్తున్నామని చెప్పారు. బాలోత్సవం కార్యదర్శి కొండలరావు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రావి శారద, జన శిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ ఎస్.విద్యాకన్నా, ఆంధ్రా మోటార్ మర్చెంట్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వై.సుబ్బారావు, సాహితీవేత్త గోళ్ల నారాయణ రావు, ఎన్టీఆర్ జిల్లా డీవైఈఓ కె.వి.ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాలోని 195 పాఠశాలల నుంచి సుమారు వెయ్యి మంది విద్యార్థులు ఈ బాలోత్సవంలో పాల్గొన్నారు. విద్యార్థుల రాకతో సిద్ధార్థ ఆడిటోరియం, కళాశాల మైదానం మొత్తం సందడిగా మారింది.



నృత్యం చేస్తున్న చిన్నారి

ఉత్సాహంగా కార్యక్రమాలు

అమరావతి బాలోత్సవం పేరుతో నిర్వహించిన కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జానపద నృత్యం, క్లాసికల్ డాన్స్, ఏకపాత్రాభినయం, లఘు నాటికలు, దేశభక్తి గీతాల పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బెస్ట్ ఫ్రమ్ వేస్ట్, కార్టూన్, కవితా రచన, కథా రచన, వార్తా రచన, కథా విశ్లేషణ పోటీల్లో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. బుధ, గురువారం కూడా బాలోత్సవం జరుగనుంది.



విద్యార్థినుల జానపద నృత్యం

అంబేడ్కర్ స్మృతివనం కన్వెన్షన్ ట్రెస్‌వర్క్ ప్రారంభం

పటమట(విజయవాడతూర్పు): స్థానిక స్వరాజ్య మైదానంలో ఏర్పాటవుతున్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్మృతి వనంలో కన్వెన్షన్ హాల్ ట్రెస్‌వర్క్ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పనులకు మునిసిపల్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి, విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కేపీసీ డైరెక్టర్ పి.వాసుదేవరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. జనవరి 20, 2024 నాటికి స్మృతివనం పనులు పూర్తవుతాయని తెలిపారు. అంబేడ్కర్ స్మృతివనాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించి, జాతికి అంకితం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. మిగిలిన ల్యాండ్ స్కేపింగ్, రూఫ్, స్లాబ్, సాండ్ స్టోన్ జాలి పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. అంబేడ్కర్ జీవిత చరిత్రను తెలిపేలా ఆయన బాల్యం, విద్య, ఉద్యోగం, రాజకీయ జీవితం, పోరాటం, రాజ్యాంగ నిర్మాణంలోని ఘట్టాలకు సంబంధించిన ఛాయా చిత్రాలు, వస్తువులను ప్రదర్శించేందుకు మ్యూజియం ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.



కన్వెన్షన్ హాల్ ట్రెస్‌వర్క్ పనులకు శంకుస్థాపన చేస్తున్న శ్రీలక్ష్మి

డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వర్సిటీ వాలీబాల్ జట్టు ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్: దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పురుషుల జట్టును ఎంపిక చేసినట్లు వర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ ఇ.త్రిమూర్తి తెలిపారు. ఎం.బలరామ్ (డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీ, చినఅవుటపల్లి), జి.మురళి (గ్రేట్ ఈస్టర్న్ మెడికల్ కాలేజీ, శ్రీకాకుళం), కె.శ్యామలరావు (బోలినేని పారామెడికల్ కాలేజీ, శ్రీకాకుళం), కె.జగదీశ్వరరావు (బోలినేని పారామెడికల్ కాలేజీ, శ్రీకాకుళం), ఎం.సందీప్‌కుమార్ (ఎస్‌ఆర్‌ఐ కాలేజీ, చినకాకాని), ఆదిత్య మనోజ్ (ప్రభుత్వ మెడికల్ కాలేజీ, కడప), యు.మణిదీప్‌వర్మ (కోనసీమ మెడికల్ కాలేజీ, అమలాపురం), బి.రాము (సెయింట్ జోసఫ్ నర్సింగ్ కాలేజీ, ఏలూరు), ఐ.అనీల్‌కుమార్ (ఈఎంఎంఐ నర్సింగ్ కాలేజీ, గుంటూరు), టి.మహేష్ (నాగార్జున నర్సింగ్ కాలేజీ, విజయవాడ), వి.పవన్ (నిమ్రా నర్సింగ్ కాలేజీ, విజయవాడ), కె.సాగర్ (జీడీఎంఏ నర్సింగ్ కాలేజీ, నందిగామ) జట్టుకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఎంపికైన జట్టును యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కె.బాబ్జి, రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి విజయవాడలోని వర్సిటీ ప్రాంగణంలో మంగళవారం అభినందించారు.



డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వర్సిటీ వాలీబాల్ జట్టు

భర్తను కడతేర్చిన భార్య

వీరులపాడు(నందిగామ): వివాహేతర సంబంధాన్ని చూసి, చేయిచేసుకున్న భర్తను ఓ మహిళ ప్రియుడితో కలిసి హత్య చేసింది. ఈ ఘటన వీరులపాడు గ్రామంలో జరిగింది. వీరులపాడు గ్రామానికి చెందిన యాదల శ్రీనివాసరావు (ఏలియా) (58) పాస్టర్‌గా జీవిస్తున్నాడు. ఎప్పటిలానే సోమవారం ఉదయం వేరే గ్రామానికి వెళ్లి రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో భార్య వాణి వేరే వ్యక్తితో ఉండటాన్ని చూసి కోపంతో ఆమెపై చేయి చేసుకున్నాడు. వాణి తన ప్రియుడితో కలిసి కేబుల్ వైర్‌తో శ్రీనివాసరావు మెడకు ఉరిబిగించింది. భర్త చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత వాణి తన ప్రియుడిని అక్కడి నుంచి పంపించేసింది. మంగళవారం ఉదయం ఏడు గంటల సమయంలో వాణి తన భర్త చనిపోయాడని, ఎలా మృతి చెందాడో తనకు తెలియదని, తామిద్దరం వేర్వేరు గదుల్లో నిద్రించామని చుట్టుపక్కల వారిని నమ్మించే ప్రయత్నం చేసింది. స్థానికులకు వాణిపై అనుమానం కలగడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. ఏసీపీ కె.జనార్దన్ నాయుడు, నందిగామ రూరల్ సీఐ నాగేంద్ర కుమార్, వీరులపాడు ఎస్‌ఐ మహాలక్ష్మడు, కంచికచర్ల ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం ఘటనాస్థలానికి చేరుకుని శ్రీనివాసరావు భౌతికకాయాన్ని పరిశీలించారు. వాణిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏసీపీ తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.



శ్రీనివాసరావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ

ఇది పరీక్ష సమయం

- మార్చి ఒకటి నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు
- అదే నెల 18 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం
- ఉమ్మడి కృష్ణా జిల్లాలో 54,710 మంది టెన్త్, 1,17,965 మంది ఇంటర్ విద్యార్థులు
- విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేస్తున్న విద్యాసంస్థలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో పరీక్షల కాలం మొదలైంది. 2024 సంవత్సరం ఏప్రిల్ మాసంలో సాధారణ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మార్చి నెలాఖరు లోపు పదో తరగతి, ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో రాష్ట్ర విద్యాశాఖ టెన్త్, ఇంటర్ పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో చదువుతున్న టెన్త్, ఇంటర్మీడియెట్ విద్యార్థుల్లో పరీక్షల ఫీవర్ ప్రారంభమైంది. ఇప్పటికే సెకండరీ, మాధ్యమిక విద్యాశాఖలు విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేసే దిశగా పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. విద్యాశాఖ ఈ ఏడాది జూలై నుంచే పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది.

మార్చి నుంచి పరీక్షల షెడ్యూల్

ప్రస్తుత విద్యాసంవత్సరం 2023–24నకు సంబంధించి 2024 మార్చి ఒకటో తేదీ నుంచి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం, రెండో తేదీ నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షల షెడ్యూల్‌ను మాధ్యమిక విద్యాశాఖ విడుదల చేసింది. ఇంటర్ బోర్డు విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం మార్చి ఒకటి నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయి. మొదటి సంవత్సరం పరీక్షలు మార్చి 19న, ద్వితీయ సంవత్సరం పరీక్షలు 20వ తేదీతో ముగుస్తాయి. ఫిబ్రవరి రెండో తేదీన ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్, మూడో తేదీన ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలు జరుగుతాయి. ఆ పరీక్షలను ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తారు. సమగ్ర శిక్ష ఒకేషనల్ ట్రేడ్ ఎగ్జామినేషన్‌ను ఫిబ్రవరి 22న ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తుంది. ఇంటర్ సెకండియర్ జనరల్ విద్యార్థులకు ఫిబ్రవరి 11 నుంచి 20 వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయి. ఒకేషనల్ విద్యార్థులకు ఫిబ్రవరి ఐదు నుంచి 20 వరకు ఉదయం, మధ్యాహ్నం సెషన్స్‌లో నిర్వహిస్తారు. ఉదయం సెషన్ ప్రాక్టికల్స్ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ ప్రాక్టికల్స్ రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతాయి.



తరగతి గదిలో పదోతరగతి విద్యార్థులు

345 కళాశాలల్లో 1,17,965 మంది విద్యార్థులు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో 345 కళాశాలల నుంచి 1,17,965 మంది విద్యార్థులు ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు హాజరుకానున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో 189 కళాశాలలు ఉండగా వాటి నుంచి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం విద్యార్థులు 38,430 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 35,378 మంది పరీక్షలు రాయనున్నారు. కృష్ణాజిల్లాకు సంబంధించి 156 కళాశాలల నుంచి 23553 మంది మొదటి ఏడాది, 20604 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారు.

మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు..

ఉమ్మడి జిల్లాలో 2024 మార్చి 18 నుంచి మార్చి 30వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. 18న ఫస్ట్ లాంగ్వేజ్‌తో ప్రారంభమై 30న ఓఎస్ఎస్‌సీ లాంగ్వేజ్ పేపరు–2తో పరీక్షలు ముగుస్తాయి. పరీక్షల షెడ్యూల్‌ను ఏపీ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ విడుదల చేసింది. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయి. గత విద్యా సంవత్సరం ఈ పరీక్షలను రోజు విడిచి రోజు నిర్వహించారు. ఈ సారి వరుసగా నిర్వహిస్తున్నారు. అయితే ఈ ఏడాది ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ పేపర్లను మాత్రం వేర్వేరుగా నిర్వహిస్తారు.

ఉమ్మడి జిల్లాలో పదో తరగతి విద్యార్థులు ఇలా..

ఉమ్మడి కృష్ణాజిల్లాలో 54,710 మంది పదో తరగతి విద్యార్థులు ఈ ఏడాది పరీక్షకు హాజరుకానున్నారు. 25,660 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన 17 మండలాల్లోని 480 విద్యా సంస్థలకు నుంచి 28,181 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారు. వారిలో 10,006 మంది ప్రైవేట్ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు ఉన్నారు. కృష్ణాజిల్లాకు చెందిన 25 మండలాల్లోని 398 విద్యా సంస్థలకు చెందిన 26,529 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారు. వారిలో 15,654 మంది ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు ఉన్నారు.

పంట నష్టం సర్వే పూర్తి

- గ్రామస్థాయిలో సిద్ధమైన జాబితాలు
- రైతుభరోసా కేంద్రాల్లో ప్రదర్శన
- ఆర్‌బీకే స్థాయిలో సోషల్ ఆడిట్

కంకిపాడు(పెనమలూరు): పంట నష్టం సర్వే పూర్తయింది. గ్రామస్థాయిలో పంట నష్టం వివరాలను నమోదు చేసిన అధికారులు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో జాబితాలను సిద్ధంగా ఉంచారు. రైతులు ఆ జాబితాలను పరిశీలించుకుని అభ్యంతరాలు తెలిపేందుకు అవకాశం కూడా ప్రభుత్వం ఇచ్చింది. పంట నష్టం జాబితా పారదర్శకంగా రూపొందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంది.

నష్టం ఇలా..

మిచాంగ్ తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా పంటలకు అపార నష్టం వాటిల్లింది. 1.03 లక్షల హెక్టార్లలో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. 96,421 హెక్టార్లలో వరి పంట దెబ్బతింది. 324 హెక్టార్లలో మొక్కజొన్న, 5765 హెక్టార్లలో మినుము, 212 హెక్టార్లలో పత్తి, 1056 హెక్టార్లలో వేరుశనగ దెబ్బతిన్నాయి. 568 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లిందని అంచనా.

సిద్ధమైన జాబితాలు..

రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం పంట నష్టం సర్వే చేసి నివేదికలు రూపొందించాలని ఆదేశించింది. దీంతో కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు పర్యవేక్షణలో వ్యవసాయశాఖ, రెవెన్యూశాఖ, ఉద్యానశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టం సర్వే చేపట్టారు. ఈ నెల 11వ తేదీన పంట నష్టం సర్వే చేపట్టి మంగళవారం పూర్తి చేశారు. పంటల వారీగా, 33 శాతం పైన నష్టం వాటిల్లిన వాటి వివరాలను నమోదు చేశారు. అంతకంటే తక్కువగా వాటిల్లిన పంట నష్టం వివరాలను సైతం సేకరించారు. రైతులు, కౌలురైతులు, పంట వారీగా, ఇన్‌పుట్ సబ్సిడీ వివరాలను నమోదు చేసి జాబితాలను సిద్ధం చేశారు. ఈ మేరకు జాబితాలను ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచారు. మండల, డివిజన్, జిల్లాస్థాయి అధికారులు గ్రామాల్లో పర్యటించి నష్టం వివరాలను తెలుసుకున్నారు. ఎక్కడా లోటుపాట్లు తలెత్తకుండా, రైతులకు నష్టం వాటిల్లకుండా భరోసా ఇచ్చేలా పంట నష్టం సర్వే పూర్తి చేశారు. పంట నష్టం జాబితాలపై ఈనెల 22వ తేదీ నుంచి ఆ జాబితాపై అభ్యంతరాలను స్వీకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ లోపు ఆర్‌బీకే స్థాయిలో సోషల్ ఆడిట్ నిర్వహించి జాబితాను ఆమోదించి అభ్యంతరాలను పరిష్కరించి తుది జాబితాను మండల, డివిజనల్ స్థాయి ఆమోదంతో ఈనెల 26వ తేదీ నాటికి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి నివేదించనున్నారు. సోషల్ ఆడిట్ ద్వారా పంట నష్టపోయిన రైతుల వివరాలను పారదర్శకంగా రూపొందించేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో సోషల్ ఆడిట్‌లను నిర్వహించనున్నారు.



పొలాన్ని పరిశీలించి నష్టం అంచనా వేస్తున్న కృష్ణా జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి

క్లుప్తంగా

సాంకేతిక ఆవిష్కరణలు పెరగాలి

శాస్త్రవేత్త రామకృష్ణ



పెనమలూరు: స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ సాంకేతిక ఆవిష్కరణలకు వేదిక అని, విద్యార్థులు వారిలో ఉన్న నైపుణ్యాన్ని వినియోగించి ఆవిష్కరణలు చేయాలని హైదరాబాద్‌కు చెందిన ఏఆర్‌సీఐ శాస్త్రవేత్త డాక్టర్ ఎల్.రామకృష్ణ అన్నారు. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలే పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ యువత వారి నైపుణ్యాన్ని వ్యక్తిగత ఎదుగుదల కోసం స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ సాంకేతిక ఆవిష్కరణలకు వేదికగా ఉపయోగించుకోవాలని సూచించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు మాట్లాడుతూ పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో నోడల్ కేంద్రంగా సాఫ్ట్‌వేర్ క్యాటగిరిలో 5 థీమ్స్ నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో 27 అగ్రశ్రేణి బృందాల నుంచి 162 మంది పాల్గొని తమ నైపుణ్యం ప్రదర్శిస్తారని అన్నారు. ప్రతి థీమ్‌లో గెలుపొందిన జట్టుకు రూ. లక్ష చొప్పున 5 జట్లకు రూ. 5 లక్షలు బహుమతి ఉంటుందని తెలిపారు. కాగా జాతీయ స్థాయిలో జరుగుతున్న పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు పాల్గొని వారు తక్కువ ఖర్చుతో రూపొందించిన మోడల్స్ ప్రదర్శించారు. కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, నోడల్ సెంటర్ అధికారి పి.సాయికిరణ్, టెక్నికల్ హెడ్ వెంగల జగదీష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



ఇబ్రహీంపట్నం: ఇంటి గోడలు తొలగిస్తుండగా విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందాడు. ఇబ్రహీంపట్నం భీమరాజుగుట్ట ప్రాంతంలో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. రోజువారీ కూలిపనులు చేసుకునే కె.అప్పయ్య (45) ఇంటి గోడలు తొలగిస్తున్నాడు. ఆ సమయంలో కరెంట్ షాక్‌కు గురైయ్యాడు. హుటాహుటిన విజయవాడ వైద్యశాలకు ఆటోలో తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుటుంబానికి ఆధారమైన భర్త చనిపోవడంతో కుటుంబ సభ్యులు శోకసముద్రాన మునిగారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దీక్ష విరమణలకు పక్కా ఏర్పాట్లు

దుర్గగుడి ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భవానీ దీక్ష విరమణలకు విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు ఆదేశించారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ఏఈవోలు, సూపరింటెంటెంట్లు, ఇంజినీరింగ్ అధికారులు, వెస్ట్ ఏసీపీ హనుమంతరావు, వన్‌టౌన్ పోలీసు అధికారులతో ఈవో రామారావు మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మహా మండపం నాల్గో అంతస్తులోని ఈవో చాంబర్‌లో జరిగిన సమావేశంలో గత ఏడాది భవానీ దీక్ష విరమణల సందర్భంగా దేవస్థానం చేసిన ఏర్పాట్లు, లోటుపాట్ల గురించి ఆలయ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు ఈవో రామారావు దృష్టికి తీసుకెళ్లారు. జనవరి 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే దీక్ష విరమణలకు పలు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులకు విచ్చేసే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా 6వ తేదీ సాయంత్రం నుంచి అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఈవో రామారావు సూచించారు.



ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో రామారావు, వెస్ట్ ఏసీపీ హనుమంతరావు తదితరులు

క్షేత్రస్థాయిలో ఏర్పాట్ల పరిశీలన..

భవానీ దీక్ష విరమణలను పురస్కరించుకుని దేవస్థానం భక్తులకు కల్పించే సదుపాయాలను క్షేత్ర స్థాయిలో అధికారులు పరిశీలించారు. కొండపై, వినాయకుడి గుడి వద్ద క్యూలైన్లు, కొబ్బరి కాయలు కొట్టే ప్రదేశం, ఇరుముడి పాయింట్లు, హోమగుండాలు, ప్రసాదం కౌంటర్లు, అన్నదానం, టాయిలెట్స్ ఏర్పాటు చేసే ప్రదేశాలను పరిశీలించారు. దీక్ష విరమణలు ప్రారంభమయ్యే రెండు, మూడు రోజులకు ముందుగానే ఏర్పాట్లు పూర్తి చేయడంతో పాటు వాటిని తనిఖీ చేయాలని సూచించారు. ఆలయ ప్రాంగణం క్యూలైన్లు కట్టుదిట్టంగా ఏర్పాటు చేయడంతో పాటు భక్తులకు అమ్మవారి దర్శనంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సెమీ క్రిస్మస్ వేడుకలకు విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ముస్తాబైంది. క్రైస్తవ మత విశ్వాసాలు ఉట్టిపడేలా వేడుకలు పూర్తి చేశారు. బుధవారం నిర్వహించనున్న ఈ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు తెలిపారు. వేడుకలు జరగనున్న ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరపున సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ వేడుకలకు 2,500 మంది చర్చి ఫాదర్లు, క్రైస్తవ మత పెద్దలతోపాటు 5వేల మందిపైగా హాజరవుతారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేడుకల్లో పాల్గొని క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తారన్నారు. రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానున్న నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాన వేదిక ఏర్పాట్లు విజయవాడ సబ్ కలెక్టర్ అదితిసింగ్ పర్యవేక్షణలో జరుగుతున్నాయన్నారు. వేడుకల సందర్భంగా తాత్కాలిక వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. క్యాండిల్ లైట్ సర్వీస్ నిర్వహించనున్న నేపథ్యంలో అగ్నిమాపక శాఖ అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు చేసిందన్నారు. వేడుకలలో పాల్గొనేవారికి అల్పాహారం, తాగునీరు పంపిణీ చేసేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. వేడుకల్లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం కేక్ కట్ చేస్తారన్నారు. ఏర్పాట్ల పరిశీలనలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి. సంపత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సెమీక్రిస్మస్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, అధికారులు

ప్రభుత్వ ఉద్యోగులకు నాణ్యమైన వైద్యసేవలు

కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నంటౌన్: కృష్ణా జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించటమే ధ్యేయంగా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య సేవలు విభాగాన్ని ప్రారంభిస్తున్నట్లు కృష్ణా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. నగరంలోని జిల్లా సర్వజన ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈహెచ్‌ఎస్ ప్రత్యేక వైద్యసేవల విభాగాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఉద్యోగులకు మెరుగైన వైద్యసేవలు అందించే దిశగా ఈ విభాగం పనిచేస్తుందన్నారు. ఆస్పత్రిలో ఉన్న గుండె సంబంధ వ్యాధుల విభాగంలో ఏర్పాటు చేసిన ఎకో పరికరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు, ఎంప్యానెల్డ్ ఆస్పత్రులు, నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో నగదు రహిత చికిత్స పొందే వీలు ఉందన్నారు. మచిలీపట్నంలో వైద్యకళాశాల ఏర్పాటు కావటంతో సూపర్‌స్పెషాలిటీ సౌకర్యాలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. జిల్లాలో 5,600 మంది ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, 6,400 మంది ఉద్యోగులు, 4 వేల మంది పెన్షనర్లతో కలిపి 16 వేల మందికి పైగా ఉద్యోగులు, పెన్షనర్లు ఈహెచ్‌ఎస్ ద్వారా లబ్ధి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డీఎం అండ్‌హెచ్‌వో జి. గీతాబాయి, జెడ్పీ సీఈవో వి. జ్యోతిబసు, ఆర్డీవో ఎం. వాణి, తహసీల్దార్ శ్రీవిద్య, డీసీహెచ్‌ఎస్ పి. శ్రావణ్‌కుమార్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి, ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ సతీష్, ఎన్జీవోల సంఘం కృష్ణాజిల్లా అధ్యక్షుడు ఉల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో ఉన్న పలు శిథిల భవనాలను పరిశీలించి మరమ్మతులు చేయించాలని ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



బందరు ప్రభుత్వాస్పత్రిలో ఈహెచ్‌ఎస్ వైద్య విభాగాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజాబాబు

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ విద్యుత్‌లైన్లు

పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ సీఎండీ పద్మజనార్దన్‌రెడ్డి

మచిలీపట్నంటౌన్: ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా తీరం వెంబడి తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని ఆంధ్రప్రదేశ్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ సీఎండీ జె. పద్మజనార్దన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మచిలీపట్నంలో జరిగిన ఉద్యోగుల, కార్మికుల ఆత్మీయ కలయిక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన మాట్లాడారు. మిచాంగ్ తుపాను మచిలీపట్నం ప్రాంతంలో తీరం దాటుతుందని వచ్చిన సమాచారంతో ముందు నుంచి ఈ ప్రాంత ఉద్యోగులను అప్రమత్తం చేశామన్నారు. ముందస్తు చర్యలతో పాటు పడిన విద్యుత్ స్తంభాలు, లైన్లను పునరుద్ధరించటంలో సిబ్బంది వర్షంలో సైతం రేయింబవళ్లు పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. అయితే రానున్న రోజుల్లో ఈ ఇబ్బందులకు తావు లేకుండా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ విద్యుత్‌లైన్ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. అలాగే ఈ ప్రాంతాల్లో 33 కేవీ లైన్లు ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలను తొలగించి టవర్ పోల్స్‌ను ఏర్పాటు చేసేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన విద్యుత్‌శాఖ కార్మికులకు పలు సూచనలు చేశారు.



విద్యుత్ కార్మికులతో మాట్లాడుతున్న సీఎండీ పద్మజనార్దన్‌రెడ్డి

పాన్ ఇండియా సినిమాలతో తెలుగు నటులకు మేలు

సినీ నటుడు వడ్డి నాగ మహేష్



హనుమాన్‌జంక్షన్ రూరల్: పాన్ ఇండియా సినిమాల శకం నడుతున్న ప్రస్తుత తరుణంలో తెలుగు చిత్రాలకు, నటులకు పరభాషా అభిమానుల ఆదరణ పెరిగిందని సినీనటుడు వడ్డి నాగ మహేష్ అన్నారు. ఖైదీ నంబర్ 150 సినిమాతో తెలుగు చిత్రసీమలోకి అడుగుపెట్టిన ఆయన వరుసగా రంగస్థలం, గద్దలకొండ గణేష్, ఉప్పెన, అఖండ, సార్, స్కంథ చిత్రాలతో ప్రేక్షకులలో మంచి గుర్తింపు సొంతం చేసుకున్నారు. రచయితగా ప్రయాణం మొదలు పెట్టి నటుడిగా స్థిరపడిన నాగ మహేష్ హనుమాన్‌జంక్షన్‌లో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరు అయ్యేందుకు వచ్చిన సందర్భంగా 'సాక్షి'తో కొద్దిసేపు ముచ్చటించారు.

రచయిత నుంచి నటుడిగా..

చిన్నప్పటి నుంచి నటనపై ఉన్న ఆసక్తితో 1990లో చెన్నై వెళ్లి ప్రయత్నాలు ప్రారంభించినప్పటికీ ఫలితం దక్కలేదని నాగ మహేష్ చెప్పారు. దీంతో ప్రత్యామ్నాయంగా 1996లో 'కొత్తపుంతలు' కథతో రచయితగా ప్రయాణం మొదలు పెట్టానని, 'శ్రీవల్లి' చిత్రానికి ప్రముఖ సినీ రచయిత విజయేంద్రప్రసాద్ వద్ద సహాయకుడిగా పని చేశానని తెలిపారు. ఎస్కే మిశ్రో శిష్యరికంలో రంగస్థల నటుడిగా పలు సాంఘిక నాటకాలలో నటించటంతో పాటు సినిమా రంగంపై ఆసక్తితో మళ్లీ ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలిపారు. దీంతో 2016లో మెగాస్టార్ చిరంజీవితో కలిసి ఖైదీ నంబర్ 150 సినిమాలో నటించే చాన్స్ దక్కిందని వివరించారు. ఆ సినిమాలో ఇన్‌స్పెక్టర్ పాత్ర, రంగస్థలంలో హీరోయిన్‌కి తాగుబోతు తండ్రిగా, ఉప్పెనలో విలన్ విజయ్ సేతుపతితో పాటు నటించిన గోవింద్ పాత్రలు ప్రేక్షకులకు దగ్గర చేశాయన్నారు. ఆ తర్వాత గద్దలకొండ గణేష్, అఖండ, సార్, స్కంథ చిత్రాలతో ప్రేక్షకులలో మంచి గుర్తింపు లభించిందని తెలిపారు. ఇప్పటికీ సుమారు 50కిపై తెలుగు చిత్రాలలో నటించగా, త్వరలో విడుదల కానున్న సలార్, ఉస్తాద్ భగత్ సింగ్, గేమ్ ఛేంజర్, యురేకా కసామిసా, శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్, రజకార్ చిత్రాలలోనూ మంచి పాత్రలలో నటించానని పేర్కొన్నారు. ప్రస్తుతం పాన్ ఇండియా సినిమాల శకం నడుస్తోందని, దీని వల్ల తెలుగు నటులకు ఇతర భాషల్లోనూ అవకాశాలు దక్కుతున్నాయని చెప్పారు. పాన్ ఇండియా మార్కెటింగ్ కోసం దర్శక, నిర్మాతలు వేర్వేరు భాషలకు చెందిన నటీనటులను ఎంపిక చేసుకుంటున్నారని తెలిపారు.

ఎన్నికలకు అధికారులు సంసిద్ధమవ్వాలి

మచిలీపట్నంటౌన్: త్వరలో జరగబోయే సాధారణ ఎన్నికల నాటికి అన్ని విభాగాల అధికారులు అన్ని అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కృష్ణా కలెక్టర్ పి. రాజాబాబు సూచించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి మంగళవారం ఆయన జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారులతో సాధారణ ఎన్నికలు, ఆడుదాం ఆంధ్రా, పంట నష్టం అంచనాలు, ధాన్యం సేకరణ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ప్రచురించిన అప్‌డేటెడ్ ఎన్నికల మాన్యువల్‌ను అధికారులందరూ బాధ్యతగా చదివి, అవగాహన పెంచుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణపై త్వరలో సంబంధిత అధికారులకు శిక్షణ ఇస్తామన్నారు. ఓటర్ల, జనాభా నిష్పత్తిలో ఎలాంటి తేడాలు లేకుండా చూడాలన్నారు.

ఆడుదాం ఆంధ్రాకు పక్కా ఏర్పాట్లు..

జిల్లాలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా క్రీడలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. క్రీడా మైదానాల్లో గడ్డిని తొలగించాలని, వర్షపు నీరు ఉంటే తోడించాలని సూచించారు. దీనిపై జెడ్పీ సీఈవో, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు.

పంట నష్టంపై సోషల్ ఆడిట్..

జిల్లాలో పంట నష్టం అంచనాలు రూపొందించటం పూర్తయ్యిందని, ఈ వివరాలను సోషల్ ఆడిట్ నిమిత్తం రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించాలని అధికారులకు సూచించారు. వివరాల్లో ఉన్న అభ్యంతరాలను రైతుల నుంచి స్వీకరించి తయారుచేసిన పూర్తి జాబితాను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. వీడియోకాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ అపరాజితాసింగ్, డీఆర్వో పెద్ది రోజా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్లు, ఎస్పీల సమీక్షకు ఏర్పాట్ల పరిశీలన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ–2024, ఎన్నికల సన్నద్ధతపై విజయవాడలోని నోవోటెల్ హోటల్‌లో ఈ నెల 22, 23 తేదీలలో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష సమావేశం జరగనుంది. ఈ నేపథ్యంలో మంగళవారం రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో) ముఖేష్ కుమార్ మీనాతో కలిసి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ సమావేశానికి ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐ) సీనియర్ డెప్యూటీ ఎలక్షన్ కమిషనర్లు, డెప్యూటీ ఎలక్షన్ కమిషనర్లు సహా మొత్తం ఏడుగురు ప్రతినిధుల బృందం న్యూఢిల్లీ నుంచి రానున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశ మందిరంలో సీటింగ్, అడ్రెసింగ్ సిస్టమ్, భద్రత తదితర ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలన్నారు. సదస్సుకు హాజరుకానున్న ఉన్నతాధికారులకు రవాణా, బస, వసతి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సదస్సు నిర్వహణకు నోడల్ అధికారిగా జాయింట్ కలెక్టర్ వ్యవహరిస్తారని, ప్రత్యేకంగా నియమించిన సమన్వయ అధికారులు, సహాయ సమన్వయ అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్థంగా నిర్వహించాలన్నారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి. సంపత్ కుమార్, సబ్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం. సుహాసిని తదితరులు ఉన్నారు.



నోవోటెల్ హోటల్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ముఖేష్ కుమార్ మీనా, ఢిల్లీరావు

ఎంకే బేగ్ స్కూల్‌కు ఉత్తమ పాఠశాల అవార్డు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్లాస్టిక్ నిర్మూలనకు కృషిచేస్తున్న సింగ్‌నగర్‌లోని ఎంకే బేగ్ మునిసిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాల ఉత్తమ పాఠశాల అవార్డుకు ఎంపికైంది. బందరు రోడ్డులోని ఓ హోటల్‌లో మంగళవారం జరిగిన డెవలప్ రెస్పాన్సబుల్ ఔట్ లుక్ ఫర్ ప్లాస్టిక్ (డ్రాప్)ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిర్మూలన, రీసైక్లింగ్ అవగాహన, శిక్షణ కార్యక్రమంలో ముఖ్యఅతిథి, ఇండియన్ పొల్యూషన్ కంట్రోల్ అసోసియేషన్ డైరెక్టర్ ఆశీష్ జైన్ చేతుల మీదుగా పాఠశాల హెచ్ఎం ఎంఎస్ ఇమామ్‌బాషా ఈ అవార్డు అందుకున్నారు. ప్లాస్టిక్ రహిత సమాజాన్ని స్థాపించేందుకు ఎంకే బేగ్ స్కూల్ విద్యార్థులు చూపుతున్న కృషిని అభినందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల సమష్టి కృషి వల్లే తమకు అవార్డు లభించిందని హెచ్ఎం ఇమామ్‌బాషా తెలిపారు.



ఆశీష్‌జైన్ చేతులమీదుగా అవార్డు తీసుకుంటున్న హెచ్‌ఎం ఇమామ్‌బాషా

ఆర్టీసీ జోనల్ చైర్మన్‌గా పిన్నెంటి మహేష్



కృత్తివెన్ను(పెడన): ఆర్టీసీ కృష్ణాజిల్లా జోనల్ (విజయవాడ జోన్) చైర్మన్‌గా పిన్నెంటి మహేష్‌ను నియమించారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి మహేష్ కుటుంబం పార్టీకి విధేయతగా ఉంది. ప్రస్తుతం ఆయన కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా కూడా పనిచేస్తున్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ జగనన్న న్యాయం చేస్తారని ఈ సందర్భంగా మహేష్ అన్నారు. కృత్తివెన్ను మండలం మునిపెడకు చెందిన మహేష్‌ను చైర్మన్‌గా నియమించడంతో మండలంలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తల్లో సంతోషం నెలకొంది.

రేపు అథ్లెటిక్స్ క్రాస్‌కంట్రీ జిల్లా జట్ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్: అథ్లెటిక్స్ క్రాస్ కంట్రీ అండర్–20, 18, 16 రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించే కృష్ణా జిల్లా జట్లను ఈ నెల 21వ తేదీన విజయవాడలో ఎంపిక చేస్తున్నట్లు కృష్ణా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి వెల్లడించారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు జనన ధ్రువీకరణ, ఆధార్, రెండు పాస్ పోర్ట్‌సైజ్ ఫొటోలతో ఆ రోజు ఉదయం 5.30 గంటలకు సంప్రదించాలని సూచించారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 24వ తేదీన తూర్పుగోదావరి జిల్లాలోని సామర్లకోటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

క్లుప్తంగా

సాఫ్ట్ టెన్నిస్ జాతీయ పోటీలకు ఎంపిక



విజయవాడస్పోర్ట్స్: సాఫ్ట్ టెన్నిస్ జాతీయ పోటీలకు ఎస్‌డీఎం సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థినులు ఎం.భావన, పి.లావణ్య ఎంపిక య్యారు. గుంటూరులోని బీఆర్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి సింగిల్స్ పోటీల్లో భావన సిల్వర్, లావణ్య బ్రాంజ్ మెడల్‌ను సొంతం చేసుకున్నారు. అనంతరం నిర్వహించిన ఎంపిక పోటీల్లోనూ ఇరువురు క్రీడాకారిణులు అద్భుతమైన క్రీడా నైపుణ్యంతో రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్నారు. వచ్చే ఏడాది జనవరి 13 నుంచి 17వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కాలేజీలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ డాక్టర్ టి.విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కల్పన, ఫిజికల్ డైరెక్టర్ వి.లక్ష్మీకనకదుర్గ క్రీడాకారిణులను అభినందించారు.

కరాటేలో విద్యార్థుల సత్తా



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈ నెల 17న పటమట చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 14వ జాతీయ కరాటే చాంపియన్ షిప్–2023 పోటీల్లో శ్రీ చైతన్య ఒలింపియాడ్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ఆ స్కూల్ విద్యార్థులు జి.చరితశ్రీ, జి.ద్రోణి, ఎస్.విజయహాసిని, వై.చైత్ర, జి.ప్రహర్షిణిలు ఉత్తమ ప్రతిభతో ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుపొందినట్లు స్కూల్ ఆర్ఐ పద్మ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను మంగళవారం ఆమె అభినందించారు. ఆర్ఐ పద్మ మాటల్లాడుతూ కరాటే అంటే ఆత్మ రక్షణ నైపుణ్యాలను నేర్పుతుందన్నారు. ఇతర సమస్యలు రాకుండా నిరోధించుకోవడానికి ప్రాచీన క్రీడల్లో కరాటే ఉత్తమమైనదిగా పేర్కొన్నారు. విజేతలను పాఠశాల ఈజీఎం మద్దినేని మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ జ్ఞానసుందరి, అకడమిక్ డీన్ వెంకటేశ్వర్లు అభినందించారు.

మసాజ్ సెంటర్లపై దాడులు

విజయవాడస్పోర్ట్స్: పటమట, మాచవరం, గుణదల ప్రాంతాల్లోని పలు మసాజ్ సెంటర్లపై మంగళవారం సాయంత్రం పోలీసులు దాడులు నిర్వహించారు. ఆయా మసాజ్ సెంటర్లలో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే ముందస్తు సమాచారంతో ఎన్టీఆర్ జిల్లా పోలీస్‌కమిషనర్ టి.కె.రాణా ఆదేశాలతో పోలీసులు దాడులు చేపట్టారు. మాచవరంలోని రెండు మసాజ్ సెంటర్లలో వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరు నిర్వాహకులను, 14 మంది యువతులను, ఎనిమిది మంది విటులను అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా పటమట, గుణదల పోలీస్ స్టేషన్ల పరిధిలోని రెండు సెంటర్లలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇద్దరు నిర్వాహకులతో పాటు ఐదుగురు యువతులను, ఇద్దరు విటులను అదుపులోకి తీసుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): శ్రీనగర్, రింగ్‌రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ బెంజ్‌సర్కిల్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ గుణదల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజలకు చేరువగా నాణ్యమైన వైద్య సేవలు

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు
- 22వ డివిజన్‌లో యూపీహెచ్‌సీ ప్రారంభం



22వ డివిజన్‌లో యూపీహెచ్‌సీని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, మేయర్ భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ఈ రంగంలో సంస్కరణలపై దాదాపు రూ.32 వేల కోట్లు ఖర్చు చేసిందని, డాక్టర్ వైఎస్సార్ యూపీహెచ్‌సీలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేశాయన్నారు. కృష్ణలంక, 22వ డివిజన్‌లోని, స్వర్గపురి సమీపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు రూ.99.40 లక్షల వ్యయంతో నిర్మించిన ఆయుష్మాన్ భారత్–డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని(యూపీహెచ్‌సీ) మంగళవారం ఆయన నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 22వ డివిజన్ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి, అధికారులతో కలిసి ప్రారంభించారు. యూపీహెచ్‌సీలోని మెడికల్ ఆఫీర్ గదితో పాటు రిసెప్షన్, ఇన్‌పేషెంట్, ఫార్మసీ తదితర విభాగాలను ప్రారంభించారు.

నగరంలో 40 యూపీహెచ్‌సీలు..

అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. అన్ని రకాల సౌకర్యాలతో గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, పట్టణాల్లో యూపీహెచ్‌సీల ద్వారా ప్రజలకు అత్యంత చేరువలో వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఒక్క ఎన్టీఆర్ జిల్లాలోనే 2019 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు వివిధ రకాల చికిత్సలు, శస్త్రచికిత్సల కోసం రూ.427 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకాన్ని దేశంలోని ఇతర రాష్ట్రాలు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాయన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. నగరంలో 40 యూపీహెచ్‌సీలు సేవలు అందిస్తున్నాయని, వీటి ద్వారా పేదలకు చేరువలోనే ఆరోగ్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. భ్రమరాంబపురం ప్రాంతంలోని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఈ యూపీహెచ్‌సీ బాగా ఉపయోగపడుతుందన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, జిల్లా ప్రోగ్రామింగ్ అధికారి మహేష్, జిల్లా ప్రోగ్రామింగ్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ నవీన్, యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక, స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు, నాయకులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలని సెంట్రల్ జీఎస్టీ జాయింట్ కమిషనర్(గుంటూరు జిల్లా) బి.లక్ష్మీనారాయణ చెప్పారు. వీరమాచినేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ 41వ స్పోర్ట్స్ డే మంగళవారం స్కూల్ మైదానంలో జరిగింది. లక్ష్మీనారాయణ అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు క్రీడలు ఆడటం వల్ల శరీరంలోని నరాల వ్యవస్థ పనితీరు మెరుగ్గా ఉంటుందని దాని వల్ల ఉత్సాహంగా ఉండవచ్చునని చెప్పారు. క్రీడల్లో ప్రతిభ చూపడంతో గుర్తింపు వస్తుందన్నారు సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, అకాడమీ జాయింట్ సెక్రటరీ ఎన్.లలిత్‌ప్రసాద్, వీపీఎస్ పబ్లిక్ స్కూల్ కన్వీనర్ శ్రీవిష్ణు, పాఠశాల ప్రిన్సిపాల్ సీతారామయ్య పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను అందజేశారు.

నేటి సెమీ క్రిస్మస్ వేడుకలకు పటిష్ట బందోబస్తు



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సీపీ రాణా, అధికారులు

విజయవాడస్పోర్ట్స్: విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఈ నెల 20వ తేదీ బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సెమీ క్రిస్మస్ వేడుకలకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. స్టేడియంలో చురుగ్గా జరుగుతున్న కార్యక్రమ ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం ఆయన పర్యవేక్షించారు. ఈ వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో భద్రత ఏర్పాట్లను అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని అత్యంత పగడ్బందీగా చేస్తున్నామన్నారు. పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు, డీసీపీ వి.అజిత, ఏసీపీ పి.భాస్కరరావు ఉన్నారు.

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి



గుణదల(విజయవాడతూర్పు): విద్యార్థులు కళాశాల స్థాయిలోనే ఉత్తమ పౌరులుగా ఎదిగే దిశగా విద్యా సంస్థలు కృషి చేయాలని ఆంధ్ర లయోల కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ జీఏపీ కిషోర్ అన్నారు. కళాశాల ఆవరణలో వీక్షిత్ భారత్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. చదువుతో పాటు సామాజిక అంశాల పట్ల అవగాహన పెంచుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని కాంక్షించారు. స్మార్ట్ సిటీస్ ఫర్ ఏ స్మార్ట్ టుమారో, అర్బన్ డెవలెప్‌మెంట్ ఇన్ వీక్షిత్ భారత్ అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. ఇదే అంశంపై పెయింటింగ్ కాంపిటీషన్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించి సామాజిక అంశాల పట్ల అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహద పడతాయన్నారు. అనంతరం విద్యార్థులు వ్యాసరచన, పెయింటింగ్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా అంశాల్లో తమ ప్రతిభను కనబరిచారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో సంతోషంగా ప్రజలు



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న అవినాష్, డెప్యూటీ మేయర్ దుర్గ, నాయకులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చెప్పారు. 6వ డివిజన్ వీరన్న వీధి కొండ ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అవినాష్ మంగళవారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంటి తలుపు కొట్టి అందజేస్తున్నామన్నారు. దీంతో ప్రజలు చాలా సంతోషంగా, సంతృప్తిగా ఉన్నారని అవినాష్ చెప్పారు. తమ ప్రభుత్వంలో కొండ ప్రాంతాల్లో అభివృద్ధి వేగంగా జరుగుతోందన్నారు. కులం, మతం పార్టీలకు అతీతంగా అందరికీ మంచి చేస్తూ సీఎం వైఎస్.జగన్ పాలన అందిస్తున్నారన్నారు. దీనిని చూసి టీడీపీ, దాని తోక పార్టీలకు భయం పట్టుకుని ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టాలని చూడటం దారుణమని చెప్పారు. లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు స్పందన లేదని అందువల్లనే మధ్యలోనే పాదయాత్రను నిలుపువేస్తున్నాడన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని అవినాష్ డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో ఘన విజయం సాధించడం ఖాయమని అవినాష్ ధీమా వ్యక్తంచేశారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్ వియ్యపు అమర్నాథ్, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఇజ్జాడ తేజేష్, నాయకులు ప్రభు, రామారావు, డాలి నాయుడు, శివ, కృష్ణ, శివయ్య, కోటయ్య, వాసు, నాని, యశ్వంత్, సుధాకర్ పాల్గొన్నారు.

22న బీసీ రథయాత్రకు తరలిరండి



రథయాత్ర వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘ నేతలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బీసీలకు శాసనసభలో 90 శాతం, పార్లమెంట్‌లో 13 శాతం స్థానాలను అన్ని రాజకీయ పార్టీలు కల్పించాలనే డిమాండ్‌తో ఈ నెల 22వ తేదీన నిర్వహించే బీసీ రథయాత్రకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏపీ ఇన్‌చార్జి వై.నూకాలమ్మ పిలుపునిచ్చారు. చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి కల్యాణ మండపంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రథయాత్ర వాల్‌పోస్టర్లు, కరపత్రాలను పలువురు బీసీ సంక్షేమ సంఘం నేతలు ఆవిష్కరించారు. అనంతరం బీసీ నాయకుడు శీరం నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూకాలమ్మ మాట్లాడుతూ.. బీసీల రాజాధికారం కోసం మరో స్వాతంత్ర్య పోరాట రథయాత్ర పేరిట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. బీసీలకు అన్ని రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని కోరుతున్నామని, అలా కేటాయించిన వారికే మద్దతు తెలుపుతామన్నారు. కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టి, చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో విజయవాడ సిటీ అధ్యక్షుడు, రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు కనిశెట్టి లక్ష్మణరావు, సంఘం విజయవాడ ఉపాధ్యక్షుడు తమ్మిన దుర్గారావు, బీసీ లీగల్ సెల్ కన్వీనర్, పిల్లా శ్రీనివాసరావు, సుకాశి సరిత, పీసా అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

22న నిర్మలా హైస్కూల్ డైమండ్ జూబ్లీ వేడుకలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, నోసా డైరెక్టర్ జీబీ ఆంటోనీ తదితరులు

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని ప్రముఖ విద్యా సంస్థ నిర్మలా హైస్కూల్ ప్రారంభించి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 22వ తేదీన పాఠశాల డైమండ్ జూబ్లీ వేడుకలు, 23న నిర్మలా పూర్వ విద్యార్థుల సంఘం(నోసా) స్వర్ణోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్మలా హైస్కూల్ ప్రిన్సిపాల్, నోసా డైరెక్టర్ జీబీ ఆంటోనీ తెలిపారు. పటమట నిర్మలా హైస్కూల్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. 1963వ సంవత్సరంలో మిషనరీస్ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలను ప్రారంభించామని, నాటి నుంచి నేటి వరకు లక్షలాది మంది విద్యార్థులను ఉన్నతవంతులుగా తీర్చిదిద్దామన్నారు. నిర్మలా హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు టి.వి.శివ రామారావు, కార్యదర్శి పెద్ది యశస్వినీలు మాట్లాడుతూ, నిర్మలా స్కూల్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో పాఠశాల అభివృద్ధికి తమ సంఘం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వేడుకలకు ముఖ్య అతిథులుగా విజయవాడ బిషప్ రెవరెండ్ డాక్టర్ జోసఫ్ రాజారావు, రాష్ట్ర ప్రభుత్వ ఐటీఈ అండ్ సీ విభాగం సెక్రటరీ కోన శశిధర్, జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఈవో సి.వి.రేణుక, నిర్మలా హైస్కూల్ పూర్వ విద్యార్థిని, సినీ నటి లయ పాల్గొంటారన్నారు. వజ్రోత్సవ వేడుకలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కరస్పాండెంట్ సిస్టర్ రోబెస్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ వైద్య సేవలు పేదలకు వరం

వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్



7వ డివిజన్‌లో ఆరోగ్యశ్రీ కార్డులు అందజేసిన దేవినేని అవినాష్, కార్పొరేటర్ మాధురి తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పేదలకు ఒకవరం లాంటిదని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.25 లక్షలకు పెంచారన్నారు. ప్రభుత్వం కొత్త ఫీచర్స్‌తో ముద్రించిన స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులను మంగళవారం 7వ డివిజన్‌లోని 90 సచివాలయం పరిధిలో స్థానిక కార్పొరేటర్ మెరకనపల్లి మాధురితో కలిసి ఆయన పలువురికి పంపిణీ చేశారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం పేద, మధ్యతరగతి ప్రజలకు వరంలా మారిందన్నారు. అనారోగ్యానికి గురైన ఎంతో మందికి ఈ పథకం పునర్జన్మను ప్రసాదిస్తుందని చెప్పారు. గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసిందని, పలు ప్రొసీజర్(చికిత్స)లను పథకం నుంచి తొలగించిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. గత ప్రభుత్వం 1,032 ప్రొసీజర్స్‌ను ఆరోగ్యశ్రీ చేయగా, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 3,200లకు పైగా చికిత్సలను ఆరోగ్యశ్రీలో చేర్చినట్లు తెలిపారు. అంతేకాకుండా కోవిడ్‌కు సైతం ఆరోగ్యశ్రీ చికిత్స చేయగా, డెంగీ జ్వరాలను సైతం ఆరోగ్యశ్రీలో చేర్చామన్నారు.

ఇప్పుడు రూ.25 లక్షల వరకూ సేవలను విస్తరించి దేశానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఎన్టీఆర్ జిల్లాలో 6.93 లక్షల కుటుంబాలు ఉండగా, వారిలో 5.36 లక్షల కుటుంబాలు ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చాయని తెలిపారు. ఇలా ప్రతి ఒక్కరికీ మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, డివిజన్ పార్టీ అధ్యక్షుడు సంపత్, నాయకులు మెరకనపల్లి కుటుంబరావు, పరసా క్లెవ్, రెంటపల్లి కొండ, అశోక్, చైతన్య, ఆనంద్, రమేష్ పాల్గొన్నారు.

ఇస్త్రీబండి అందజేత



బండిని అందజేస్తున్న యలమంచిలి జయప్రకాష్, నాయకులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ 8వ డివిజన్ ఇన్‌చార్జి, వైఎన్నార్ చారిటీస్ చైర్మన్ యలమంచిలి జయప్రకాష్ రూ.25 వేలు విలువ చేసే ఇస్త్రీ బండిని మంగళవారం అందజేశారు. గాయత్రినగర్‌లోని శ్రావ్య టవర్స్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న పచ్చిపాల రామకృష్ణ, మహాలక్ష్మి దంపతులకు జీవనోపాధి నిమిత్తం బండిని అందించారు. తోటి వారికి సహాయం చేయడంలో తమ పార్టీ ఎల్లప్పుడు ముందుంటుందని జయప్రకాష్ చెప్పారు. పార్టీ డివిజన్ నాయకులు కొల్లి రవి, అజయ్, శివ, నరసింహారావు, బలరాం, నీలం కొండ, శివారెడ్డి, ఝున్సీ, రాణి పాల్గొన్నారు.





ఉత్సాహంగా బాలోత్సవం

నగరంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో 6వ అమరావతి బాలోత్సవం మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాలకు చెందిన చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





పూర్వ విద్యార్థుల తోడ్పాటు హర్షణీయం



గుణదల(విజయవాడతూర్పు): పేద విద్యార్థులకు కార్పొరేట్ తరహా విద్యనందించే దిశగా లయోల కళాశాల పూర్వ విద్యార్థులు తోడ్పాటు హర్షణీయమని ఆ కళాశాల రెక్టర్ ఫాదర్ బాలశౌరి అన్నారు. ఆంధ్ర లయోల కళాశాల ఆవరణలో గల అల్కా స్కూల్‌లో ఆడియో విజువల్ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమం మంగళవారం జరిగింది. కళాశాల పూర్వ విద్యార్థుల సహకారంతో అల్కా పాఠశాల ఏర్పాటు చేశామన్నారు. పూర్వ విద్యార్థి 1974–1977 బ్యాచ్ కు చెందిన పెన్మెత్స ఆనంద్ రాజు రూ. లక్షా యాభైవేలు ఆర్థిక సహాయం అందించారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 250 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. అనంతరం పెన్మెత్స ఆనంద్ రాజు స్విచ్ ఆన్ చేసి ప్రాజెక్టర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో అల్కా స్కూల్ ప్రెసిడెంట్ పెన్మెత్స నాగరాజు, సెక్రటరీ విజయ్‌కుమార్, ఫాదర్ మెల్కియోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

“నిజంగానే షాక్‌కు గురయ్యాను. ఇంత మొత్తాన్ని అసలు ఊహించలేదు. ఎనిమిదేళ్ల తర్వాత ప్రపంచంలోని అత్యుత్తమ టి20 లీగ్‌లో మళ్లీ ఆడేందుకు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా. ఇప్పుడు విలువ పెరిగినా నా ఆటతీరు ఎప్పుడూ మారలేదు. భారీ మొత్తం కాబట్టి ఒత్తిడి సహజమే అయినా... నాకున్న అనుభవంతో మంచి ఫలితాలు సాధిస్తాననే నమ్మకం ఉంది. -మిచెల్ స్టార్క్

సన్‌రైజర్స్‌తో జత కట్టేందుకు అమితోత్సాహంతో ఉన్నా. ఆరెంజ్ ఆర్మీ గురించి చాలా విన్నా. హైదరాబాద్‌లో కూడా మ్యాచ్‌లు ఆడా. నాకు బాగా నచ్చింది. నాతో పాటు హెడ్ కూడా ఉన్నాడు. విజయాలతో సీజన్ సాగాలని ఆశిస్తున్నా. -ప్యాట్ కమిన్స్

మిచెల్ స్టార్క్ రెండు సార్లు మాత్రమే ఐపీఎల్‌లో (2014-15) అదీ బెంగళూరు జట్టు తరఫునే ఆడాడు. 27 మ్యాచ్‌లలో 7.16 ఎకానమీతో 34 వికెట్లు పడగొట్టాడు. ఆ తర్వాత వేర్వేరు కారణాలతో అతను ఎనిమిది సీజన్ల పాటు లీగ్‌కు దూరంగా ఉన్నాడు. 2018లో కోల్‌కతా అతడిని ఎంచుకున్నా... గాయంతో టోర్నీకి ముందే తప్పుకున్నాడు.

ప్యాట్ కమిన్స్ ఢిల్లీ తరఫున 12 మ్యాచ్‌లు, కోల్‌కతా తరఫున 30 మ్యాచ్‌లు ఆడి మొత్తం 45 వికెట్లు పడగొట్టాడు. 2020 వేలంలో కేకేఆర్ అతనికి రూ. 15.50 కోట్లు ఇచ్చింది. అంత ర్జాతీయ షెడ్యూల్ కారణంగా 2023 సీజన్‌లో కమిన్స్ ఆడలేదు. వరల్డ్ కప్‌లో జట్టును విజేతగా నిలిపి అతను మళ్లీ ఇక్కడ అడుగు పెట్టాడు.

నీకు రూ. 20.50 కోట్లు... నాకు రూ. 24.75 కోట్లు

వేలంలో టాప్-10 వీరే...

1. స్టార్క్ (కోల్‌కతా) రూ. 24.75 కోట్లు
2. కమిన్స్ (హైదరాబాద్) రూ. 20.50 కోట్లు
3. మిచెల్ (చెన్నై) రూ. 14 కోట్లు
4. హర్షల్ పటేల్ (పంజాబ్) రూ. 11.75 కోట్లు
5. జోసెఫ్ (బెంగళూరు) రూ. 11.50 కోట్లు
6. స్పెన్సర్ జాన్సన్ (గుజరాత్) రూ. 10 కోట్లు
7. సమీర్ రిజ్వీ (చెన్నై) రూ. 8.40 కోట్లు
8. రిలీ రోసో (పంజాబ్) రూ. 8 కోట్లు
9. షారుఖ్ (గుజరాత్) రూ. 7.40 కోట్లు
10. పావెల్ (రాజస్తాన్) రూ. 7.40 కోట్లు

- ఐపీఎల్ వేలంలో స్టార్క్, కమిన్స్ కొత్త రికార్డులు నమోదు
- కోల్‌కతా చెంతకు స్టార్క్... హైదరాబాద్‌కు కమిన్స్
- ఆరుగురికి రూ.10 కోట్లకంటే ఎక్కువ మొత్తం
- భారీ మొత్తంతో యువ ఆటగాళ్లు సమీర్ రిజ్వీ, కుమార్ కుశాగ్ర సంచలనం



ఐపీఎల్ వేలం షురూ... ముందుగా బ్యాటర్ల జాబితా... అది ముగిసిన తర్వాత రెండో సెట్ క్యాప్డ్ బౌలర్ల జాబితా ముందుకు వచ్చింది... నాలుగో ఆటగాడిగా ప్యాట్ కమిన్స్ పేరు వినిపించింది... రూ.2 కోట్ల కనీస విలువతో వేలం మొదలైంది... చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ ముందుగా పోటీ పడగా, ఆపై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) వచ్చి చేరింది. రూ.7.80 కోట్ల వద్ద సన్‌రైజర్స్ బరిలోకి దిగింది.. ఆపై మిగతా జట్లు తప్పుకోగా... రైజర్స్, ఆర్‌సీబీ మాత్రమే వేలం మొత్తాన్ని పెంచుకుంటూ వెళ్లాయి... రూ.20.25 కోట్ల వద్ద రెండు టీమ్‌లు ఆగాయి... దానికి మరో రూ.25 లక్షలు సన్‌రైజర్స్ జోడించాక బెంగళూరు స్పందించలేదు. రూ.20.50 కోట్లతో కమిన్స్ హైదరాబాద్ చెంత చేరడంతో ఐపీఎల్‌లో కొత్త రికార్డు నమోదైంది.

కానీ సినిమా అంతటితో ముగిసిపోలేదు... గంట సేపటి తర్వాత మిచెల్ స్టార్క్ పేరు వేలంలోకి వచ్చింది... ముందుగా ఢిల్లీ క్యాపిటల్స్ మొదలు పెట్టింది. ఆపై ముంబై, కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) సీన్‌లోకి వచ్చేశాయి. కోల్‌కతా, గుజరాత్ టైటాన్స్ పోటీ పడి స్టార్క్ విలువను రూ.20 కోట్లు దాటించేశాయి... అయినా ఇరు జట్లు వెనక్కి తగ్గలేదు. ఆసీస్ పేసర్ కోసం పోటీని కొనసాగించాయి... మరింత వేగంగా ఈ మొత్తం రూ.24.50 కోట్లకు చేరింది... ఈ దశలో కోల్‌కతా మరో అడుగు ముందుకేసింది... గుజరాత్ ఇక చాలనుకుకోవడంతో రూ.24.75 కోట్లతో స్టార్క్ తన సహచరుడు కమిన్స్ రికార్డును కొద్ది సేపటికే బద్దలు కొట్టేశాడు. ఇద్దరు స్టార్ ఆసీస్ పేసర్లు కలిసి ఐపీఎల్ ద్వారా రూ. 45.25 కోట్లతో పండగ చేసుకున్నారు!


ఐపీఎల్ వేలం ఎప్పటిలాగే అంచనాలకు భిన్నంగా ఊహించని రీతిలో సాగింది. పేరుకే మినీ వేలం అయినా ఆటగాళ్లకు లభించిన మొత్తాలు మెగా వేలంలా అనిపించాయి. పెద్దగా గుర్తింపు లేని, టి20 ఫార్మాట్‌లో అంతగా అద్భుతాలు చూపించని ఆటగాళ్లపై కూడా కాసుల వాన కురవగా, ఇప్పటికే తమ ఆటతో సత్తా నిరూపించుకున్న కొందరికి ఆశ్చర్యకరంగా తక్కువ విలువే దక్కింది. వన్డే వరల్డ్ కప్ ఫైనల్ ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ ట్రవిస్ హెడ్, న్యూజిలాండ్ ప్లేయర్ డరైల్ మిచెల్, విండీస్ పేసర్ అల్జారీ జోసెఫ్, హరియాణా బౌలర్ హర్షల్ పటేల్ భారీ సొమ్మును తమ ఖాతాలో వేసుకోగా... అన్‌క్యాప్డ్ భారత ఆటగాడు సమీర్ రిజ్వీ (ఉత్తరప్రదేశ్), కుమార్ కుశాగ్ర (జార్ఖండ్) భారీ విలువ పలికి సంచలనం సృష్టించడం వేలంలో హైలైట్.

72 మంది ఆటగాళ్లతో...



దుబాయ్: ఐపీఎల్–2024 కోసం మంగళవారం జరిగిన వేలం ముగిసింది. మొత్తం 332 మంది ఆటగాళ్లు వేలంలో అందుబాటులోకి రాగా... 10 ఫ్రాంచైజీలు కలిసి 72 మందిని ఎంచుకున్నాయి. ఇందులో 30 మంది విదేశీ క్రికెటర్లు ఉన్నారు. వేలంలో గరిష్టంగా 77 మందిని తీసుకునే అవకాశం ఉన్నా... కోల్‌కతాలో 2 ఖాళీలు, రాజస్తాన్‌లో 3 ఖాళీలు ఉండిపోయాయి. తొలిసారి విదేశీ గడ్డపై జరిగిన ఐపీఎల్ వేలంను మొదటిసారి ఓ మహిళ (మల్లిక సాగర్) నిర్వహించడం విశేషం. మధ్యాహ్నం 1 గంటకు మొదలైన వేలం స్వల్ప విరామాలతో రాత్రి 9 గంటల వరకు సాగింది. ఈ వేలం కోసం అన్ని ఫ్రాంచైజీలు కలిపి రూ.230 కోట్ల 45 లక్షలు వెచ్చించాయి. ఆసీస్ పేస్ బౌలర్ మిచెల్ స్టార్క్ రూ. 24.75 కోట్లతో కొత్త రికార్డు నెలకొల్పగా... 24 మంది క్రికెటర్లను కనీస విలువ రూ.20 లక్షలతో జట్లు సొంతం చేసుకున్నాయి. వచ్చే సీజన్ ఐపీఎల్ మార్చి 22 నుంచి మే 26 జరిగే అవకాశం ఉంది.

ఐపీఎల్ వేలం విశేషాలు...



- విండీస్ ప్లేయర్ రావ్‌మన్ పావెల్ కోసం రాజస్తాన్ భారీ మొత్తం (రూ.7.40 కోట్లు) వెచ్చించింది. గతంలో ఢిల్లీ తరఫున ఏమాత్రం ప్రభావం చూపలేకపోయినా... కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లో తమ జట్టు బార్బడోస్ రాయల్స్‌కు అతను కెప్టెన్ కావడమే ప్రధాన కారణం.
- హ్యారీ బ్రూక్‌ను చాలా తక్కువ మొత్తం (రూ.4 కోట్లు)కే ఢిల్లీ సొంతం చేసుకుంది. గత ఏడాది సన్‌రైజర్స్ బ్రూక్‌కు రూ. 13.25 కోట్లు ఇచ్చింది.
- బెంగళూరు తరఫున 3 సీజన్లలో ఆకట్టుకున్న లెగ్‌స్పిన్నర్ హసరంగను సన్‌రైజర్స్ చాలా తక్కువ మొత్తానికి (రూ. 1.50 కోట్లు) సొంతం చేసుకుంది.
- వన్డే వరల్డ్‌కప్‌లో చక్కటి ప్రదర్శన కనబర్చినా న్యూజిలాండ్ ఆటగాడు రచిన్ రవీంద్రకు తక్కువ మొత్తమే (రూ.1.80కోట్లు) దక్కింది. అతని సహచరుడు డరైల్ మిచెల్ కోసం మాత్రం చెన్నై చాలా మొత్తం (రూ.14 కోట్లు) ఖర్చు చేసింది.
- ఫామ్ కోల్పోయి భారత జట్టులో స్థానం చేజార్చుకోవడంతో పాటు ఐపీఎల్‌లోనూ భారీగా పరుగులిస్తూ వచ్చిన హర్షల్ పటేల్ కోసం పంజాబ్ కింగ్స్ ఏకంగా రూ.11.75 కోట్లు వెచ్చించింది.
- విండీస్ పేసర్ అల్జారీ జోసెఫ్ కోసం బెంగళూరు అనూహ్యంగా చాలా పెద్ద మొత్తం (రూ.11.50 కోట్లు) చెల్లించింది.
- ఒకే ఒక అంతర్జాతీయ వన్డే, 2 టి20లు ఆడిన ఆస్ట్రేలియా పేసర్ స్పెన్సర్ జాన్సన్‌కు రూ. 10 కోట్లు దక్కడం అనూహ్యం.
- వేలంలో ముందుగా పేరు వచ్చినప్పుడు రిలీ రోసో (దక్షిణాఫ్రికా)ను ఎవరూ పట్టించుకోలేదు కానీ చివర్లో పంజాబ్ కింగ్స్ రూ. 8 కోట్లకు అతడిని కొనుగోలు చేయడం విశేషం.

ఎవరెవరు ఏ జట్టులో...



కోల్‌కతా నైట్‌రైడర్స్ (10)

మిచెల్ స్టార్క్ (రూ. 24 కోట్ల 50 లక్షలు; ఆస్ట్రేలియా), ముజీబ్ రెహ్మాన్ (రూ. 2 కోట్లు; అఫ్గానిస్తాన్), షెర్ఫాన్ రూథర్‌ఫర్డ్ (రూ. కోటీ 50 లక్షలు; వెస్టిండీస్), అట్కిన్సన్ (రూ. 1 కోటీ; ఇంగ్లండ్), మనీశ్ పాండే (రూ. 50 లక్షలు; భారత్), కేఎస్ భరత్ (రూ. 50 లక్షలు; భారత్), చేతన్ సకారియా (రూ. 50 లక్షలు; భారత్), అంగ్‌క్రిష్ రఘువంశీ (రూ. 20 లక్షలు; భారత్), రమణ్‌దీప్ సింగ్ (రూ. 20 లక్షలు, భారత్), సకీబ్ హుస్సేన్ (రూ. 20 లక్షలు; భారత్).

ఢిల్లీ క్యాపిటల్స్ (9)

కుమార్ కుశాగ్ర (రూ. 7 కోట్ల 20 లక్షలు; భారత్), జై రిచర్డ్‌సన్ (రూ. 5 కోట్లు; ఆస్ట్రేలియా), హ్యారీ బ్రూక్ (రూ. 4 కోట్లు; ఇంగ్లండ్), సుమిత్ కుమార్ (రూ. 1 కోటీ; భారత్), షై హోప్ (రూ. 75 లక్షలు; వెస్టిండీస్), ట్రిస్టన్ స్టబ్స్ (రూ. 50 లక్షలు; దక్షిణాఫ్రికా), రికీ భుయ్ (రూ. 20 లక్షలు; భారత్), స్వస్తిక్ చికారా (రూ. 20 లక్షలు; భారత్), రసిక్ ధార్ (రూ. 20 లక్షలు; భారత్).

గుజరాత్ టైటాన్స్ (8)

స్పెన్సర్ జాన్సన్ (రూ. 10 కోట్లు; ఆస్ట్రేలియా), షారుఖ్ ఖాన్ (రూ. 7 కోట్ల 40 లక్షలు; భారత్), ఉమేశ్ యాదవ్ (రూ. 5 కోట్ల 80 లక్షలు; భారత్), రాబిన్ మింజ్ (రూ. 3 కోట్ల 60 లక్షలు; భారత్), సుశాంత్ మిశ్రా (రూ. 2 కోట్ల 20 లక్షలు; భారత్), కార్తీక్ త్యాగి (రూ. 60 లక్షలు; భారత్), అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (రూ. 50 లక్షలు; అఫ్గానిస్తాన్), మానవ్ సుథర్ (రూ. 20 లక్షలు; భారత్).

ముంబై ఇండియన్స్ (8)

గెరాల్డ్ కొయెట్జీ (రూ. 5 కోట్లు; దక్షిణాఫ్రికా), నువాన్ తుషారా (రూ. 4 కోట్ల 80 లక్షలు; శ్రీలంక), దిల్షాన్ మదుషంక (రూ. 4 కోట్ల 60 లక్షలు; శ్రీలంక), మొహమ్మద్ నబీ (రూ. 1 కోటీ 50 లక్షలు; అఫ్గానిస్తాన్), శ్రేయస్ గోపాల్ (రూ. 20 లక్షలు; భారత్), శివాలిక్ శర్మ (రూ. 20 లక్షలు; భారత్), అన్షుల్ కంబోజ్ (రూ. 20 లక్షలు; భారత్), నమన్ ధీర్ (రూ. 20 లక్షలు; భారత్).

పంజాబ్ కింగ్స్ (8)

హర్షల్ పటేల్ (రూ. 11 కోట్ల 75 లక్షలు; భారత్), రిలీ రోసో (రూ. 8 కోట్లు; దక్షిణాఫ్రికా), క్రిస్ వోక్స్ (రూ. 4 కోట్ల 20 లక్షలు; ఇంగ్లండ్), తనయ్ త్యాగరాజన్ (రూ. 20 లక్షలు; భారత్), విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ (రూ. 20 లక్షలు; భారత్), అశుతోష్ శర్మ (రూ. 20 లక్షలు; భారత్), శశాంక్ సింగ్ (రూ. 20 లక్షలు; భారత్), ప్రిన్స్ చౌధరీ (రూ. 20 లక్షలు; భారత్).

సన్‌రైజర్స్ హైదరాబాద్ (6)

ప్యాట్ కమిన్స్ (రూ. 20 కోట్ల 50 లక్షలు; ఆస్ట్రేలియా), ట్రవిస్ హెడ్ (రూ. 6 కోట్ల 80 లక్షలు; ఆస్ట్రేలియా), జైదేవ్ ఉనాద్కట్ (రూ. 1 కోటీ 60 లక్షలు; భారత్), హసరంగ (రూ. 1 కోటీ 50 లక్షలు; శ్రీలంక), జథవేద్ సుబ్రమణ్యన్ (రూ. 20 లక్షలు; భారత్), ఆకాశ్ సింగ్ (రూ. 20 లక్షలు; భారత్).

లక్నో సూపర్ జెయింట్స్ (6)

శివమ్ మావి (రూ. 6 కోట్ల 40 లక్షలు; భారత్), సిద్ధార్థ్ (రూ. 2 కోట్ల 40 లక్షలు; భారత్), డేవిడ్ విల్లీ (రూ. 2 కోట్లు; ఇంగ్లండ్), ఆష్టన్ టర్నర్ (రూ. 1 కోటీ; ఆస్ట్రేలియా), అర్షిన్ కులకర్ణి (రూ. 20 లక్షలు; భారత్), అర్షద్ ఖాన్ (రూ. 20 లక్షలు; భారత్).

చెన్నై సూపర్ కింగ్స్ (6)

డరైల్ మిచెల్ (రూ. 14 కోట్లు; న్యూజిలాండ్), సమీర్ రిజ్వీ (రూ. 8 కోట్ల 40 లక్షలు; భారత్), శార్దుల్ ఠాకూర్ (రూ. 4 కోట్లు; భారత్), ముస్తఫిజుర్ రెహ్మాన్ (రూ. 2 కోట్లు; బంగ్లాదేశ్), రచిన్ రవీంద్ర (రూ. 1 కోటీ 80 లక్షలు; న్యూజిలాండ్), అవినాశ్ రావు (రూ. 20 లక్షలు; భారత్).

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (6)

అల్జారీ జోసెఫ్ (రూ. 11 కోట్ల 50 లక్షలు; వెస్టిండీస్), యశ్ దయాళ్ (రూ. 5 కోట్లు; భారత్), ఫెర్గూసన్ (రూ. 2 కోట్లు; న్యూజిలాండ్), టామ్ కరన్ (రూ. 1 కోటీ 50 లక్షలు; ఇంగ్లండ్), సౌరవ్ చౌహాన్ (రూ. 20 లక్షలు; భారత్), స్వప్నిల్ సింగ్ (రూ. 20 లక్షలు; భారత్).

రాజస్తాన్ రాయల్స్ (5)

రోవ్‌మన్ పావెల్ (రూ. 7 కోట్ల 40 లక్షలు; వెస్టిండీస్), శుభమ్ దూబే (రూ. 5 కోట్ల 80 లక్షలు; భారత్), నాండ్రె బర్గర్ (రూ. 50 లక్షలు; దక్షిణాఫ్రికా), టామ్ కోలెర్ కాడ్మోర్ (రూ. 40 లక్షలు; ఇంగ్లండ్), ఆబిద్ ముస్తాక్ (రూ. 20 లక్షలు; భారత్).



ఉత్తరప్రదేశ్‌కు చెందిన సమీర్ రిజ్వీ దూకుడైన బ్యాటింగ్‌తో యూపీ టి20 లీగ్‌లో సత్తా చాటాడు. ఈ టోర్నీలో కాన్పూర్ సూపర్‌స్టార్స్ తరఫున 9 ఇన్నింగ్స్‌లలోనే 455 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు ఉన్నాయి. దాంతో మూడు ఐపీఎల్ టీమ్‌లు ట్రయల్స్‌కు పిలిచాయి. యూపీ టీమ్ అండర్-23 టైటిల్ గెలుచుకోవడంలో అతనిదే కీలక పాత్ర. అండర్-16 విజయ్ మర్చంట్ ట్రోఫీ మ్యాచ్‌లో ఒకే రోజు 280 పరుగులు చేసి రికార్డు రిజ్వీకి ఉంది.



జార్ఖండ్ వికెట్ కీపర్ అయిన కుమార్ కుశాగ్ర కూడా ధాటిగా ఆడగల సమర్థుడు. విజయ్ హజారే టోర్నీలో మహారాష్ట్రపై 355 పరుగుల ఛేదనలో 37 బంతుల్లో 67 పరుగులు చేసి జట్టును గెలిపించడం అతడిని హైలైట్ చేసింది.

మనోళ్లు నలుగురు...

తాజా వేలంలో ఆంధ్ర ఆటగాళ్లు కేఎస్ భరత్ (రూ. 50 లక్షలు; కోల్‌కతా), రికీ భుయ్ (రూ. 20 లక్షలు; ఢిల్లీ), హైదరాబాద్ క్రికెటర్లు అరవెల్లి అవినాశ్ రావు (రూ. 20 లక్షలు; చెన్నై), తనయ్ త్యాగరాజన్ (పంజాబ్ కింగ్స్)లను ఆయా జట్లు ఎంచుకున్నాయి.


స్మిత్‌కు మళ్లీ నిరాశే...



టెస్టుల్లో దిగ్గజంగా, వన్డేల్లోనూ మంచి బ్యాటర్‌గా గుర్తింపు ఉన్న ఆస్ట్రేలియా స్టార్ స్టీవ్ స్మిత్‌ను టి20లకు తగడని ఐపీఎల్ ఫ్రాంచైజీలు భావిస్తున్నాయి. అందుకే గత ఏడాదిలాగే ఈసారి కూడా కనీస విలువ రూ.2 కోట్లకు కూడా ఎవరూ తీసుకోలేదు. వరల్డ్ కప్ విన్నింగ్ టీమ్‌లో ఉన్న ఆసీస్ బౌలర్ హాజల్‌వుడ్‌నూ ఎవరు ఎంచుకోలేదు. వేలంలో అమ్ముడుపోని ఇతర గుర్తింపు పొందిన ఆటగాళ్లలో జేసన్ హోల్డర్ (వెస్టిండీస్), జిమ్మీ నీషమ్ (న్యూజిలాండ్), క్రిస్ జోర్డాన్ (ఇంగ్లండ్), టిమ్ సౌతీ (న్యూజిలాండ్), స్యామ్ బిల్లింగ్స్ (ఆస్ట్రేలియా), మిల్నే (న్యూజిలాండ్), తబ్రేజ్ షమ్సీ (దక్షిణాఫ్రికా), హనుమ విహారి, సర్ఫరాజ్ ఖాన్ (భారత్) తదితరులు ఉన్నారు.

భారత్‌కు చుక్కెదురు

- రెండో వన్డేలో టీమిండియా ఓటమి
- 8 వికెట్లతో దక్షిణాఫ్రికా జయభేరి
- జోర్జి సెంచరీ, రాణించిన హెన్‌డ్రిక్స్
- రేపు ఆఖరి వన్డే


జోర్జి

పోర్ట్ ఎలిజబెత్: వరుసగా రెండో వన్డే గెలిచి సిరీస్‌నూ కై వసం చేసుకోవాలనుకున్న భారత్ ఆశలు మూకుమ్మడి వైఫల్యంతో ఆవిరయ్యాయి. నిలకడలేని బ్యాటింగ్, పసలేని బౌలింగ్, నిలువెత్తు నిర్లక్ష్యం భారత్ కొంపముంచాయి. ఇదే అదనుగా దక్షిణాఫ్రికా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో భారత్‌ను దెబ్బ కొట్టింది. దీంతో మంగళవారం జరిగిన రెండో వన్డేలో టీమిండియా 8 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా చేతిలో పరాజయం చవిచూసింది. ఆతిథ్య జట్టు సిరీస్‌ను 1–1తో సమం చేసింది. చివరిదైన మూడో వన్డే రేపు పార్ల్‌లో జరుగుతుంది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా 46.2 ఓవర్లలో 211 పరుగులకే ఆలౌటైంది. టాపార్డర్‌లో సాయి సుదర్శన్ (83 బంతుల్లో 62; 7 ఫోర్లు, 1 సిక్స్), మిడిలార్డర్‌లో కేఎల్ రాహుల్ (64 బంతుల్లో 56; 7 ఫోర్లు)... ఈ ఇద్దరు తప్ప ఇంకెవరూ కనీసం 20 పరుగులైన చేయలేకపోయారు. సఫారీ బౌలర్లు బర్గర్ (3/30), బ్యురన్ హెన్‌డ్రిక్స్ (2/34), కేశవ్ మహరాజ్ (2/51) సమష్టిగా దెబ్బతీశారు. క్రమం తప్పకుండా వికెట్లు పడగొట్టడంతో భారత్ నిర్ణీత 50 ఓవర్లను పూర్తిగా ఆడలేకపోయింది. అనంతరం సులువైన లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 42.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 215 పరుగులు చేసి ఛేదించింది. ఓపెనర్లు ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ టోని డి జోర్జి (122 బంతుల్లో 119 నాటౌట్; 9 ఫోర్లు, 6 సిక్స్‌లు) అజేయ సెంచరీతో కదంతొక్కగా, రీజా హెన్‌డ్రిక్స్ (81 బంతుల్లో 52; 7 ఫోర్లు) అర్ధసెంచరీ సాధించాడు. ఇద్దరు తొలి వికెట్‌కు 130 పరుగులు చేయడంతోనే భారత్ పరాజయం ఖాయమైంది. వాన్ డర్ డసెన్ (36; 5 ఫోర్లు) మెరుగ్గా ఆడాడు. ఈ మ్యాచ్‌తో రింకూ సింగ్ వన్డేల్లో అరంగేట్రం చేశాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రుతురాజ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) బర్గర్ 4; సాయి సుదర్శన్ (సి) క్లాసెన్ (బి) విలియమ్స్ 62; తిలక్‌వర్మ (సి) బ్యురన్ హెన్‌డ్రిక్స్ (బి) బర్గర్ 10; రాహుల్ (సి) మిల్లర్ (బి) బర్గర్ 56; సామ్సన్ (బి) బ్యురన్ హెన్‌డ్రిక్స్ 12; రింకూ సింగ్ (స్టంప్డ్) క్లాసెన్ (బి) కేశవ్ 17; అక్షర్ (సి) సబ్-వెరెన్ (బి) మార్క్‌రమ్ 7; కుల్దీప్ (సి) బ్యురన్ హెన్‌డ్రిక్స్ (బి) కేశవ్ 1; అర్‌్షదీప్ (సి) మిల్లర్ (బి) బ్యురన్ హెన్‌డ్రిక్స్ 18; అవేశ్ (రనౌట్) 9; ముకేశ్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం** (46.2 ఓవర్లలో ఆలౌట్) 211. **వికెట్ల పతనం:** 1-4, 2-46, 3-114, 4-136, 5-167, 6-169, 7-172, 8-186, 9-204, 10-211. **బౌలింగ్:** బర్గర్ 10-0-30-3, విలియమ్స్ 9-1-49-1, బ్యురన్ హెన్‌డ్రిక్స్ 9.2-1-34-2, ముల్డర్ 4-0-19-0, కేశవ్ 10-0-51-2, మార్క్‌రమ్ 4-0-28-1.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: రీజా హెన్‌డ్రిక్స్ (సి) ముకేశ్ (బి) అర్‌్షదీప్ 52; టోని (నాటౌట్) 119; డసెన్ (సి) సామ్సన్ (బి) రింకూ 36; మార్క్‌రమ్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం** (42.3 ఓవర్లలో 2 వికెట్లకు) 215. **వికెట్ల పతనం:** 1-130, 2-206. **బౌలింగ్:** ముకేశ్ 8-2-46-0, అర్‌్షదీప్ 8-0-28-1, అవేశ్ 8-0-43-0, అక్షర్ 6-0-22-0, కుల్దీప్ 8-0-48-0, తిలక్ వర్మ 3-0-18-0, రింకూ సింగ్ 1-0-2-1, సాయి సుదర్శన్ 0.3-0-8-0.

హార్దిక్, సవితలకు ఎఫ్‌ఐహెచ్ అవార్డులు





లుసానే (స్విట్జర్లాండ్): భారత హాకీ ప్లేయర్లు హార్దిక్ సింగ్, సవిత పూనియాలు అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్) వార్షిక అవార్డులను గెలుచుకున్నారు. భారత మహిళల కెప్టెన్ అయిన సవిత ‘ఎఫ్‌ఐహెచ్ గోల్‌కీపర్ ఆఫ్ ద ఇయర్’ అవార్డుతో హ్యాట్రిక్ కొట్టింది. సవిత 2021, 2022లలో కూడా ఈ అవార్డును అందుకుంది. ఆస్ట్రేలియా పర్యటనలో టెస్టు మ్యాచ్‌లు, హాంగ్జౌ ఆసియా క్రీడల్లో 33 ఏళ్ల సవిత చక్కని ప్రదర్శన కనబరిచింది. అక్టోబర్‌లో సొంతగడ్డపై జరిగిన ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో భారత్‌ను విజేతగా నిలుపడంలో కీలకపాత్ర పోషించింది. జనవరిలో రాంచీలో జరిగే ఎఫ్‌ఐహెచ్ ఒలింపిక్ క్వాలిఫయర్‌లో జట్టుకు పారిస్ బెర్తే లక్ష్యంగా సవిత జట్టును నడిపించనుంది. భారత పురుషుల జట్టులో స్టార్ మిడ్‌ఫీల్డర్‌గా ఎదిగిన హార్దిక్ సింగ్ పోరాటపటిమను ఎఫ్‌ఐహెచ్ గుర్తించింది. అతను ‘ఎఫ్‌ఐహెచ్ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్’ అవార్డుకు ఎంపికయ్యాడు. ఈ ఏడాది అతనికి లభించిన రెండో అవార్డు ఇది! హాకీ ఇండియా (హెచ్‌ఐ) నుంచి ‘బల్బీర్ సింగ్ సీనియర్ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్’ కూడా అందుకున్నాడు.

హరియాణా స్టీలర్స్ గెలుపు

పుణే: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో హరియాణా స్టీలర్స్ నాలుగో విజయం నమోదు చేసింది. గుజరాత్ జెయింట్స్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 31–29 పాయింట్లతో గెలిచింది. హరియాణా తరఫున వినయ్ 9 పాయింట్లు, ప్రపంజన్ 6 పాయింట్లు, మోహిత్ 5 పాయింట్లు స్కోరు చేశారు. గుజరాత్ తరఫున రోహిత్ గులియా 7 పాయింట్లు, ఫజల్, సోనూ జగ్లాన్ 4 పాయింట్లు చొప్పున స్కోరు చేశారు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో జైపూర్ పింక్ పాంథర్స్‌తో యూపీ యోధాస్; పుణేరి పల్టన్‌తో బెంగళూరు బుల్స్ తలపడతాయి. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో పుణేరి పల్టన్, బెంగాల్ వారియర్స్ 21 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాయి.

క్లుప్తంగా...

వైభవంగా గ్రాండ్ సెమీ క్రిస్మస్

సాక్షి, అమరావతి: తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్ద మంగళవారం గ్రాండ్ సెమీ క్రిస్మస్ ఆరాధన వైభవంగా జరిగింది. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పేదలకు దుస్తుల పంపిణీ, అన్నదానం కార్యక్రమాలు జరిపారు. ఈ సందర్భంగా శాసనమండలిలో ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ.. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అందరి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. చంద్రబాబు లాంటి వ్యక్తి మళ్లీ వస్తే ప్రజల జీవితాలను వెక్కిరిస్తారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఏఐసీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు జాన్ బెన్నిలింగం, బిషప్ థామస్ పాల్గొన్నారు.

రేపు గ్రామ/వార్డు సచివాలయాల దినోత్సవం

సాక్షి, అమరావతి: గ్రామ/వార్డు సచివాలయాల వ్యవస్థకు రూపకల్పన చేసిన సీఎం జగన్ పుట్టిన రోజైన డిసెంబర్ 21 నాడు గ్రామ/వార్డు సచివాలయాల దినోత్సవంగా జరుపుకుంటామని గ్రామ/వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ప్రకటించింది. గ్రామ/వార్డు సచివాలయాల వ్యవస్థ ఏర్పాటుతో ప్రభుత్వ పాలనను ప్రజలకు మరింత దగ్గర చేయడమే కాకుండా, ఒకేసారి లక్షల మందికి శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగ యువత జీవితాల్లో సీఎం జగన్ వెలుగులు నింపారని కమిటీ పేర్కొంది. ఈ మేరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మరావు, అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ బీఆర్‌ఆర్ కిషోర్, వర్కింగ్ ప్రెసిడెంట్స్ విప్పర్తి నిఖిల్ కృష్ణ, భార్గవ్ సుతేజ్, సుధాకర్, వైస్ ప్రెసిడెంట్స్ రామకృష్ణ, పిల్లి హరీష్ రెడ్డి, ట్రెజరర్ మధుబాబు, జాయింట్ సెక్రటరీస్ భవనం వెంకటరామిరెడ్డి రెడ్డి, రవికుమార్ మంగళవారం ప్రకటన విడుదల చేశారు. 21న ప్రతి గ్రామ/వార్డు సచివాలయాల్లో సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, కేక్ కట్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు, అనాథ శరణాలయాల్లో పండ్లు, బ్రెడ్లు పంపిణీతో పాటు వృద్ధాశ్రమాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సీఎస్‌ను కలిసిన ఏపీ ఎన్జీవో నాయకులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డిని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నాయకులు మంగళవారం కలిశారు. అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బండి శ్రీనివాసరావు, శివారెడ్డి నేతృత్వంలో పలువురు నేతలు ప్రతినిధి బృందంగా వెళ్లి ఉద్యోగుల అంశాలకు సంబంధించి ఆయనకు వినతిపత్రం ఇచ్చారు. 12వ పీఆర్సీ వచ్చేలోపు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు 30 శాతం మధ్యంతర భృతిని పెంచాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను చెల్లించాలని కోరారు. 11వ పీఆర్సీ, డీఏ బకాయిలను ఇచ్చిన హామీ మేరకు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్‌గా మల్లిఖార్జునరెడ్డి కొనసాగింపు



సాక్షి,అమరావతి/హనుమాన్‌జంక్షన్ రూరల్: ఏపీఎస్‌ఆర్టీసీ బోర్డు చైర్మన్‌గా ఎ.మల్లిఖార్జునరెడ్డిని కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. వైస్ చైర్మన్‌గా మెట్టపల్లి చిన్నప్పతోపాటు మరో 15 మంది డైరెక్టర్లను నియమించింది. కొన్ని మార్పులతో బోర్డు ఏర్పాటు చేసినట్టు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది.అలాగే, ఏపీ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా విజయవాడ హనుమాన్‌జంక్షన్‌కు చెందిన కనుమూరి సుబ్బరాజు పదవీకాలాన్ని కూడా ప్రభుత్వం పొడిగించింది. కాగా, గిరిజన సహకార సంస్థ (జీసీసీ) చైర్‌పర్సన్‌గా పదవీకాలాన్ని పొడిగించిన సీఎం జగన్‌కు శోభా స్వాతిరాణి మంగళవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీలో జీఎస్‌ఐ క్యాంపు కార్యాలయం ప్రారంభం

ఏపీఎండీసీ ప్రాంగణంలో ఏర్పాటు

సాక్షి, అమరావతి: రాష్ట్ర విభజన తర్వాత ఇన్నాళ్లకు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్‌ఐ) ఆంధ్రప్రదేశ్‌లో మొదటి క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. విజయవాడ సమీపంలోని కానూరు వంద అడుగుల రోడ్డులో ఉన్న ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎండీసీ) ఆఫీస్ ప్రాంగణంలో జీఎస్‌ఐ క్యాంపు కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేశారు. జీఎస్‌ఐ దక్షిణ ప్రాంత అదనపు డైరెక్టర్ జనరల్, విభాగాధిపతి సీహెచ్ వెంకటేశ్వరరావు మంగళవారం ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఖనిజాల అన్వేషణకు సంబంధించిన విషయాల్లో రాష్ట్ర ప్రభుత్వం, జీఎస్‌ఐ మధ్య సమన్వయాన్ని మెరుగుపరిచేందుకు దోహదపడుతుందన్నారు. రాష్ట్ర జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మహాపాత్ర పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నేమాని భాస్కర్

సాక్షి,అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నేమాని భాస్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ సలహాదారుడిగా నేమాని భాస్కర్‌ను నియమించడంపై ఆంధ్రప్రదేశ్ అర్చక సమాఖ్య ప్రతినిధులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

రాష్ట్రం గజగజ

- అన్ని జిల్లాల్లోనూ పెరిగిన చలి తీవ్రత
- సగటున 2 డిగ్రీలు తగ్గిన కనిష్ట ఉష్ణోగ్రతలు
- వణుకుతున్న విశాఖ ఏజెన్సీ ప్రాంతం
- పగటి ఉష్ణోగ్రతలు కూడా తగ్గుదల



సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా చలి పెరుగుతోంది. అన్ని జిల్లాల్లోనూ కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గాయి. దీంతో చలి తీవ్రత పెరిగి ప్రజలు గజగజ వణుకుతున్నారు. సాధారణంగా ప్రతి సంవత్సరం డిసెంబర్ నెలలో ఉత్తరాంధ్రలో కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. ఈసారి ఉత్తరాంధ్రతోపాటు అన్ని జిల్లాల్లోనూ 2 డిగ్రీల మేర కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గాయి. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పలుచోట్ల 9 నుంచి 14 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మంగళవారం అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం కుంతలంలో 9.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. కనిష్ట ఉష్ణోగ్రతలు రోజురోజుకూ ఇంకా తగ్గే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. అరకు ఏజెన్సీలో ఈ నెలాఖరుకు ఉష్ణోగ్రతలు ఇంకా తగ్గుతాయని, జనవరి మొదటి, రెండు వారాల్లో 4 డిగ్రీల వరకు కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉందంటున్నారు. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లోనూ కనిష్ట ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల వరకు తగ్గుతాయని, దీని వల్ల చలి తీవ్రత ఇంకా పెరిగే పరిస్థితి ఉందని చెబుతున్నారు.

పగటి ఉష్ణోగ్రతలు సైతం తక్కువగానే...

రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు కూడా చాలా వరకు తగ్గాయి. సాధారణంగా ఈ సమయంలో 26 నుంచి 28 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు ఉండాలి. ఇప్పుడు 2 నుంచి 4 డిగ్రీల వరకు తగ్గాయి. ఉపరితల ఆవర్తనాల వల్ల చలి ప్రభావం ఇంకా పెరుగుతోంది. లక్షద్వీప్, తమిళనాడుతోపాటు అరేబియా సముద్రంలో ఆవర్తనాల వల్ల దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు తగ్గిపోయాయి. ఈ ఆవర్తనాల ప్రభావంతో కర్ణాటక, పుదుచ్చేరి, తమిళనాడు ప్రాంతాల్లో వర్షాలు పడతాయని, రాయలసీమలోనూ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ వర్షాల వల్ల రాష్ట్రంలో కనిష్ట ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయని పేర్కొంటున్నారు. కాగా, ఈ నెలాఖరులో బంగాళాఖాతంలో తమిళనాడులోని మహాబలిపురం వద్ద తుపాను ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. జనవరి 4వ తేదీన బంగాళాఖాతంలో మరో తుపానుకు అవకాశం ఉందని వెల్లడించింది. వీటి ప్రభావంతో రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

గారపాడులో టీడీపీ గూండాల హైడ్రామా

- వారిలోవారే గొడవపడినట్లు నటన
- వైఎస్సార్‌సీపీ వారు దాడిచేశారంటూ పోలీసులకు ఫిర్యాదు
- ఇళ్లల్లోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను పోలీసులతో కొట్టించిన వైనం

గుంటూరు రూరల్: గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం గారపాడులో టీడీపీ గూండాలు హైడ్రామాకు తెరతీశారు. గతంలో జరిగిన వివాదాల నేపథ్యంలో వారిలోవారే పొలాల వద్ద గొడవ పడినట్లు నటించి తమపై వైఎస్సార్‌సీపీ నేతలు దాడిచేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీడీపీ నేతల మాటలు విన్న పోలీసులు వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లకు వెళ్లి తలుపులు పగలగొట్టి మహిళలు, వృద్ధులు, యువకులను తీవ్రంగా కొట్టారు. గ్రామంలో నాలుగు రోజుల కిందట టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడిచేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కళ్లల్లో కారంకొట్టి మహిళలతో దాడి చేయించారు. ఈ క్రమంలో టీడీపీ నాయకులు ప్రణాళిక ప్రకారం మంగళవారం పొలాల వద్ద గొడవ జరుగుతున్నట్లు సృష్టించి పోలీసులకు ఫోన్ చేశారు. టీడీపీ నాయకులు మాజీ ఎంపీపీ పూనాటి రమేష్, నవతా సుబ్బారావు, వీరయ్య, పల్లపాటి నవీన్ తదితరులు పోలీసులకు డబ్బు ఎరజూపి తమపై దాడిచేయించారని బాధితులు విలపిస్తున్నారు.

ఇంట్లోంచి బయటకు లాగి కొట్టారు



పొలం పనికి వెళ్లి వచ్చి ఇంట్లో పడుకున్న వృద్ధులను పోలీసులు బయటకు లాక్కొచ్చి కొట్టారు. టీడీపీ నాయకులు దగ్గరుండి మరీ మమ్మల్ని కొట్టించారు. పోలీసులు కొడుతుంటే, టీడీపీ వాళ్లు ఒక నెల ఆగండి మిమ్మల్ని ఏం చేస్తామో తెలియదంటూ బెదిరించారు. పోలీసులు సైతం వారికే వత్తాసు పలుకుతున్నారు. మమ్మల్ని చంపేస్తాం అంటూ బెదిరిస్తున్నారు.
– మేరి, గారపాడు

పొలంలో పనిచేసుకునే వారిని కొట్టారు



పొలంలో పనిచేసుకుంటున్న వారిని పోలీసులు పిలిచి మరీ కొట్టారు. టీడీపీ నాయకులు పోలీసులను తీసుకొచ్చి కొట్టించారు. మేము ఏమీ చేయలేదుకదా.. ఎందుకు కొడుతున్నారంటే.. పోలీసులనే ప్రశ్నిస్తావా అంటూ ఇంకా కొట్టారు. మేము వైఎస్సార్‌సీపీకి సానుభూతిపరులమని టీడీపీ వాళ్లు మాపై దాడులు చేయి స్తున్నారు.
– కారసాల రమేష్, గారపాడు

మిమ్మల్ని బతకనివ్వబోమని బెదిరిస్తున్నారు



టీడీపీ వాళ్లు కావాలని మమ్మల్ని పోలీసులతో కొట్టించారు. మేము కూలీనాలీ చేసుకుని జీవిస్తుంటాం. వాళ్లే మాపై దాడులు చేసి కొడుతూ మాపై కేసులు పెడుతున్నారు. పైగా పోలీసులను పిలిపించి వారితో కూడా కొట్టిస్తున్నారు. అదేమని పోలీసులను అడిగితే.. ఎందుకు అడుగుతున్నావని కూడా కొడుతున్నారు.
– కె.కోటేశ్వరమ్మ, గారపాడు

మహిళలను, వృద్ధులను కూడా పోలీసులు కొట్టారు



టీడీపీ వాళ్లు కావాలని ప్రతి చిన్నవిషయానికి గొడవలు పెడుతూ దాడులు చేస్తున్నారు. మేము వారి గ్రామంలోనుంచి పొలాలకు వెళుతుండగా కొట్టారు. మళ్లీ పోలీసులకు చెప్పి వారితో కూడా కొట్టించారు. ఇంట్లో పడుకున్న వృద్ధులను, మహిళలను కూడా కొట్టారు. న్యాయం చేయండి.
– బేతపూడి వినయ్‌కుమార్, గారపాడు

ఏయూపై ఎల్లో మీడియా విషం

- లోకేశ్ సభకు ఏయూ మైదానం ఇవ్వలేదంటూ తప్పుడు కథనాలు
- ఆదివారం వరకు కొనసాగిన ఆర్గానిక్ మేళా
- నేటికీ కొనసాగుతున్న టెంట్లు, షెడ్ల తొలగింపు పనులు
- అయినా ఏయూ వీసీ నిరాకరించారంటూ దుష్ప్రచారం
- జ్ఞానభేరి సభకు నాడు ఏయూ సొమ్ము రూ.6 కోట్లు ఖర్చు చేయించింది చంద్రబాబే



ఏయూ గ్రౌండ్‌లో ఆర్గానిక్ మేళాకు సంబంధించిన టెంట్లు, సామగ్రిని మంగళవారం తొలగిస్తున్న కార్మికులు

విశాఖ సిటీ: ప్రతిష్టాత్మక ఆంధ్ర విశ్వవిద్యాలయంపై పచ్చ మీడియా విషం కక్కుతోంది. వాస్తవాలను పక్కన పెట్టి రాజకీయ దురుద్దేశాలు ఆపాదిస్తూ అసత్య కథనాలు ప్రచురిస్తోంది. టీడీపీ నేత లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర ముగింపు సభకు ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానం ఇవ్వలేదన్న అక్కసుతో అసత్య కథనాన్ని ప్రచురించింది. ఆ మైదానంలో ఆదివారం వరకు ఆర్గానిక్ మేళా జరిగిన విషయం, దాని కోసం వేసిన భారీ టెంట్లు, షెడ్ల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోందని స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ.. కళ్లున్న కబోదిలా విషపు రాతలు రాసింది. విఖ్యాత విద్యా సంస్థ ఆంధ్రా యూనివర్సిటీకి రాజకీయాలను ముడిపెడుతూ అవాస్తవాలు రాసిన పచ్చపత్రికపై విద్యావేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్గానిక్ మేళా కారణంగా..

లోకేశ్ పాదయాత్ర ముగింపు సభను ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో నిర్వహించడానికి అనుమతి కోరారు. అయితే ఆ మైదానంలో ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు సేంద్రీయ రైతులు, ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ఆర్గానిక్ మేళా నిర్వహించారు. దీని కోసం ఏయూ నుంచి ముందుగానే అనుమతి తీసుకున్నారు. ఈ మేళాకు అనూహ్య స్పందన వచ్చింది. ఆదివారం రాత్రి మేళా ముగిసింది. ఇప్పటికీ మైదానంలో వేసిన టెంట్లు, షెడ్లు, ఇతర సామగ్రి తొలగింపు పనులు జరుగుతున్నాయి. ఈ సమయంలో బుధవారం భారీ బహిరంగ సభ కోసం మైదానం కేటాయించాలని టీడీపీ నాయకులు కోరారు. ఆర్గానిక్ మేళా టెంట్లు, సామగ్రి తొలగించడానికి మరికొంత సమయం పడుతుంది. టీడీపీ సభకు వేదిక, ఇతర ఏర్పాట్లకు కనీసం నాలుగు రోజుల ముందే మైదానాన్ని అప్పగించాలి. ఈ నేపథ్యంలో బుధవారం జరిగే సభకు మైదానం కేటాయించడం సాధ్యం కాదని ఏయూ అధికారులు టీడీపీ నాయకులకు సమాధానమిచ్చారు. ఆ విషయాన్ని వారు కూడా అంగీకరించారు. ఈ విషయాలన్నీ తెలిసినప్పటికీ, పచ్చ పత్రిక మాత్రం లోకేశ్ సభకు మైదానం కేటాయించలేదన్న అక్కసుతో తప్పుడు రాతలు రాసింది. అసలు విషయాన్ని వక్రీకరిస్తూ ఉద్దేశపూర్వకంగానే మైదానం ఇవ్వలేదని ఏయూపైన, వైస్ చాన్సలర్‌పైనా అవాస్తవాలను ప్రచురించింది. ఏయూ వీసీ, ప్రొఫెసర్లు వైసీపీ ప్రతినిధులు అంటూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసింది.

ఏయూ సొమ్ము వాడుకున్నది చంద్రబాబే..

వాస్తవానికి ఆంధ్రా యూనివర్సిటీ సొమ్మును సొంత ప్రచారానికి వాడుకున్న ఘనుడు చంద్రబాబే. 2018లో జ్ఞానభేరి పేరుతో చంద్రబాబు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో సభ నిర్వహించారు. ఈ సమయంలో సొంత డబ్బా కొట్టుకోడానికి ఆంధ్రా యూనివర్సిటీ నిధులు రూ.6 కోట్లు వాడుకున్నారు. ఆయన సొంత ప్రచారం కోసం ఏయూ సొమ్ముని, మైదానాలను వాడుకున్న విషయాన్ని పచ్చ పత్రిక ప్రశ్నించదు. కానీ, అనివార్య కారణాల వల్ల మైదానం కేటాయించలేదన్న అక్కసుతో పిచ్చి రాతలు రాయడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

రైతులకు రెట్టింపు ఆదాయమే లక్ష్యం

- నాణ్యతకు పెద్దపీట వేసిన జగన్ ప్రభుత్వం
- పంటలకు ఇండిగ్యాప్ సర్టిఫికేషన్ ఇస్తున్న తొలి రాష్ట్రం ఏపీ
- క్యూసీఐతో ఒప్పందం.. రైతులకు మరింత లబ్ధి
- ఏపీ గున్వత్ సంకల్ప వర్క్‌షాప్‌లో వ్యవసాయశాఖ మంత్రి కాకాణి



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న మంత్రి కాకాణి

సాక్షి, అమరావతి: రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కంటే రెట్టింపు ఆదాయం సమకూర్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు, విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. గత ప్రభుత్వాలు ఇలా వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చిన దాఖలాల్లేవన్నారు. క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూసీఐ) ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో జరిగిన ఏపీ గున్వత్ సంకల్ప (నాణ్యతకు భరోసా) వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో రైతుల కష్టాలను స్వయంగా చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి అడుగు రైతుల సంక్షేమం కోసమే వేస్తున్నారని చెప్పారు. విత్తు నుంచి విక్రయం వరకు రైతు చేయిపట్టుకుని నడిపించేందుకు ఆర్బీకే వ్యవస్థను, దీనికి అనుబంధంగా యంత్రసేవా కేంద్రాలు, గోదాములతో కూడిన మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లు ఏర్పాటు చేశారని వివరించారు. పాడి, ఆక్వా రైతులకు నాణ్యమైన సీడ్, ఫీడ్ అందించడంతోపాటు బ్యాంకింగ్ సేవలను గ్రామస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. ఎన్నో జాతీయ, అంతర్జాతీయ ప్రశంసలు, అవార్డులు, రివార్డులతో నేడు మన ఆర్బీకేలు దేశానికే కాదు.. ప్రపంచానికే రోల్‌మోడల్‌గా నిలిచాయని చెప్పారు. వైఎస్సార్ రైతుభరోసా కింద ఏటా మూడు విడతల్లో రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని పేర్కొన్నారు. ఉద్యానపంటల హబ్‌గా నిలిచిన ఏపీ బొప్పాయి, టమాటా, కోకో, పామాయిల్‌లో మొదటిస్థానంలోను, అరటి, బత్తాయి, వంగ, మిరపలో రెండోస్థానంలోను, మామిడి, ఉల్లి, జీడిమామిడిలో మూడోస్థానంలోను నిలిచిందని చెప్పారు. రొయ్యలు, చేపలు, గుడ్ల ఉత్పత్తిలో దేశంలోనే మొదటిస్థానంలో ఉందన్నారు.

14 ఎఫ్‌పీవోలకు గ్యాప్ సర్టిఫికేషన్

క్యూసీఐ సహకారంతో పైలెట్ ప్రాజెక్టు కింద గ్యాప్ సర్టిఫికేషన్ కోసం ఖరీఫ్–23లో 33 ఎఫ్‌పీవోలు రిజిస్ట్రేషన్ చేసుకోగా, అర్హత పొందిన 14 ఎఫ్‌పీవోలకు మంత్రి కాకాణి గ్యాప్ సర్టిఫికేషన్ జారీచేశారు. క్యూసీఐ ఇండిగ్యాప్ పోర్టల్‌ను ఆవిష్కరించారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో సేవలందించేందుకు మంత్రి సమక్షంలో ఏపీ ప్రభుత్వం, క్యూసీఐ అవగాహన ఒప్పందం చేసుకున్నాయి. క్యూసీఐ చైర్‌పర్సన్ జాక్సా షా, సీఈవో డాక్టర్ ఎ.రాజ్, వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది, సహకార, మార్కెటింగ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవిచౌదరి, వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్, ఏపీ సీడ్స్ ఎండీ గెడ్డం శేఖర్‌బాబు, ఉద్యాన, సహకార, మత్స్యశాఖల కమిషనర్లు శ్రీధర్, అహ్మద్‌బాబు, కన్నబాబు, పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ అమరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో విజయవంతంగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్

- కిడ్నీ దానం చేసిన కుమారుడి తల్లి
- ఆరోగ్యశ్రీలో ఉచితంగా నిర్వహణ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో మంగళవారం కిడ్నీ మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా జరిగింది. మచిలీపట్నంకు చెందిన చిత్తజల్లు సందీప్(39) కొంతకాలంగా కిడ్నీ జబ్బుతో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా వ్యాధి తగ్గుముఖం పట్టలేదు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండటంతో గత నెలలో గుంటూరు జీజీహెచ్‌కు చికిత్స కోసం వచ్చాడు. నెఫ్రాలజీ వైద్యులు సందీప్‌ను పరీక్షించి వార్డులో అడ్మిట్ చేసుకున్నారు. కొద్దిరోజుల చికిత్స అనంతరం కిడ్నీ మార్పిడి చేయాలని నిర్ణయించారు. సందీప్ తల్లి పద్మావతి కిడ్నీ దానం చేసేందుకు ముందుకు రావడంతో మంగళవారం కిడ్నీ మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా చేశారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సుమారు రూ. 10 లక్షల ఖరీదు చేసే ఈ ఆపరేషన్‌ను సందీప్‌కు పూర్తి ఉచితంగా చేశారు. ఆపరేషన్ ప్రక్రియలో యూరాలజీ, నెఫ్రాలజీ, ఎనస్థీషియా వైద్యులు పాల్గొన్నారు. సందీప్, పద్మావతి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఇప్పటివరకు గుంటూరు జీజీహెచ్‌లో 23 కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు జరిగాయి.

నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బందికి వర్క్‌షాప్

సాక్షి, అమరావతి: రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సిబ్బందికి మంగళవారం విజయవాడలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ అజయ్‌రెడ్డి, నైపుణ్యాభివృద్ధి శిక్షణశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి నైపుణ్యం అందించాలని కోరారు. అందుకనుగుణంగా సంస్థ సిబ్బందికి కూడా శిక్షణ అవసరమని వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని యువతలో నైపుణ్యాలను అభివృద్ధి చేయాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని చెప్పారు. యువత ఉద్యోగాలు, ఉపాధి సాధించేలా తీర్చిదిద్దాలన్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ డాక్టర్ వినోద్‌కుమార్ జిల్లా అధికారుల విధులపై దిశానిర్దేశం చేశారు. ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ డైరెక్టర్ నవ్య, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

లోక్‌సభ

జీఎస్టీ శ్లాబ్ రేట్లు తగ్గించండి



సాక్షి, న్యూఢిల్లీ: జీఎస్టీతో చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్రాన్ని కోరారు. మంగళవారం లోక్‌సభలో సెంట్రల్ గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ (రెండో సవరణ) బిల్లు–2023పై చర్చలో ఆయన మాట్లాడుతూ.. శ్లాబ్ రేట్లను తగ్గించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. పన్ను రేట్లను క్రమబద్ధీకరించడంతోపాటు వ్యవస్థను సులభతరం చేయాలని కోరారు. పన్ను చెల్లింపుదారుల్లో గందరగోళాన్ని నివారించాలని సూచించారు. జీఎస్టీ చట్టాలపై పన్ను చెల్లింపుదారులకు అవగాహన కల్పించేందుకు సెమినార్లు, వర్క్‌షాపులు నిర్వహించాలని సూచిస్తూ.. ఈ బిల్లుకు వైఎస్సార్‌సీపీ మద్దతు తెలుపుతోందని పేర్కొన్నారు.

ఏపీలో ఆక్వా కల్చర్‌కు ప్రోత్సాహం



ఆంధ్రప్రదేశ్‌లో అతి తక్కువ స్థలంలో అత్యధికంగా చేపలు, రొయ్యలు పెంచే (ఇంటెన్సివ్ ఆక్వా కల్చర్) కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నట్లు కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం రూపాలా తెలిపారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజనలో భాగంగా రూ.15.58 కోట్లు విలువైన 99 బయోఫ్లాక్ పాండ్స్, రూ.17.64 కోట్ల విలువైన రీ-సర్క్యులేటరీ ఆక్వాకల్చర్ సిస్టమ్ 62 యూనిట్లకు అనుమతి ఇచ్చినట్టు వైఎస్సార్‌సీపీ సభ్యుడు సంజీవకుమార్ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

సైబర్ నేరాల పరిష్కారానికి ఐ4సీ



సైబర్ నేరాల పరిష్కారాలకు ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) ఏర్పాటు చేసినట్టు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్‌కుమార్ మిశ్రా తెలిపారు. విశాఖపట్నంలో జాయింట్ సైబర్ కో–ఆర్డినేషన్ టీమ్స్ ఏర్పాటు చేశామని.. ఇది సైబర్ నేరాల నియంత్రణకు ఐ4సీ కింద పనిచేస్తుందని వైఎస్సార్‌సీపీ సభ్యుడు మార్గాని భరత్‌రామ్ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

రాజ్యసభ

ఏపీలో 1.06 లక్షల హెక్టార్లలో సేంద్రియ వ్యవసాయం



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో 1.06 లక్షల హెక్టార్లలో సేంద్రియ వ్యవసాయం జరుగుతోందని ఎరువులు, రసాయనాల శాఖ సహాయ మంత్రి భగవంత్ కుబా తెలిపారు. పారంపర్‌గత్ ప్రధాన మంత్రి క్రిషి వికాస్ యోజన కింద సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ కేంద్రం వాటాగా ఏపీకి 2015–16 నుంచి ఇప్పటివరకూ రూ.326.91 కోట్లు విడుదల చేసినట్టు వైఎస్సార్‌సీపీ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు రాజ్యసభలో మంగళవారం లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

ఏపీలో 11,844 ఆయుష్మాన్ భారత్ మందిర్‌లు



ఆంధ్రప్రదేశ్‌లో 11,844 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లను ఏర్పాటు చేసినట్టు కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు పరిమళ్ నత్వానీ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. ఏపీ పీహెచ్‌సీల్లో 1,145, ఎస్‌హెచ్‌సీల్లో 10,155, యూపీహెచ్‌సీల్లో 544 ఏఏఎంలు ఉన్నాయని పేర్కొన్నారు. ఏపీలో 2,626 మెడికల్ ఆఫీసర్లు, 10,160 సీహెచ్‌వోలు, 3,185 స్టాఫ్ నర్సులు, 18,834 మహిళా ఎంపీడబ్ల్యూలు, 6,570 మగ ఎంపీడబ్ల్యూలు, 42,585 ఆశా వర్కర్లు ఉన్నారని వివరించారు.

జనసేన మద్దతుంటేనే టీడీపీకి విజయం

మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య

పాలకొల్లు సెంట్రల్: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఓడించాలంటే తెలుగుదేశం పార్టీ జనసేనతో కలసిమెలసి ఉంటేనే సాధ్యమవుతుందని మాజీ ఎంపీ, రాజకీయ విశ్లేషకుడు చేగొండి హరిరామజోగయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మంగళవారం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ఒక ప్రకటన విడుదల చేశారు. టీడీపీ సోషల్ మీడియాలో జనసేనకు 28 లేక 25 సీట్లంటూ ప్రచారం చేస్తున్నారని, 2019 ఎన్నికల్లో 40 శాతం ఓట్లు వచ్చిన టీడీపీకి 23 సీట్లే వచ్చాయని, 6.9 శాతం ఓట్లు వచ్చిన జనసేనకు ఒక సీటు వచ్చిందని పేర్కొన్నారు. నాడు ఇద్దరూ కలిసి పోటీచేసి ఉంటే 61 సీట్లు గెలుచుకునేవారని తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన సపోర్టు ఉంటేనే టీడీపీ అధికారం చేపట్టగలదని పేర్కొన్నారు. 57 నియోజకవర్గాల్లో జనసేనకు ఓటర్ల బలముందని తెలిపారు. పొత్తు ధర్మంలో భాగంగా చంద్రబాబు జనసేన పార్టీకి 57 సీట్లు ఇవ్వాలని జనసైనికులు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ రకమైన కేటాయింపు జరిగితేనే జనసైనికులు సంతృప్తి చెంది ఓట్ల బదిలీ సక్రమంగా చేయగలుగుతారని స్పష్టం చేశారు. చంద్రబాబు ఈ కోణంలో ఆలోచించి సముచిత నిర్ణయం తీసుకుని ముందుకెళతారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మొత్తం 59 నియోజకవర్గాల్లో జనసేన ప్రాబబుల్ అభ్యర్థుల పేర్లు విడుదల చేశారు. ఇందులో పవన్‌కళ్యాణ్ గాజువాక, పిఠాపురం, నిడదవోలు, తాడేపల్లిగూడెం, భీమవరం, నరసాపురం నియోజకవర్గాల్లో ఏదో ఒకస్థానం నుంచి పోటీచేయవచ్చని పేర్కొన్నారు.

తెలంగాణ

విద్యార్థుల ప్రతిభతోనే దేశ గౌరవం ఇనుమడిస్తుంది

హెచ్‌పీఎస్ శతాబ్ది ఉత్సవాల్లో రాష్ట్రపతి



సాక్షి, హైదరాబాద్: విద్యార్థులు కనబర్చే ప్రతిభతోనే దేశ గౌరవం పెరుగుతుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చెప్పారు. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత గురువులదేనన్నారు. మంగళవారం హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్) శతాబ్ది ఉత్సవాల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించేలా పట్టుదలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. స్వార్థ ప్రయోజనాలు కాకుండా ఇతరులకు సహాయపడే అలవాటు చేసుకోవాలని చెప్పారు. జీవితంలో అభిరుచులను స్థిరంగా కొనసాగించడం చాలా అవసరమని, ఇవి సానుకూల శక్తిని పెంపొందించడమే కాకుండా ఇతరులకు ప్రేరణగా పని చేస్తాయన్నారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ గొప్ప గొప్ప విద్యార్థులను అందించి దేశానికి మంచి గుర్తింపును తెచ్చిపెట్టిందని కొనియాడారు.

తెలంగాణ డీజీపీగా రవిగుప్తాకు పూర్తిస్థాయి బాధ్యతలు

పలువురు సీనియర్ ఐపీఎస్‌ల బదిలీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో భారీ సంఖ్యలో సీనియర్ ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రవిగుప్తాను పూర్తిస్థాయి డీజీపీగా నియమించింది. ఆయనకు హెడ్ ఆఫ్ పోలీస్ ఫోర్స్ (హెచ్‌ఓపీఎఫ్)గా పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించింది. వెయిటింగ్‌లో ఉన్న కొందరికి పోస్టింగులు ఇచ్చింది. డీజీపీగా పనిచేస్తూ ఎన్నికల సంఘం సస్పెన్షన్‌కు గురై వెయిటింగ్‌లో ఉన్న అంజనీకుమార్‌ను రోడ్డు సేఫ్టీ అథారిటీ చైర్మన్‌గా బదిలీ చేసింది. ప్రింటింగ్ అండ్ స్టేషనరీ కమిషనర్‌గా కూడా ఆయనకు పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు అప్పగించింది. వెయిటింగ్‌లో ఉన్న సీవీ ఆనంద్‌ను ఏసీబీ డైరెక్టర్ జనరల్‌గా నియమించింది. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ రాజీవ్ రతన్‌ను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా నియమించింది. అలాగే వెయిటింగ్‌లో ఉన్న స్టీఫెన్ రవీంద్రకు హోంగార్డ్స్ ఐజీగా బాధ్యతలు అప్పగించింది.

తెలంగాణలో 4 కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: మళ్లీ కరోనా కలకలం రేపుతోంది. తెలంగాణ రాష్ట్రంలో మంగళవారం ఒక్కరోజే ఏకంగా నాలుగు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. 402 మందికి కోవిడ్ పరీక్షలు చేయగా నలుగురికి వైరస్ వ్యాప్తి చెందినట్లు గుర్తించారు. ఈ మేరకు ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు కోవిడ్ బులిటెన్ విడుదల చేశారు. కాగా గత వారం రోజుల్లో ఐదు కరోనా కేసులు నమోదయ్యాయి. బాధితులు అందరూ ఐసోలేషన్ లేదా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ ప్రకటించింది.

క్లుప్తంగా...

21న లాసెట్ తుది దశ కౌన్సెలింగ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని న్యాయ విద్యలో ప్రవేశాల్లో భాగంగా నిర్వహించిన లాసెట్/పీజీ లాసెట్ తుది విడత కౌన్సెలింగ్ ప్రక్రియకు ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ పి.ఉమా మహేశ్వరిదేవి మంగళవారం షెడ్యూల్ విడుదల చేశారు. ఈ నెల 21–23 వరకు ప్రాసెసింగ్ ఫీజు, రిజిస్ట్రేషన్, 22 నుంచి 26 వరకు ధ్రువపత్రాల పరిశీలన, 27–19వరకు వెబ్ ఆప్షన్ల ఎంపిక, 30న మార్పులకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. జనవరి 2న తుది సీట్లను కేటాయిస్తామన్నారు. 3–5వ తేదీలోగా సీట్లు పొందిన అభ్యర్థులు నేరుగా కళాశాలల్లో రిపోర్టు చేయాలని సూచించారు.

డిపార్ట్‌మెంటల్ టెస్ట్‌కు ఏపీపీఎస్సీ ఏర్పాట్లు

సాక్షి, అమరావతి: ప్రభుత్వంలోని పలు విభాగాల్లో పనిచేస్తోన్న ఉద్యోగుల కోసం నిర్వహించే డిపార్ట్‌మెంటల్ టెస్ట్ కోసం ఏపీపీఎస్సీ చర్యలు చేపట్టింది. దీనికి సంబంధించి ఈ నెల 27 నుంచి జనవరి 3 వరకు పరీక్షలు జరుగుతాయని సర్వీస్ కమిషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ తెలిపారు. నవంబర్ సెషన్ పరీక్షకు 37,133 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. హాల్‌టికెట్లను https://psc.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచామని, బుధవారం నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఈ పరీక్షలకు 21 జిల్లా కేంద్రాలతో పాటు న్యూఢిల్లీలోను సెంటర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

'సలార్' చిత్రం టికెట్ ధర పెంపునకు అనుమతి




సాక్షి, అమరావతి: త్వరలో విడుదల కానున్న ప్రభాస్ చిత్రం 'సలార్' టికెట్ ధర పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. భారీ బడ్జెట్ చిత్రాలకు టికెట్ ధరను పది రోజులపాటు పెంచి విక్రయించేందుకు గతేడాది రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సలార్ చిత్రం విడుదల నుంచి 10 రోజుల పాటు టికెట్‌పై గరిష్టంగా రూ.40 వరకు ధర పెంపునకు అనుమతినిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

'దీవెన'తో దిమ్మతిరిగి..

దుష్ప్రచారంలో గోబెల్‌ను మించిపోయిన రామోజీ

- ఏటా త్రైమాసికానికి ఓసారి విద్యా దీవెన జమ చేస్తున్నా అక్కసే
- ఇప్పటిదాకా విద్యా దీవెన, వసతి దీవెన కింద మొత్తం రూ.15,592.87 కోట్లు జమ
- ఈనెల 29న భీమవరం నుంచి విద్యాదీవెన పంపిణీకి ఏర్పాట్లు
- గత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలూ చెల్లించిన జగన్ ప్రభుత్వం





సాక్షి, అమరావతి : ఉన్నవి లేనట్లు.. లేనివి ఉన్నట్లు దుష్ప్రచారం చేయడంలో గోబెల్‌ను సైతం రాజగురువు రామోజీరావు మించిపోయారు. సీఎం జగన్, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా.. నిరుపేదలు, వెనుకబడిన వర్గాలనే లక్ష్యంగా చేసుకుని తన విషపుత్రిక ఈనాడులో అబద్ధాలను అదేపనిగా అబద్ధాలను ప్రజలపై రుద్దేందుకు ఎల్లో మీడియా గత ఐదేళ్లుగా తెగ ప్రయాసపడుతోంది. ఇప్పుడు ఎంతో సమున్నతంగా ఉన్న ప్రభుత్వ విద్యా రంగంపై నిస్సిగ్గుగా తప్పుడు కథనాలు ప్రచురిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లడమే లక్ష్యంగా అసత్యాలను వండివారుస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం 'దీవెనే శాపమైన వేళ..' అంటూ విద్యాదీవెన పథకంపై **తన** అక్కసునంతా రంగరించి ప్రదర్శించింది.

పేద విద్యార్థులు కూడా పెద్ద చదువులు చదవాలన్న ఉన్నతాశయంతో ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి ఉన్నత కోర్సులు చదివే పేద విద్యార్థులు కాలేజీలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజును క్రమం తప్పకుండా ఏ త్రైమాసికానికి ఆ త్రైమాసికం ముగిసిన వెంటనే ప్రస్తుత ప్రభుత్వం జమచేస్తోంది. గత ప్రభుత్వంతో పోలిస్తే.. అమల్లో గాని, నిధుల విడుదలలో గాని, లబ్ధిపొందుతున్న విద్యార్థుల సంఖ్యలోగాని ఈ ప్రభుత్వ హయాంలో ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు నూటికి నూరుశాతం విద్యాదీవెన ద్వారా మేలు జరుగుతోంది.

అపరిమితంగా ఫీజు రీయింబర్స్‌మెంట్..

ఇక పేద విద్యార్థుల ఉన్నత చదువులకు వైఎస్ జగన్ ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాలకు ఎలాంటి పరిమితీలేదు. కుటుంబంలో ఎంతమంది చదువుతుంటే అంతమందినీ చదివించవచ్చు. ఫీజు ఎంతైనా ప్రభుత్వమే చెల్లిస్తోంది. ఇందులో గరిష్టంగా రూ.3.05 లక్షల వరకూ రీయింబర్స్‌మెంట్ చేస్తోంది. గత ప్రభుత్వం ఏడాదికి ఇంజినీరింగ్ కోర్సులకు గరిష్టంగా రూ.35 వేలు, ఫార్మాకు రూ.68 వేలు మాత్రమే చెల్లించింది. అలాగే, గత ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలోనే కాదు, ఎందులోనూ సంతృప్తస్థాయి అన్నమాటే లేదు. ఇక ప్రభుత్వం ఫీజులు ఇచ్చేవరకూ వేచి చూడకుండా పిల్లల తల్లులు కట్టాలంటూ కొన్ని కాలేజీలు ఒత్తిడి చేస్తున్నాయంటూ ఈనాడు వక్రీకరణకు దిగింది. ప్రభుత్వం తల్లుల ఖాతాల్లో డబ్బును జమచేసిన తర్వాత వారంలోగా ఆ మొత్తాన్ని కాలేజీలకు చెల్లించాలి. మూడు వారాల్లోగా చెల్లించకుంటే కాలేజీలు ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తెస్తున్నాయి. దాంతో తదుపరి విడత ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బును నేరుగా కాలేజీ ఖాతాల్లో ప్రభుత్వం జమచేస్తోంది. దీంతో తల్లితండ్రులపై కాలేజీలు ఒత్తిడి తీసుకువచ్చే ఆస్కారమే లేదు. అలాగే, ఫీజు చెల్లించేంత వరకూ సర్టిఫికెట్లు ఇవ్వడంలేదని ఈనాడు చెప్పిందీ అబద్ధమే. ఇలా చేయడానికి కాలేజీలకు ఎలాంటి అధికారంలేదు.

వివక్ష లేకుండా వసతి దీవెన..

ఇదేకాక.. ఉన్నత చదువులు చదివే పేద విద్యార్థుల భోజన, వసతి ఖర్చుల కోసం ఏటా రెండు వాయిదాల్లో ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు అభ్యసించే వారికి రూ.20 వేల చొప్పున జగనన్న వసతి దీవెన కింద ప్రభుత్వం అందిస్తోంది. గత ప్రభుత్వంలో అయితే కుల ప్రాతిపదికన, కోర్సు ప్రాతిపదికన కేవలం రూ.4 వేల నుంచి గరిష్టంగా రూ.10 మాత్రమే ఇచ్చేవారు. అలాగే, ఎస్సీ, ఎస్టీలకు వార్షికాదాయాన్ని రూ.2 లక్షలు, ఇతర వర్గాలకు రూ.లక్ష పరిమితి పెడితే, ప్రస్తుత ప్రభుత్వం ఎలాంటి వివక్ష చూపకుండా అర్హులైన అందరికీ వసతి దీవెన అమలుచేస్తోంది. వసతి దీవెన డబ్బులు నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకే జమచేస్తోంది.

ఏ త్రైమాసికానికి ఆ త్రైమాసికం చెల్లింపు..

గత టీడీపీ ప్రభుత్వంలో ఫీజు చెల్లించేందుకు తల్లిదండ్రులు అప్పులు పాలైనా, ఇవ్వాల్సిన అరకొర ఫీజులను ఇవ్వకుండా బకాయి పెట్టినా.. ఫీజులు కట్టలేక, సర్టిఫికెట్లు రాక విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. దీనిపై ఏనాడూ రామోజీ తన ఈనాడులో ఒక్క కథనాన్ని కూడా ప్రచురించలేదు. కానీ, ఈ ప్రభుత్వం ఏ త్రైమాసికానికి ఆ త్రైమాసికం ఫీజులు చెల్లించడంతో పాటు, 2017 నుంచి ఇవ్వాల్సిన రూ.1,778 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సైతం చెల్లించింది. అంతేకాక.. సంపూర్ణ ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలుచేస్తూ పేద విద్యార్థులకు అండగా నిలిచింది. పైగా దేశంలో నూరుశాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలుచేస్తోంది సీఎం జగన్ నేతృత్వంలోని ఏపీ ప్రభుత్వం ఒక్కటే. అయినా, ఇదేమీ పట్టని రామోజీ మాత్రం ప్రభుత్వంపై విషం కక్కుతున్నారు. నిజానికి.. టీడీపీ పాలన ఐదేళ్లలో చెల్లించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి ఖర్చులు సగటున ఏడాదికి రూ.2,428 కోట్లు అయితే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఏటా చెల్లిస్తున్న సగటు మొత్తం రూ.4,044 కోట్లు. గత ప్రభుత్వం ఐదేళ్లలో రూ.10,332 కోట్లు వెచ్చిస్తే.. ఈ ప్రభుత్వం నాలుగేళ్లలో విద్యా దీవెన, వసతి దీవెన పథకాల కింద రూ.15,592.87 కోట్లు ఖర్చుచేసింది. 26.98 లక్షల మందికి విద్యాదీవెన కింద రూ.11,317.11 కోట్లు.. 25.17 లక్షల మందికి వసతి దీవెన కింద మరో రూ.4,275.76 కోట్లు చెల్లించింది.

- 2022 అక్టోబరు–డిసెంబరు కాలానికి చెల్లించాల్సిన రూ.698.68 కోట్లను ప్రభుత్వం ఈ ఏడాది మార్చిలోనే చెల్లించింది.
- జనవరి–మార్చి 2023 త్రైమాసికానికి రూ.702.99 కోట్లను ఈ ఏడాది మే 24న చెల్లించింది.
- ఏప్రిల్–జూన్ 2023 త్రైమాసికం మొత్తాన్ని ఆగస్టులో చెల్లించింది.
- ఇప్పుడు జూలై–సెప్టెంబరు త్రైమాసికం సొమ్ము చెల్లింపు తుపాను కారణంగా వాయిదాపడింది. ఇది ఈనెల 29న భీమవరంలో జరిగే కార్యక్రమంలో 26.98 లక్షల మందికి జగనన్న విద్యాదీవెన, 25.17 లక్షల మందికి జగనన్న వసతి దీవెన నిధులను సీఎం జగన్ విడుదల చేయనున్నారు. ఇంత తంతునుగా ఎప్పటికప్పుడు విద్యార్థులకు చెల్లింపులు చేస్తుంటే రామోజీకి దిమ్మతిరిగిపోతోంది. దీంతో విద్యార్థులకు నష్టం జరిగిపోతోందంటూ ఈనాడు పెడబొబ్బలు పెడుతోంది.

జగన్ పిటిషన్‌లో మధ్యంతర ఉత్తర్వులు పొడిగింపు

మూడు వారాలు పొడిగించిన హైకోర్టు



సాక్షి, అమరావతి: విశాఖ విమానాశ్రయంలో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసులో విశాఖపట్నం ఎన్ఐఏ కోర్టు విచారణను నిలిపేస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు మూడు వారాలు పొడిగించింది. తదుపరి విచారణకు ఇరుపక్షాలు వాదనలు వినిపించేందుకు సిద్ధమై రావాలని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో 2018 అక్టోబర్ 25న విశాఖ విమానాశ్రయంలో వైఎస్ జగన్‌పై జనుపల్లి శ్రీనివాసరావు హత్యాయత్నం చేయడం తెలిసిందే. పదునైన కత్తితో జగన్ మెడపై దాడికి జనుపల్లి ప్రయత్నించాడు. జగన్ అప్రమత్తంగా ఉండటంతో ఆయన ఎడమ చేయికి గాయమైంది. ఈ ఘటనపై హైకోర్టు ఆదేశాల మేరకు ఎన్ఐఏ దర్యాప్తు చేసి.. చార్జిషీట్ దాఖలు చేసింది. జగన్‌ను చంపడమే శ్రీనివాసరావు ఉద్దేశమని, అందుకే మెడపై కత్తితో దాడికి ప్రయత్నించాడని చార్జిషీట్‌లో పేర్కొంది. ముందస్తు పథకంలో భాగంగానే శ్రీనివాసరావు కోడికత్తి సంపాదించాడని, అదును చూసి జగన్‌పై దాడిచేశాడని వివరించింది. దీనివెనుక ఉన్న కుట్ర, ప్రేరణ వ్యవహారాన్ని కూడా తదుపరి దర్యాప్తులో తేలుస్తామని ప్రత్యేక కోర్టుకు తెలిపింది. అయితే తరువాత ఎన్ఐఏ.. కుట్రకోణంపై దృష్టి సారించలేదు. ఎవరి ప్రేరణతో శ్రీనివాసరావు హత్యాయత్నానికి పాల్పడ్డాడో తేల్చలేదు. ఈ నేపథ్యంలో తనపై హత్యాయత్నం వెనుక ఉన్న కుట్రపై లోతైన దర్యాప్తు చేసేలా ఎన్ఐఏను ఆదేశించాలని కోరుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ఏడాది ఏప్రిల్‌లో విజయవాడ ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విజయవాడ కోర్టు కొట్టేసింది. దీన్ని సవాలు చేస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై అక్టోబర్‌లో విచారించిన హైకోర్టు.. విశాఖ కోర్టులో జరుగుతున్న విచారణను నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఎన్ఐఏను ఆదేశించింది. తాజాగా ఈ వ్యాజ్యంపై హైకోర్టు మంగళవారం మరోసారి విచారించింది.

కోర్టుకు వచ్చిన సీబీఐ అధికారులు

రాంసింగ్, సునీత, రాజశేఖర్‌రెడ్డిపై కేసు సర్టిఫైడ్ కాపీల కోసం పిటిషన్



పులివెందుల కోర్టు ఆవరణలో ఉన్న సీబీఐ అధికారులు

జమ్మలమడుగు/పులివెందుల: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి పీఏ కృష్ణారెడ్డి ఫిర్యాదు ఆధారంగా కోర్టు ఆదేశాల మేరకు నమోదు చేసిన కేసులో వివరాల కోసం సీబీఐ అధికారులు మంగళవారం పులివెందుల కోర్టుకు వచ్చారు. కృష్ణారెడ్డి 2021లో సీబీఐ ఏఎస్పీ(ప్రస్తుతం ఎస్పీ) రాంసింగ్, వైఎస్ వివేకాకుమార్తె సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డిపై పులివెందుల కోర్టులో ప్రైవేట్ కంప్లయింట్ దాఖలు చేశారు. వివేకానందరెడ్డి హత్య కేసులో రాంసింగ్ ఏకపక్షంగా వ్యవహరించడంతోపాటు కేసులతో సంబంధంలేని వ్యక్తులను టార్గెట్ చేసి దర్యాప్తు జరుపుతున్నారని, అలాగే వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె వైఎస్ సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి పలుమార్లు తనను బెదిరించారని ఆ కంప్లయింట్‌లో పేర్కొన్నారు. దానిపై విచారించిన కోర్టు తాజాగా రాంసింగ్, సునీత, రాజశేఖర్‌రెడ్డిలపై కేసు నమోదు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు పులివెందుల పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో కృష్ణారెడ్డి పెట్టిన కేసుకు సంబంధించి సర్టిఫైడ్ కాపీల కోసం సీబీఐ అధికారులు పులివెందులలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు వచ్చారు. అయితే మేజిస్ట్రేట్ లేకపోవడంతో సర్టిఫైడ్ కాఫీల కోసం వారు జమ్మలమడుగు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

పాతికేళ్లకు పైగా
ఫిట్‌నెస్ రంగంలో
తనదైన ముద్ర వేస్తున్నారు యాస్మిన్ కరాచీవాలా.
బాలీవుడ్ తారలకు ఫిట్‌నెస్ ట్రైనర్‌గా ఉన్న యాస్మిన్‌కి
ముంబైతో పాటు విదేశాల్లోనూ ఫిటెనెస్ స్టూడియోలు ఉన్నాయి.
ఫిట్‌నెస్‌కు సంబంధించిన తన అనుభవాలను
పుస్తకాల రూపంలో తీసుకు వచ్చి రైటర్‌గానూ గుర్తింపు పొందారు.
ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రివల్యూషనైజ్ యువర్ వర్కౌట్
కార్యక్రమానికి వచ్చిన ఈ ముంబై ఫిట్‌నెస్ ట్రైనర్
'53 ఏళ్ల వయసులోనూ చాలా యంగ్ అండ్ ఎనర్జిటిక్‌గా
కనిపిస్తున్నారు ఆ సీక్రెట్ ఏంటో
మాకూ చెప్పండి' అంటే ఎన్నో విషయాలను
మన ముందుంచారు.


యాస్మిన్ కరాచీవాలా

ఫిట్‌నెస్ మ్యాజిక్ పిల్ ఏమీ కాదు

''(నవ్వుతూ) నాకు ముగ్గురు పిల్లలున్నారు. పెద్దబ్బాయికి 26, చిన్నబ్బాయికి 23 ఏళ్లు. అమ్మాయికి పెళ్లైంది. 26 ఏళ్లుగా వ్యాయామంపై దృష్టి పెడుతున్నాను. వ్యాయామాలు నేర్పిస్తున్నాను. సరైన ఆహారం, సరైన వ్యాయామం, సరైన జీవనశైలిని అలవర్చుకుంటే ఎవ్వరైనా యంగ్ అండ్ ఎనర్జిటిక్‌గా ఉండచ్చు. ఫిట్‌నెస్ అనేది కేవలం బరువు తగ్గించుకోవడానికి ఉపయోగించే మ్యాజిక్ పిల్ కాదు షాప్‌కి వెళ్లి కొనుక్కోవడానికి. ఫిట్‌గా మారాలంటే కృషి చేయాల్సిందే.



■ **కృషికి మూలం**

నన్ను చూసి మా అబ్బాయిలు ఇద్దరూ ఫిట్‌నెస్ పట్ల ఆసక్తి పెంచుకున్నారు. వాళ్లు ఈ రంగంలో బిజీగా ఉన్నారు. నచ్చింది చేయడం మన జీవనశైలి అవుతుంది. ఇష్టం లేనిది చేయడం భారం అనిపిస్తుంది. ఫిట్‌నెస్ అనేది ట్రెండ్ కాదు. అదొక జీవన విధానం. మనం దానిని ఎలా తీసుకుంటే, అది మనల్ని అలా మార్చేస్తుంది. నేను ఫిట్‌నెస్ ట్రైనర్‌గా ఉండాలని ఎప్పుడూ ప్లాన్ చేసుకోలేదు. నా చిన్నతనం నుంచి నేను గమనించినవాటిలో మా నాన్న రోజూ వాకింగ్, అమ్మ యోగా చేయడం చూసేదాన్ని. కానీ, (నవ్వుతూ) నేను మాత్రం చేసేదాన్ని కాదు. ఎవ్వరూ ఇష్టపడని బద్ధకిష్టులలో నేనూ ఒకరిగా ఉండేదాన్ని. డిగ్రీ పూర్తయిన కొన్నాళ్లకు ఓ రోజు నా ఫ్రెండ్ హెల్త్ క్లబ్‌కి తీసుకెళ్లింది. అయిష్టంగానే అక్కడికి వెళ్లాను. ఆ హెల్త్‌క్లబ్‌కు వెళ్లే ముందు వరకు ఎన్నడూ వ్యాయామం చేసింది లేదు. ఏదో ఒక సాకుతో ఫిట్‌నెస్ యాక్టివిటీస్‌కి దూరంగా ఉండేదాన్ని. అలాంటిది సరదాగా హెల్త్ క్లబ్‌లో చేసిన ప్రయత్నాలు దారిలో పడేలా చేశాయి. అప్పటినుంచి ఇన్నేళ్లుగా నన్ను నేను మలుచుకుంటూ ఇంకొందరిని మారుస్తున్నాను.

■ **చురుకైనా మార్పులంటే..**

ఫిట్‌గా ఉండటానికి, వ్యాయామం ప్రారంభించాలంటే ముందు మన శరీర బలాన్ని అదేవిధంగా పరిమితులను అర్థం చేసుకోవాలి. తప్పనిసరిగా కృషి చేయాలనే జిజ్ఞాసను, నిబంధననూ బ్రెయిన్‌కు అందించాలి. మనల్ని మనం ఎలా చూసుకోవాలనుకుంటున్నామో ముందు దానిని గుర్తించాలి. అప్పుడు సరైన కృషి చేయగలం. కొందరు జిమ్‌కి వెళితే వ్యాయామం సాధ్యం అనుకుంటారు. ఇంకొందరు నాకు సినిమా తారల్లాంటి శరీరం కావాలి అని కలలు కంటుంటారు. ఇలాంటివారు తమ రోజువారి యాక్టివిటీలో మార్పులు చేసుకోవాలి. బద్ధకం పోవడానికి, చురుగ్గా మారడానికి స్పోర్ట్స్ హాబీని పెంచుకోవాలి. ఫిట్‌నెస్, వాకర్స్ .. వంటి గ్రూపుల్లో చేరాలి. ఏదోవిధంగా ప్రతిరోజూ చురుగ్గా ఉండేలా మార్పులు చేసుకోవాలి. వీటితోపాటు రోజువారీ వదుల్చుకోలేని కొన్ని విషాలకు దూరంగా ఉండాలి.

■ **ఎలాంటి విషాలు..**

చక్కెర క్యాన్సర్‌కు ఆహారం. అంతేకాదు, అనేకవ్యాధులకు ప్రధాన కారణం కూడా. చాలా మంది ఉదయాన్నే షుగర్ కలిపిన టీ లేదా కాఫీతో రోజును మొదలుపెడతారు. అదే అనారోగ్యాలకు దగ్గర చేస్తుంది. అందుకని, ముఖ్యంగా రిఫైన్డ్ షుగర్‌ని పూర్తిగా దూరం పెట్టాలి. దీనికి బదులు బెల్లం, తేనె తీసుకోవచ్చు. ఇక నూనెలో వేయించిన సమోసాలు, బోండాలు.. వంటి వేపుడు పదార్థాలు తీసుకోకూడదు. వేడుకల సమయాల్లో 'ఏముందిలే, ఈ ఒక్కరోజుకు అంటూ ఐస్‌క్రీమ్, షుగర్ బేస్డ్ వంటి ఎన్నో పదార్థాలు తీసుకుంటూ ఉంటారు. ఇవన్నీ శరీరానికి హాని చేసేవే.

■ **సవాళ్లను అధిగమించాలంటే..**

నాకు ముంబై, గుర్గావ్, ఢిల్లీ, ఇండోర్, ఢాకా, దుబాయ్‌లలో ఫిట్‌నెస్ స్టూడియోలు ఉన్నాయి. ఇంకా మరి కొన్ని ఫిట్‌నెస్ స్టూడియోలు ప్రారంభించాలనే లక్ష్యంగా ఉన్నాను. వ్యాయామం మొదలుపెట్టిన రోజున ఇవేవీ అప్పుడు అనుకోలేదు. బలం ఎంత అనేది బరువులు ఎత్తడంలో మాత్రమే కాదు మన లోపల ఉన్న శక్తిని గుర్తించాలి. అప్పుడు సవాళ్లను అధిగమించడం కూడా సులువు అవుతుంది. మెరుగైన ఆరోగ్యం, ఫిట్‌నెస్ మనల్ని శక్తి–అభివృద్ధి వైపుగా నడిపిస్తుంది. ఒక్కరోజులో ఏదీ మారదు. మనం ఎంచుకున్న మార్గంలో నిరంతరం కృషి చేస్తుంటే విజయం సొంతం అవుతుంది. శారీరక వ్యాయామం మైండ్‌ను కూడా చురుగ్గా ఉంచుతుంది కాబట్టి వాయిదా వేయకుండా ఈ రోజే దినచర్యలో భాగం చేసుకోండి'' అని వివరించారు ఈ ఫిట్‌నెస్ ట్రైనర్.

– నిర్మలారెడ్డి

ఫొటోలు: నోముల రాజేష్ రెడ్డి

నంబర్ వన్ ట్రైనర్

కత్రీనా కైఫ్, దీపికా పదుకొణె, కరీనా కపూర్.. వంటి ప్రముఖ బాలీవుడ్ తారలకు నంబర్‌వన్ ఫిట్‌నెస్ ట్రైనర్ యాస్మిన్ కరాచీవాలా. జర్మన్ పిలేట్స్ కాన్సెప్ట్‌ను మన దేశంలో మొదటిసారి ప్రవేశపెట్టి, బిఎఎస్‌ఐ సర్టిఫికెట్ పొందింది. ఎన్నో ఫ్యాషన్ అండ్ బ్యూటీ అవార్డ్‌లను సొంతం చేసుకోవడంతో పాటు వరల్డ్ ఉమెన్ లీడర్‌షిప్ అవార్డ్‌ను అందుకున్న ఘనత యాస్మిన్‌ది. స్కల్ప్ట్ అండ్ షేప్, పర్‌ఫెక్ట్ 10 పేరుతో తీసుకొచ్చిన పుస్తకాలు పాఠకులకు ఫిట్‌నెస్ జ్ఞానాన్ని అందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి.

● ముగ్గు-ముచ్చట


కె.అలేఖ్య
మదీనగూడ
హైదరాబాద్


18 చుక్కలు
10 వచ్చేవరకు


9 చుక్కలు
ఎదురు చుక్క 1 వచ్చేవరకు


ఎం. విజయలక్ష్మి
ముంగమూరు డొంక
ఒంగోలు

మీరు ముగ్గులు వేస్తారా? అలా అయితే ముచ్చటైన మీ ముగ్గులను అందమైన రంగులతో కాగితం మీద పెట్టండి. చుక్కల వివరాలు, ఊరు పేరుతో సహా వాటిని మాకు పంపండి. వాటిలో మంచి ముగ్గును మీ ఫొటోతో సహా మేము ప్రచురిస్తాం.

ముగ్గులకు ఆహ్వానం



ముగ్గులు పంపవలసిన చిరునామా
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్–34.
ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com



'అనుకున్న టైమ్‌కి షూటింగ్ పూర్తి కావాల్సిందే... ప్లాన్ తప్పకూడదు' అని హుకుం జారీ చేయాలంటే చేసే పని మీద ప్రేమ, శ్రద్ధ... ఈ రెంటికీ మించి ధైర్యం, ఆత్మవిశ్వాసం లాంటివి కూడా ఉండాలి. ముఖ్యంగా 'మేల్ డామినేటెడ్' ఇండస్ట్రీస్‌లో ఒకటైన సినిమా పరిశ్రమలో 'ఫీమేల్ ప్రొడ్యూసర్' రాణించాలంటే తెగువ కావాలి. అవసరమైనప్పుడు రాణిలా హుకుం జారీ చేయాలి. సున్నితంగా పనులు చక్కబెట్టడంతో పాటు కఠినంగానూ ఉండాలి. అలా రెండు రకాలుగా ఉంటూ... 'మేం రాణిస్తాం' అంటూ ఈ ఏడాది నిర్మాణ రంగంలోకి వచ్చిన కొందరు ఫీమేల్ ప్రొడ్యూసర్ క్వీన్స్ గురించి తెలుసుకుందాం.


● సమంత



మేం రాణిస్తాం

హీరోయిన్‌గా యాభైకి పైగా సినిమాలు చేశారు సమంత. అగ్రశ్రేణి నటిగా ప్రేక్షకులు కితాబులిచ్చారు. ఇప్పుడు 'ట్రాలాలా మూవీంగ్ పిక్చర్స్' అనే నిర్మాణ సంస్థను ప్రారంభించారామె. కొత్త ప్రతిభను ప్రోత్సహిస్తూ, అర్థవంతమైన కథలను ఈ నిర్మాణ సంస్థ వేదికగా ప్రేక్షకులకు చెప్పాలనుకుంటున్నామని సమంత పేర్కొన్నారు.


● విద్య

● ప్రముఖ నిర్మాత 'దిల్' రాజు కుమార్తె హన్షితా రెడ్డి తండ్రి బాటలో నిర్మాత అయ్యారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై 'దిల్' రాజు ఇప్పటికే 50కి పైగా సినిమాలు నిర్మించారు. కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రాల నిర్మాతగా ఆయనకు పేరుంది. ఇక 'దిల్'రాజు ప్రొడక్షన్స్ స్థాపించి 'ఏటీఎమ్' వెబ్ సిరీస్ నిర్మించిన హన్షిత తొలిసారి 'బలగం' సినిమా నిర్మించి, బ్లాక్‌బస్టర్ అందుకోవడంతో పాటు అభిరుచి గల నిర్మాతగా పేరు తెచ్చుకున్నారు. ప్రియదర్శి, కావ్యా కల్యాణ్‌రామ్ జంటగా నటించిన ఈ చిత్రం ద్వారా హాస్యనటుడు వేణు యెల్దండి దర్శకునిగా మారారు. ఈ ఏడాది మార్చి 3న విడుదలైన ఈ సినిమా సూపర్‌హిట్‌గా నిలిచింది. అన్నట్లు.. 'బలగం'కి హర్షిత్ రెడ్డి మరో నిర్మాత. ఇక ఆ మధ్య రెండు చిత్రాలు ఆరంభించిన ఈ నిర్మాతలు మంగళవారం మరో చిత్రాన్ని ఆరంభించారు.

● ప్రముఖ నిర్మాత సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు) కుమార్తె హారిక సూర్యదేవర 'మ్యాడ్' చిత్రంతో నిర్మాతగా పరిచయమయ్యారు. రామ్ నితిన్, సంగీత్ శోభన్, నార్నే నితిన్, శ్రీ గౌరీప్రియా రెడ్డి, అనంతిక సనీల్ కుమార్, గోపికా ఉద్యన్ కీలక పాత్రల్లో నటించారు. కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించిన ఈ మూవీ అక్టోబర్ 6న రిలీజై, హిట్‌గా నిలిచింది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను బాగా నవ్వించింది. తొలి చిత్రంతోనే అభిరుచి ఉన్న నిర్మాత అనిపించుకున్నారు హారిక.

● తండ్రి నిమ్మగడ్డ ప్రసాద్ సక్సెస్‌ఫుల్ బిజినెస్‌మేన్. ఇక కూతురికి సినిమాలంటే ప్యాషన్. ఆ ఇష్టంతో 'మంగళవారం' సినిమాతో నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టి, తొలి విజయం అందుకున్నారు స్వాతీ రెడ్డి. పాయల్ రాజ్‌పుత్ లీడ్ రోల్‌లో అజయ్ భూపతి దర్శకత్వం వహించిన చిత్రం 'మంగళవారం'. స్వాతీ రెడ్డి గునుపాటి, ఎం. సురేష్ వర్మ నిర్మించిన ఈ సినిమా గత నెల 17న విడుదలై హిట్‌గా నిలిచింది.



● మెగా కుటుంబం నుంచి వచ్చిన నిహారిక (నాగబాబు కుమార్తె) అటు నటన, ఇటు ప్రొడక్షన్ రంగంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పటి వరకూ పలు వెబ్ సిరీస్‌లు, షార్ట్ ఫిలింస్ నిర్మించిన ఆమె తొలి సారి ఫీచర్ ఫిల్మ్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ద్వారా యాదు వంశీని దర్శకుడిగా పరిచయం చేస్తున్నారు. అంతేకాదు.. పదకొండు మంది హీరోలు, నలుగురు హీరోయిన్లు పరిచయమవుతుండటం విశేషం. నిహారిక కొణిదెల సమర్పణలో పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మిస్తున్నారు.


● నిహారిక

● శ్రీకాంత్ మేక, రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజ మార్ని దర్శకత్వంలో ఈ చిత్రాన్ని 'బన్నీ' వాసుతో కలిసి విద్యా కొప్పినీడి నిర్మించారు. నవంబరు 24న విడుదలైన ఈ పొలిటికల్, పోలీస్ బ్యాక్‌డ్రాప్ మూవీ హిట్‌గా నిలిచింది.



● నటిగా, గాయనిగా, నర్తకిగా గుర్తింపు తెచ్చుకున్న రాజేశ్వరి చంద్రజ వాడవల్లి నిర్మాతగా మారి, 'కలశ' చిత్రాన్ని నిర్మించారు. భానుశ్రీ, సోనాక్షీ వర్మ, అనురాగ్ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి కొండ రాంబాబు దర్శకుడు. ఈ సినిమా ఈ నెల 15న విడుదలైంది. చిన్న బడ్జెట్ చిత్రమైనా కాన్సెప్ట్ బాగుందనిపించుకుంది.



● పాయల్ సరాఫ్‌కి సినిమా నేపథ్యం లేదు. అయితే నిర్మాత కావాలన్నది ఆమె కల. 'భరతనాట్యం' చిత్రంతో నిర్మాతగా మారారామె. కేవీఆర్ మహేంద్ర దర్శకత్వంలో సూర్యతేజ ఏలే హీరోగా, మీనాక్షీ గోస్వామి హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. ''షూటింగ్ లొకేషన్‌లో అమ్మాయిలు తక్కువగా ఉంటారు. మనం అమ్మాయి అనే విషయాన్ని మరచిపోయి మన పని మనం శ్రద్ధ చేయగలిగితే సక్సెస్ గ్యారంటీ'' అంటున్నారు పాయల్ సరాఫ్.

సినిమా

హనుమంతుడిని మించిన స్టార్ లేరు

– ప్రశాంత్ వర్మ

''హను-మాన్' కంటెంట్ పరంగా పెద్ద సినిమా. మా సినిమాలో స్టార్స్ లేరు. మా దగ్గర ఉన్న ఒకే ఒక్క స్టార్ హనుమంతుడు. ఇంతకంటే పెద్ద స్టార్ ఇండియాలో లేరని నమ్ముతున్నాం. పాన్ ఇండియా కాదు.. పాన్ వరల్డ్ స్టార్‌తో సినిమా చేస్తున్నాం. హనుమంతుడే 'హను-మాన్' సినిమాను మాతో చేయిస్తున్నారని నమ్ముతున్నాం'' అన్నారు ప్రశాంత్ వర్మ. తేజా సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'హను-మాన్'. అమృతా అయ్యర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో వరలక్ష్మీ శరత్‌కుమార్, వినయ్ రాయ్ కీలక పాత్రధారులు. కె. నిరంజన్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం జనవరి 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో తేజా సజ్జా మాట్లాడుతూ– ''ఓ సాధారణ కుర్రాడికి దేవుని ఆశీస్సులతో సూపర్ పవర్స్ వస్తే, ఆ కుర్రాడు చేసే అసాధారణ పనులు ఏంటి? అనేది 'హను-మాన్' చిత్రం'' అన్నారు. ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ –''హను-మాన్' టీజర్ విడుదల తర్వాత సినిమాపై హైప్ వంద రెట్లు పెరిగిపోయింది. ఇక ట్రైలర్ కంటే సినిమా పది రెట్లు అద్భుతంగా ఉంటుంది. తెలుగులో దాదాపు 400 థియేటర్స్‌లో, హిందీలో దాదాపు 1500 థియేటర్స్‌లో మా సినిమా విడుదలవుతుంది. 'హను-మాన్'తో మొదలైన ఈ యూనివర్స్ ఆ తర్వాత 'అధీరా', ఇంకా కొందరు సూపర్ హీరోలని కూడా బిల్డ్ చేశాం. జనవరి 12న 'గుంటూరు కారం' సినిమా విడుదలవుతోంది. మహేశ్‌బాబుగారు నా ఫేవరెట్ స్టార్ హీరో. త్రివిక్రమ్ గొప్ప దర్శకులు. ఆ సినిమాని నేను ఫస్ట్ డే చూస్తాను'' అన్నారు. ''జనవరి 12న థియేటర్స్‌లో కలుద్దాం'' అన్నారు కె. నిరంజన్ రెడ్డి.


● ప్రశాంత్ వర్మ, వరలక్ష్మి, అమృతా అయ్యర్, తేజా సజ్జా, నిరంజన్ రెడ్డి

తొలి సినిమా అనుభూతి కలిగింది

– సుహాసినీ మణిరత్నం

''నా తొలి సినిమా విడుదలై 43 ఏళ్లవుతోంది. 44వ ఏడాదిని 'మహతి' చిత్రంతో ఆరంభిస్తున్నా. తొలి చిత్రం చేస్తున్న అనుభూతితో ఈ సినిమా చేస్తున్నాను'' అన్నారు నటి సుహాసినీ మణిరత్నం. సందీప్ మాధవ్, దీప్శిక జంటగా సుహాసిని కీలక పాత్రలో తెరకెక్కుతున్న చిత్రం 'మహతి'. స్వీయ దర్శకత్వంలో శివ ప్రసాద్ బూర్లె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి పద్మ కెమెరా స్విచ్చాన్ చేయగా, చంద్రమౌళి క్లాప్ కొట్టారు. రాజా రవీంద్ర గౌరవ దర్శకత్వం వహించగా, సుహాసిని స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందించారు. శివ ప్రసాద్ బూర్లె మాట్లాడుతూ– ''సుహాసినిగారు, సందీప్‌లకు ఈ కథ చెప్పిన వెంటనే ఒప్పుకున్నారు. వారితో పాటు నా టీమ్ నమ్మకాన్ని నిలబెడతాననే నమ్మకం ఉంది'' అన్నారు. ''ఈ చిత్రంలో నా పాత్రలో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయి'' అన్నారు సందీప్ మాధవ్. ఈ చిత్రానికి సంగీతం: శేఖర్ చంద్ర.


● సుహాసిని, దీప్శిక, సందీప్ మాధవ్, శివప్రసాద్

కొత్త ప్రారంభం

'కలర్ ఫోటో' ఫేమ్ సుహాస్, సంకీర్తనా విపిన్ జంటగా సందీప్ రెడ్డి బండ్ల దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుంది. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది.


● సుహాస్, సంకీర్తనా విపిన్, ప్రశాంత్ నీల్

తొలి సీన్‌కి దర్శకుడు అనిల్ రావిపూడి కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు ప్రశాంత్ నీల్ క్లాప్ ఇచ్చారు. దర్శక–నటుడు 'బలగం' వేణు గౌరవ దర్శకత్వం వహించారు. ''త్వరలో ఈ చిత్రం గురించి మరిన్ని వివరాలు వెల్లడిస్తాం'' అని యూనిట్ పేర్కొంది. రాజేంద్ర ప్రసాద్, 'వెన్నెల' కిశోర్, మురళీ శర్మ నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బుల్గానిన్.

పొలిటికల్ డ్రామా ప్లాన్ చేస్తున్నాం

– నిర్మాత యశ్వంత్ దగ్గుమాటి


● యశ్వంత్, శ్రీరామ్, సాయికిరణ్

''సినిమా బాగుంటే చిన్న సినిమా అయినా ప్రేక్షకులు థియేటర్లకు వస్తారని మా 'పిండం' మరోసారి రుజువు చేసింది. మా కళాహి మీడియా బ్యానర్‌లో వచ్చిన తొలి సినిమా 'పిండం' హిట్ అయింది. ఈ మూవీ దర్శకుడు సాయికిరణ్‌తోనే మా ద్వితీయ సినిమాను పొలిటికల్ డ్రామాగా నిర్మిస్తాం'' అని యశ్వంత్ దగ్గుమాటి అన్నారు. శ్రీరామ్, ఖుషీ రవి జంటగా సాయికిరణ్ దైదా దర్శకత్వం వహించిన చిత్రం 'పిండం'. యశ్వంత్ దగ్గుమాటి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 15న విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన విజయోత్సవ సభలో శ్రీరామ్ మాట్లాడుతూ–''పదిహేనేళ్ల తర్వాత 'పిండం'తో నాకు సోలో విజయాన్ని అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అన్నారు.

దుబాయ్‌లో గామా అవార్డ్స్


● వీఎస్ ఆదిత్య, కోటి, శ్రీలేఖ

''దుబాయ్‌లో మార్చి 3న 'గల్ఫ్ తెలుగు సినీ అవార్డ్స్' (గామా అవార్డ్స్) వేడుకను ఘనంగా నిర్వహించనున్నాం'' అని 'గామా' అవార్డ్స్ చైర్మన్ కేసరి త్రిమూర్తులు అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ– ''2024 మార్చి 3న నిర్వహించనున్న గామా అవార్డ్స్‌లో అల్లు అర్జున్‌కి 'గామా నేషనల్ ఐకాన్ అవార్డ్' అందిస్తాం. 2021, 2022, 2023 సంవత్సరాల్లోని ఉత్తమ చిత్రాలు, నటులు, దర్శకులు, సంగీతం.. వంటి విభాగాల్లో ఈ అవార్డ్స్ అందజేస్తాం'' అన్నారు. ''ఈ అవార్డు వేడుకకు పలువురు దర్శకులు, నిర్మాతలు, నటీనటులు, సంగీత దర్శకులు హాజరవుతారు'' అన్నారు 'గామా' అవార్డ్స్ జ్యూరీ సభ్యుడు, గౌరవ సలహాదారుడు, దర్శకుడు వీఎస్ ఆదిత్య. ''గామా అవార్డ్స్ ఆస్కార్ స్థాయికి చేరుకోవాలి'' అన్నారు జ్యూరీ చైర్మన్, సంగీత దర్శకుడు కోటి. ''గామా' అవార్డ్స్ దర్శకుడు ప్రసన్న పాలంకి, జ్యూరీ సభ్యురాలు, సంగీత దర్శకురాలు ఎంఎం శ్రీలేఖ పాల్గొన్నారు.



ప్రతి ఉదయం మనం కొత్తగా జన్మిస్తాం.
ఈ రోజు మనం ఏం చేస్తామనేదే అత్యంత ముఖ్యం.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 20 డిసెంబర్ 2023

ఇదేమి ప్రజాస్వామ్యస్ఫూర్తి?!

ప్రజాస్వామ్యానికి దేవాలయం లాంటి పార్లమెంట్‌లో చరిత్రలో మునుపెన్నడూ లేనంత పెద్ద సంఖ్యలో సస్పెన్షన్ల పర్వం సాగుతోంది. ఈ నెల 13న పార్లమెంట్‌లో జరిగిన భద్రతా వైఫల్య ఘటనపై కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా సభలో ప్రకటన చేయాలనీ, చర్చ జరగాలనీ ప్రతిపక్షాలు పట్టుబట్టడం రచ్చగా మారింది. సభా వ్యవహారాలకు అడ్డుతగులుతున్నా రనీ, అభ్యంతరకరంగా ప్రవర్తిస్తున్నారనీ అంటూ ఇప్పటికి 141 మంది ప్రతిపక్ష ఎంపీలను సభ నుంచి సస్పెండ్ చేయడం నిర్ఘాంత పరుస్తోంది. అధికార పార్టీ ఎంపీ సిఫార్సు పాసులతో సందర్శకులుగా వచ్చిన ఆగంతకుల రంగు పొగల హంగామాపై అధికారపక్షాన్ని ఇరుకున పెట్టాలని విపక్షం చూస్తుంటే, గత సంప్రదాయాలకు విరుద్ధంగా సభలో కాక బయట వివిధ పత్రికలు, టీవీ ఛానళ్ళలో ప్రధాని, హోమ్ మంత్రి జరిగిన సంఘటనపై స్పందిస్తూ ప్రతిపక్షాల డిమాండ్‌ను పెడచెవిన పెట్టడం చర్చనీయాంశమైంది.

గత వారం 14 మంది, ఈ సోమవారం 78 మంది, తాజాగా మంగళవారం మరో 49 మంది... మొత్తం ఇప్పటికి 141 మంది ప్రతిపక్ష ఎంపీలపై సస్పెన్షన్ వేటుపడింది. పార్లమెంట్‌లో సభా వ్యవహారాలకు అడ్డుపడిన సభ్యుల సస్పెన్షన్ కొత్తేమీ కాదు. ఇలా ఇంత సంఖ్యలో సస్పెన్షన్ల పర్వం సాగడం మాత్రం ఇదే తొలిసారి. దాదాపు మూడున్నర దశాబ్దాల క్రితం ఎన్నడో 1989 మార్చిలో థక్కర్ ప్యానెల్ నివేదికపై రచ్చతో ఒకే రోజున లోక్‌సభలో 63 మంది సభ్యులను సస్పెండ్ చేసినట్టు చరిత్ర. ఇప్పుడు ఆ పాత రికార్డును చెరిపేస్తూ, దురదృష్టకరమైన కొత్త చరిత్ర లిఖితమైంది. సభాధ్యక్ష స్థానంలో ఉన్న వ్యక్తికి సభ్యులను సస్పెండ్ చేసే అధికారమున్న మాట నిజమే. కానీ, ఆ స్థానంలో కూర్చొనే వ్యక్తి ప్రథమ కర్తవ్యం – అధికార, ప్రతిపక్షాల మధ్య సమతూకం పాటిస్తూ సభను సజావుగా నడపడమే తప్ప, సభ్యులపై పెత్తనం చూపడం కానే కాదు. ఆ సంగతి మర్చిపోయి సభలో వారందరికీ పెద్దన్నయ్యలా ప్రవర్తిస్తామంటేనే కష్టం. ప్రస్తుతం జరుగుతున్నదదే!

నిరుద్యోగం సహా వివిధ సమస్యలపై దృష్టి పడేటందుకే పార్లమెంట్‌లో గతవారం అలా అలజడి రేపామని పట్టుబడ్డ ఆగంతకుల కథనం. ఆ ఆందోళనకారుల ఆలోచనలు ఏమైనప్పటికీ, వారు పొగ గొట్టాలతో పార్లమెంటులోకొచ్చే వీలు కల్పించి, సభ్యుల ప్రాణాల్ని ప్రమాదంలోకి నెట్టిన భద్రతా లోపంపై తక్షణం చర్చ జరగాల్సి ఉంది. అత్యవసరంగా చర్యలు చేపట్టాల్సి ఉంది. విపక్షాల వాదనా అదే. ఆ వాదనలో న్యాయం ఉంది. ఘటనపై సభలో రక్షణ మంత్రి లాంటి వారు కాక శాంతి భద్రతలు చూసే హోమ్ మంత్రి, సభానాయకుడు ప్రకటన చేయడం, సభ్యుల అనుమానాలను నివృత్తి చేయడం విధాయకం కూడా! కానీ అలా జరగట్లేదు. అక్కడే పీటముడి బిగిసింది. అనైతికత అంటూ ప్రతిపక్ష ఎంపీ మహువా మొయిత్రాపై చర్యలకు వేగిరపడ్డ పాలకులు, ఆగంతకులకు పాసులిచ్చిన స్వపక్షీయుడిపై చర్యకు ముందుకు రాకపోవడం ద్వంద్వ ప్రమాణాలంటూ విమర్శలకు తావిచ్చింది.

అయితే, సభను సజావుగా సాగనివ్వకుండా ప్రతిపక్షాలు మొండిగా వ్యవహరిస్తున్నాయని అధికార పక్ష ఆరోపణ. అది పూర్తి సత్యదూరమనలేం. కానీ, దాన్ని సాకుగా చూపుతూ సభలో సాధారణ ప్రకటన చేయడానికి కూడా అమాత్యులకూ, ప్రభుత్వానికీ అభ్యంతరం ఉంటే అది పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అనిపించుకోదు. సభావ్యవహారాలను అడ్డుకోవడం సైతం సభ్యుల హక్కులలో భాగమేనని బీజేపీ ఎంపీ స్వర్గీయ అరుణ్ జైట్లీయే ఒకప్పుడు వ్యాఖ్యానించడం గమనార్హం. కానీ, అధికార పీఠంపై కూర్చున్నాక బీజేపీ ఆ పాత వైఖరిని నమ్ముతున్నట్టు లేదు. చర్చలు, భిన్నాభిప్రాయాల కలబోతతో సాగాల్సిన పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని పాలకుల ఏకపాత్రాభినయంగా మార్చాలని చూస్తున్నట్టుంది. ఎన్నికల సంఖ్యాబలపు నియంతృత్వంతో అధికారాన్ని హక్కుభుక్తంగా భావిస్తే అది గర్హనీయం. ప్రతిపక్షాలకున్న ప్రశ్నించే హక్కును కాదంటే, వాటి మాట వినాల్సిన పనే లేదనుకుంటే ఇక సభా సమావేశాలకు అర్థం ఏముంది!

నేటి ప్రధాని గతంలో గుజరాత్‌ను ఏలినప్పుడూ, నిరసన తెలిపే ప్రతిపక్షాలపై నిర్దాక్షిణ్య సస్పెన్షన్ల పర్వం ఇలాగే సాగిందని పండితులు లెక్కలు తీస్తున్నారు. ఒకప్పుడు కొన్ని రాష్ట్రాల్లోనే కనిపించే ఈ ధోరణి ఇప్పుడు పార్లమెంటుకు పాకడం విచారకరం. 2009–14 మధ్య దాదాపు 36 సస్పెన్షన్లు జరిగితే, ఎన్డీఏ ఏలుబడి వచ్చాక 2014–19లో అది 81కి ఎగబాకింది. ఇక, కేంద్రంలో వర్తమాన ప్రభుత్వ హయాంలో సస్పెన్షన్లు 149కి చేరాయి. ఇక, తాజా సస్పెన్షన్ల వల్ల ప్రస్తుత శీతకాల సమావేశాల్లో ప్రతిపక్ష 'ఇండియా' కూటమిలో మూడింట రెండొంతుల పైగా సభ్యులు సభ వెలుపలికే పరిమితమైన పరిస్థితి. కొన్నేళ్ళుగా అనేక కీలక బిల్లులు చర్చే లేకుండా, అవసరమైన సవరణల్ని పట్టించుకోకుండా సంఖ్యాబలంతో చట్టాలవుతున్న తీరు పార్లమెంటరీ విధానాన్నే ప్రశ్నిస్తున్నాయి.

ఇక, ప్రతిపక్ష సభ్యులు పార్లమెంట్ వెలుపల మంగళవారం నిరసన వ్యక్తం చేస్తున్నప్పుడు ఓ ప్రతిపక్ష ఎంపీ ప్రవర్తించిన తీరు బాగా లేదు. రాజ్యసభ ఛైర్మన్‌ను అనుకరిస్తూ ఆ సభ్యుడు చేసిన ప్రహసనం సమర్థనీయం కాదు. ఇది 'డెమోక్రసీ' కాదు, 'నమోక్రసీ' అంటున్న ప్రతిపక్షాల పోరుకు శోభనిచ్చేదీ కాదు. వ్యక్తిగత ప్రవర్తనలో లోపాలు, పక్షపాత ధోరణులు ఎన్ని ఉన్నా... రాజ్యాంగ రీత్యా రాజ్యసభ ఛైర్మనైన భారత ఉపరాష్ట్రపతి హోదాకంటూ ఓ గౌరవం ఉంది. పార్టీలతో సంబంధం లేకుండా అందరూ ఆ గౌరవం ఇవ్వాల్సి ఉంది. అది మరిచి అగౌరవంగా ప్రవర్తిస్తే ప్రతిపక్షాలకే నష్టం. పోరాటాన్ని అది పలుచన చేస్తుంది. అసలు సంగతి పక్కదోవ పడుతుంది. ఏమైనా, చర్చలంటే టీవీలో ప్రసంగాల స్థాయికి దించేస్తూ, ప్రజాసమస్యల్ని గాలికొదిలేసే సభలతో ప్రయోజనం శూన్యం. ప్రతిపక్షాలే లేని పాలన కావాలనుకుంటే దానికి ప్రజాస్వామ్యమని పేరెందుకు?

న్యాయమూర్తినీ వదలని వేధింపులు!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

జిల్లా జడ్జి తనను లైంగికంగా వేధిస్తున్నాడనీ, అనుమతిస్తే గౌరవంగా చనిపోతాననీ ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ మహిళా జడ్జి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయడం కలకలం రేపింది. అసలు దేశవ్యాప్తంగా మహిళలపైన నేరాలు పెరగడం చూస్తున్నాం. మహిళలపై అత్యాచారాలకు కారణం – వారి పట్ల భారత సమాజ దృక్పథమే. అయితే, ఒక మహిళా న్యాయమూర్తి లాంటి ప్రసిద్ధురాలినే వేధింపులు దుర్భర మానసిక స్థితి వైపు నెట్టాయంటే సామాన్య స్త్రీల పరిస్థితి ఏమిటి? విచిత్రమేమంటే, సరికొత్త ఉదారవాద ఆర్థిక యుగంలో తిరిగి పాత తరహా పురుషాధిక్య ధోరణులు ప్రబలిపోతున్నాయి. నేటి ఈ అవాంఛనీయ పరిస్థితులలో కావలసింది సమాజంలో స్త్రీ ప్రతిపత్తిని పెంచగల రాజకీయ విధానాలు, కార్యక్రమాలు!

"ఏ పౌరుడూ మరొక పౌరుణ్ణి కొన గలిగినంత ధనవంతుడుగా ఉండకూడదు. అలాగని ఏ పౌరుడూ తనను తాను అమ్ముకోవలసినంత పేదవానిగానూ ఉండకూడదు."

– రూసో మహాకవి, తాత్విక మేధావి

"తనను జిల్లా జడ్జి లైంగికంగా వేధిస్తున్నాడనీ, అనుమతిస్తే గౌరవంగా చనిపోతాననీ ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ మహిళా జడ్జి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్‌కు లేఖ రాయడం దేశంలో కలకలం రేపింది. ఈ వ్యవహారాన్ని దేశ ప్రధాన న్యాయమూర్తి సీరియస్‌గా తీసుకొని అలహాబాద్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను విచారణకు ఆదేశించారు. "ఇక నాకు ఏమాత్రం జీవించాలని లేదు. నిర్జీవమైన ఈ శరీరాన్ని మోయడం నిష్ప్రయోజనం. నా జీవితాన్ని గౌరవప్రదంగా ముగించుకోవడానికి అనుమతించండి" అని మహిళా జడ్జి తన లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖ సుప్రీం చీఫ్‌ను కదిలించి వేసిన ఫలితంగా తక్షణ చర్యలకు ఆదేశించారు."

– 16.12.2023 నాటి పత్రికా వార్తలు

ఇలాంటి 'వేధింపుల పర్వం' ఇంతకుముందూ జరిగిందని మరచి పోరాదు. నైతికంగా బలహీనుడైన ఒక మాజీ ప్రధాన న్యాయమూర్తి కార్యాలయంలోనే పనిచేస్తున్న ఒక స్త్రీ అధికారిని రకరకాల వేధింపులకు గురిచేసి, ఆమె లొంగకపోయే సరికి, ఆమెనూ, ఆమె కుటుంబ సభ్యులనూ ఎన్ని రకాల బాధలు పెట్టిందీ లోకం మరచిపోలేదు. అలాంటి నైతిక బలహీనతలు లేనందుననే ప్రస్తుత సుప్రీం ప్రధాన న్యాయమూర్తి హోదాలో జస్టిస్ చంద్రచూడ్ ఉత్తరప్రదేశ్ మహిళా న్యాయమూర్తి పట్ల జరిగిన వేధింపుల కేసుపై తక్షణ విచారణకు ఆదేశించారు.

గవర్నర్ల తీరు

ఇదిలా ఉంచి, బీజేపీ–ఆరెస్సెస్ నాయకత్వ పాలన ఎలా ఉందో చూడండి: వారి విధానాలను అడ్డుకునే లేదా విమర్శించే రాష్ట్ర ప్రభుత్వాలను అదుపులో ఉంచగల తమ పార్టీ గవర్నర్లకు మాత్రమే రాజ్యాంగ విరుద్ధ చర్యలకు పాల్పడే అధికారాలు అప్పగించారు. ఇందుకు పక్కా ఉదాహరణలు – కేరళ, తమిళనాడు గవర్నర్లు తీసుకుంటున్న నిర్ణయాలు! రాజ్యాంగంలోని 200 అధికరణకు ఇచ్చిన తొలి వివరణ ప్రకారం, శాసనసభ చర్చలో ఉన్న బిల్లులను ఆమోదించడమో లేదా తిరస్కరించడమో శాసనసభ నిర్ణయం. అంతేగానీ ఆ హక్కు గవర్నర్‌కు లేదు. కానీ ఇప్పుడు బీజేపీ గవర్నర్లు తమ అసాధారణ అధికారాలు చెలాయిస్తూ శాసనసభ బిల్లులను తొక్కి పెడుతున్నారు. కానీ, బిల్లును ఆమోదించగల లేదా తిరస్కరించగల అధికారం ప్రజలు ఎన్నుకున్న శాసనసభకు లేకుండా చేసే పెత్తనం

రెండో మాట



గవర్నర్‌కు లేదు. ఒక వేళ ఏ కారణం చేతనైనా బిల్లును ఆమోదించ నిరాకరించే పక్షంలో 'తిరిగి పరిశీలించండి' అన్న విజ్ఞప్తితో శాసన సభకు నివేదించాలేగానీ, బిల్లులను తొక్కిపెట్టే అధికారం మాత్రం గవర్నర్‌కు లేదని సుప్రీం ప్రధాన న్యాయమూర్తి కరాఖండీగా ప్రకటించాల్సి వచ్చింది. ఆ అధికారం ప్రజలు ఎన్నుకొనని గవర్నర్లకు లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

ప్రసిద్ధులకే ఇలా ఉంటే...

అంతేగాదు, పంజాబ్ శాసనసభ కేసులో సుప్రీంకోర్టు బిల్లులను తొక్కిపెట్టి ఉంచే అధికారం గవర్నర్లకు లేదని స్పష్టం చేయడంతో రాజ్యాంగంలోని 200 అధికరణకు ఆచరణలో విలువ పెరిగింది. ఇదే సూత్రం రాష్ట్రపతికీ వర్తిస్తుంది. లోక్ సభ మాజీ ప్రధాన కార్యదర్శి పి.డి.టి. ఆచారి చెప్పినట్టు, ఒక చట్టం రాజ్యాంగబద్ధత సరైనదా, కాదా అన్నది కోర్టు నిర్ణయించాల్సిందే గానీ, ఆ విషయంపై ఇటు రాష్ట్రపతికీ, అటు గవర్నర్లకూ ఎలాంటి నిర్ణయాధికారం లేదు. అయితేనేమి, పాలకులు రాజ్యాంగం పట్ల గౌరవం ఉన్నట్టు నటించడమేగానీ దాని విలువలను ఆచరణలో పాటించడంలో నడుపుకొనేవి 'సొంత దుకాణాలే'నని మరవరాదు.

ఈ పరిస్థితులలో ఒక్క మహిళా న్యాయమూర్తులపైననే కాదు, అసలు దేశ మహిళలపైననే నేరాల సంఖ్య పెరిగిపోవడం చూస్తున్నాం. 2022వ సంవత్సరానికి నేషనల్ క్రైమ్స్ బ్యూరో ప్రకటించిన వివరాలను బట్టి మహిళలపైన ఇంతకుముందు కంటే నేరాల సంఖ్య పెరిగిపోయింది. పైగా, పెక్కు రాష్ట్రాలలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు పక్కన తమ మగ బంధువుల తోడు లేకుండా తాముగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదులు చేసుకోలేని స్థితి. మహిళలపై నేరాల సంఖ్య 4 శాతంపైన పెరిగిందని క్రైమ్స్ బ్యూరో నివేదిక. ఇవిగాక భర్తలు, వారి బంధువులు చేసిన నేరాల సంఖ్య 2022లో 4.45 లక్షలు. అంటే, ప్రతి గంటకూ 51 కేసులు రికార్డయ్యాయి.

మరీ విచిత్రమేమంటే, 'సరికొత్త ఉదారవాద ఆర్థిక యుగంలో తిరిగి పాత తరహా పురుషాధిక్య ధోరణులు ప్రబలిపోతున్నా'యని జాతీయ మహిళా సంస్థ 'జాగోరి' డైరెక్టర్ జయశ్రీ వేలంకర్ వివరించారు. నేటి ఈ అవాంఛనీయ పరిస్థితులలో కావలసింది సమాజంలో స్త్రీ ప్రతిపత్తిని పెంచగల రాజకీయ విధానాలు, కార్యక్రమాలని ఆమె అన్నారు. మహిళల రక్షణకు ఉద్దేశించిన కఠిన చర్యలు కాగితం మీదనే ఉండి పోయాయిగానీ ఆచరణలో లేవనీ, దీన్ని బట్టి సంప్రదాయంగా స్త్రీలపై అత్యాచారాలు పెరుగుతూ ఉండటానికి అసలు కారణం – స్త్రీల పట్ల భారత సమాజ దృక్పథమేననీ సుప్రీంకోర్టు ప్రసిద్ధ మహిళా న్యాయ వాది శిల్పి జైన్ స్పష్టం చేస్తున్నారు. ఎందుకంటే, ఉత్తరప్రదేశ్ మహిళా న్యాయమూర్తి లాంటి ప్రసిద్ధురాలినే వేధింపులు దుర్భర మానసిక స్థితివైపు నెట్టాయంటే సామాన్య స్త్రీల విషయంలో గణింపునకు రాని, వచ్చినా పట్టించుకోని సమాజ స్థితిగతుల్ని అర్థం చేసుకోగలగాలి.

మాంస వ్యాపారం

నా మిత్రుడు, సుప్రసిద్ధ లాయర్ హనుమారెడ్డి మతాలు – చట్టాల గురించి ముచ్చటిస్తూ మరవరాని రెండు మంచి మాటలు చెప్పాడు: "మతాలు రాజ్యమేలినప్పుడు చట్టం ఒక పద్ధతిగానూ, రాచరికం రాజ్యమేలినప్పుడు చట్టం మరొక పద్ధతిలోనూ, వ్యాపారం రాజ్యమేలినప్పుడు వేరొక పద్ధతిలోనూ ఉండి ప్రజలకు సంబంధించిన విధివిధానాలు మారుతూ వచ్చాయి. స్థూలంగా చెప్పాలంటే నేరాలు రెండు విధాలుగా ఉండాలి. ఒకటి రాజ్యాధికారం పట్ల నేరం, రెండవది ప్రజలపట్ల నేరం."

అలాగే, 'ప్రేమ' అనే పేరిట ఎంత ప్రమాదకర పరిణామాలు, విధ్వంసం జరుగుతున్నాయో మందరపు హైమవతి తన 'నీలి గోరింట' కవితలో ఇలా చీల్చి చెండాడవలసి వచ్చింది:

"తండ్రీ, కూతురు, గురువు, శిష్యురాలు
వావివరసల్లేకుండా
ఆడపిల్లలే అంగడి సరుకులైనప్పుడు
మానవ మాంస వ్యాపారంలో
మహిళల శరీరాలే పెట్టుబడి ఐనప్పుడు
ఋష్యశృంగుడైనా మేనకను చూచిన
విశ్వామిత్రునిలా మారిపోడా?!"

అలా మారిపోకూడదనే ఉత్తరప్రదేశ్ మహిళా న్యాయమూర్తికి జరిగిన సంఘటన నేపథ్యంలో సుప్రీం ప్రధాన న్యాయమూర్తి పదేపదే చేస్తున్న విజ్ఞప్తుల పరంపర లక్ష్యం!

abkprasad2006@yahoo.co.in

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

తప్పని నిరసన



ఇటీవలి భద్రతా వైఫల్యం మీద చర్చ జరగాలంటూ ప్లకార్డు పట్టుకొని దాదాపు నా 15 ఏళ్ల పార్లమెంటరీ కెరియర్‌లో నేను కూడా మొదటిసారి పార్లమెంటు సభా మధ్యంలోకి ప్రవేశించాను. ప్రభుత్వం నుంచి జవాబుదారీతనం డిమాండ్ చేసినందుకు సస్పెండైన నా కాంగ్రెస్ సహచరులకు సంఘీభావంగా అలాచేశా.

– శశి థరూర్, లోక్‌సభ ఎంపీ

తగని అగౌరవం



ఛైర్‌పర్సన్, స్పీకర్ స్థానంలోకి వెళ్ళాక ఒక పార్టీకి చెందిన వారు కాదు. వాళ్లు పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తారు. వారి పట్ల వ్యంగ్యం చూపడం అగౌరవించడమే. ప్రభుత్వం నుంచి ప్రకటన రావాలనే న్యాయమైన డిమాండ్ ప్రతిపక్షం దగ్గర ఇప్పటిదాకా ఉంది; కానీ దీనితో వాళ్లు ఆటలో ఓడారు.

– పల్లవీ ఘోష్, జర్నలిస్ట్

అసలు నిజం



దళితుల దురవస్థల మీద తమ కెరియర్‌ను నిర్మించుకున్న దళిత నాయకులు నా పట్ల కొత్త అబద్ధాన్ని వ్యాపింపజేస్తున్నారు. దళితులు ఎప్పటికీ మురికిలో, పేదరికంలో ఉండాలని నేను కోరుకుంటున్నానట! అబద్ధాలు. రిజర్వేషన్ల కంటే స్వేచ్ఛా మార్కెట్ అనేది దళితుల్ని మరింత పైకి తెస్తుందని మాత్రమే నేను నమ్ముతానన్నది నిజం.

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

అంతా అక్కడికే...



అసలైన రథయాత్రి, అయోధ్య మందిర నాయకుడు (అద్వాణీ) రామమందిర ప్రారంభోత్సవంలో ఇప్పుడు అక్కర్లేని మనిషి. 'నవ భారత' పాలకుల చేతిలో నిజంగానే మార్గదర్శక మండలికి పరిమితమయ్యారు. తనకు తోడుగా శివరాజ్, వసుంధర, ఇంకా త్వరలో గడ్కరీ, రాజ్‌నాథ్‌ల కోసం ఆయన ఎదురుచూస్తున్నారు.

– ప్రశాంత్ భూషణ్, న్యాయవాది

ఎలా?



ఒక డీఎంకే సీనియర్ నాయకు డికి (క. పొన్ముడి) అవినీతికి శిక్ష పడటం ఇదే మొదటిసారా? అదే నిజమైతే, చాలామంది చాలా మొత్తానికి చాలా కాలం తప్పించుకోవడం గొప్ప విషయమే!

– సుమంత్ రామన్, యాంకర్

గణిత ఘనాపాఠి

అపారమైన మేధస్సుతో భారతదేశ కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగరవేసిన మహా గణితవేత్త శ్రీనివాస రామానుజన్. ఒక సాధారణ సంప్రదాయ కుటుంబంలో 1887 డిసెంబర్ 22న తమిళనాడు ఈరోడ్‌లో జన్మించారు. చిన్న వయసులోనే 'ఏ సంఖ్య అయినా అదే సంఖ్యతో భాగిస్తే ఒకటి వస్తుంది' అని సార్వత్రీకరించిన ఉపాధ్యాయుని 'సున్న ను సున్న తో భాగిస్తే ఒకటి వస్తుందా?' అనే ప్లేస్టోర్ ప్రశ్న వేసి ఆశ్చర్య పరిచాడు. ఇప్పటికీ దీనికి సమాధానం లేకపోవడం గమనార్హం.

1903వ సంవత్సరంలో కార్ రచించిన 'ఏ సినాప్సిస్ ఆఫ్ ఎలిమెంటరీ రిజల్ట్స్ ఇన్ ప్యూర్ మాథెమాటిక్స్' అధ్యయనంతో రామానుజన్ గణిత ఆలోచనలు కొత్త మలుపులు తిరిగాయి. ఆ పుస్తకంలో అనేక క్లిష్టమైన సిద్ధాంతాలను రామానుజన్ స్వయంగా సాధించడం విశేషం. రామానుజన్ చూపిస్తున్న గణిత ప్రజ్ఞను గమనించి మద్రాస్ యూనివర్సిటీ నెలకు 75 రూపాయల స్కాలర్‌షిప్ మంజూరు చేసింది. కుంభకోణం ప్రభుత్వ కాలేజీలో ఎఫ్ఏలో చేరాడు. గణితమే సర్వస్వంగా ఉండి మిగతా సబ్జెక్ట్‌లు నిర్లక్ష్యం చేయడంతో ఎఫ్ఏ పరీక్ష పూర్తి కాలేదు. 1909, జూలై 14న జానకి అమ్మాళ్‌తో వివాహం జరిగింది. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా రామానుజన్ జీవనోపాధి కోసం పోర్ట్‌లో నెలకు ఇరవై రూపాయల జీతంతో గుమస్తాగా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. 1913లో ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త డా॥ వాకర్... మద్రాస్ యూనివర్సిటీ నెలకు 75 రూపాయలు ఉపకార వేతనం ఇచ్చేలా సిఫారసు చేశారు. అదే సమయంలో రామానుజన్ తన పరిశోధనలను కేంబ్రిడ్జిలో ప్రముఖ గణిత ప్రొఫెసర్ జీహెచ్ హార్డీకి పంపించారు.



శ్రీనివాస రామానుజన్

హార్డీ కృషితో రామానుజన్ 1914 మార్చి 17న ఇంగ్లాండ్ కేంబ్రిడ్జి యూనివర్సిటీలో చేరారు. ఆరేళ్ల కాలంలో 32 పరిశోధనా పత్రాలను సమర్పించారు. తక్కువ కాలంలోనే 'ఫెలో ఆఫ్ ద రాయల్ సొసైటీ', 'ఫెలో ఆఫ్ ద ట్రినిటీ కాలేజ్' గౌరవాలను పొందారు. రామానుజన్ 'మేజిక్ స్క్వేర్', 'మాక్ తీటా ఫంక్షన్స్', 'నంబర్ థియరీ', 'స్ట్రింగ్ థియరీ' వంటి వాటిపై అనేక పరిశోధనలు చేశారు. 'గణిత శాస్త్రానికి నేను రామానుజన్‌ను కనుగొనడం నా గొప్ప పరిశోధన' అని హార్డీ పేర్కొనడం విశేషం. అనారోగ్యంతో 1920, ఏప్రిల్ 26న చిన్నవయసులోనే తుది శ్వాస విడిచారు. మనవాళ్లు గణితంలో సరికొత్త ఆవిష్కరణలతో రాణించడమే ఆయనకిచ్చే అసలైన నివాళి.

– తోటకూర సాయి రామకృష్ణ; గణిత అవధాని, సామర్లకోట
(డిసెంబర్ 22న శ్రీనివాస రామానుజన్ జయంతి)

తండ్రి స్వప్నాన్ని నిజం చేసిన తనయుడు

అభిప్రాయం



భండారు
శ్రీనివాసరావు

వైఎస్. రాజశేఖర రెడ్డి పేదల ఆరోగ్యం గురించి ఒక బృహత్తరమైన కలకంటూ అది పూర్తిగా నెరవేరక ముందే అర్ధంతరంగా నిష్క్రమించారు. దాన్ని ఆయన కుమారుడు, ఏపీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి నెరవేర్చారు.

ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి సామాన్య ప్రజలకోసం 'ఆరోగ్య శ్రీ' పేరుతో ఒక బృహత్తర కార్యక్రమానికి రూపకల్పన చేశారు. సామాన్యులకు అందని ద్రాక్షగా ఉన్న కార్పొరేట్ స్థాయి వైద్యం వారికి అందుబాటులోకి తెచ్చిన పథకమే ఆరోగ్య శ్రీ. అందులో భాగంగానే అత్యవసర సమయాల్లో, పిలుపు అందగానే రయ్యిమని వచ్చి ప్రమాదాల్లో చిక్కుకున్నవారిని సకాలంలో ఆసుపత్రులకు చేర్చి వారి ప్రాణాలు కాపాడడానికి ఉద్దేశించిన '108 అంబులెన్స్ సర్వీసు', ప్రజల వద్దకే వెళ్లి రోగనిర్ధారణ పరీక్షలు చేసి అవసరమైన మందులు అక్కడికక్కడే ఉచితంగా ఇచ్చే '104 సర్వీసు'లు. వీటిని వైఎస్ చాలా ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తూ... ఈ పథకాల ద్వారా ఎలాంటి పరిపూర్ణ ఫలితాలు రాబట్టాలని కల కన్నారో, ఆ స్వప్నం సాకారం కాకుండానే హెలికాప్టర్ ప్రమాదంలో కన్ను మూశారు. ఆయన కన్న కలను నిజం చేసే మహత్తర అవకాశం, వైఎస్ మరణించిన పదేళ్ల తర్వాత 2019లో విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయినప్పుడు జగన్ మోహన్ రెడ్డికి లభించింది.

ముందు వైఎస్ కన్న కల ఎలాంటిదో చెప్పుకుందాం. రోడ్లు విశాలంగా ఆధునికంగా తయారవుతున్నప్పుడు వాటిపై ప్రయాణించే వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు కూడా పెరుగుతాయి. జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రమాదాలకు గురయి కొనప్రాణంతో కొట్టుమిట్టాడుతూ, అమృత ఘడియల్లో (వైద్య పరిభాషలో గోల్డెన్ అవర్స్) అవసరమైన వైద్యసాయానికి నోచుకోకుండా ఏటా వందల వేల సంఖ్యలో, కలిగినవారు లేనివారు అనే తేడాలేకుండా మృత్యువాత పడుతున్నారు. ఇలాంటి వారికి ప్రాణభిక్ష పెట్టేదే 108 అంబులెన్స్ సర్వీసు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మూడు మైళ్ళ దూరంలో నివసించే పేదవారికి కార్పొరేట్ వైద్యం సంగతి సరే, సాధారణ వైద్యం కూడా అందని మావే. షుగర్, బీపీ వంటి రోగాలు వారి శరీరంలో దూరిన సంగతి కూడా వారికి తెలియదు. ఎందుకంటే వారు తమ జీవితంలో ఎన్నడూ ఆరోగ్య పరీక్షలు చేయించుకుని ఎరుగరు కాబట్టి. అవి ముదిరి పక్షవాతం, గుండెజబ్బులకు దారితీసినప్పుడు కానీ పరిస్థితి తమ చేయిదాటి పోయిందనే ఎరుక వారికి కలగదు. ఈ నేపథ్యంలో కలిగిన ఆలోచన 104 సర్వీసు.

జబ్బులు, రోగాలు చెప్పిరావు. వచ్చిపడిన తరువాత తల తాకట్టు పెట్టయినా వైద్యం చేయించాల్సిన పరిస్థితి. చాలీ చాలని ఆదాయాలతో రోజులు గడిపేవారికి ఆసుపత్రులు, ఖరీదైన వైద్యం అంటే మాటలు కాదు. అందుకే వైఎస్, ఆరోగ్య శ్రీ



అనే పథకానికి రూపకల్పన చేసి అమల్లో పెట్టారు. గుండె జబ్బుల వంటి పెద్ద జబ్బులకు కూడా ఉచితంగా ఆపరేషన్లు చేయించుకోగలిగే అద్భుత అవకాశం పేద ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఇంతటితో సరిపోలేదని వైఎస్ మరిన్ని ఆలోచనలను జత చేస్తూ ఆరోగ్యశ్రీని మరింత మెరుగుపరచి, విస్తరించాలని తలపోశారు.

104 వాహనం ప్రతినెలా ఒక నిర్దిష్టమైన రోజు ప్రతి గ్రామానికీ వెళ్లి బాలింతలు, చూలింతలు, వృద్ధులు, బాల బాలికలకు వైద్య పరీక్షలు చేసి తగిన మందులు ఇస్తుంది. వారి ఆరోగ్య రికార్డులను కంప్యూటర్లలో భద్రపరచి, ఇతర ప్రదేశాలకు వెళ్ళినప్పుడు కూడా ఆ రికార్డుల ద్వారా వైద్య సాయం, చికిత్స పొందడానికి వీలైన ఏర్పాట్లు ఈ పథకంలో పొందుపరచారు. గర్భిణులకు క్రమబద్ధంగా పరీక్షలు చేసి, గర్భస్థ శిశువు పెరుగుదల గమనించి, తదనుగుణంగా వారికి పోషకాహారం అందించడమే కాకుండా, పురుడు వచ్చే రోజును నిర్ధారించి, 108 అంబులెన్స్‌కు కబురుచేసి, వారికి సకాలంలో ఆసుపత్రులలో పురుడుపోసుకునే వీలు కల్పించాలని అనుకున్నారు. అలాగే ప్రసవానంతరం ఆ తల్లీ బిడ్డలను క్షేమంగా ప్రభుత్వ అంబులెన్స్‌లోనే ఇంటికి చేర్చాలనేది కూడా వైఎస్ తలంపు.

వైఎస్ కన్న కలలో పూర్తికాని, అమలుకు నోచుకోని ఆయన ఆలోచనలకు వైఎస్ జగన్ తన హయాంలో పూర్తి స్వరూపం కల్పించారని ఆరోగ్య శ్రీ గురించి ఆయన మొన్న చేసిన ప్రకటన చెప్పకనే చెబుతోంది. వైఎస్ స్వప్నం నేరవేర్చడానికి ఆయన ప్రస్తుతం లభ్యం అవుతున్న అధునాతన కంప్యూటర్ పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం హర్షణీయం. విశాలమైన రహదారులూ, రమ్య హర్మ్యాలూ అభివృద్ధికి కొలమానాలు కావచ్చు. అయితే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కూడా కళ్ళకు కనిపించని పురోగతే.

తోక టపా:

సీనియర్ జర్నలిస్ట్ దారా గోపి తన అనుభవం గురించి ఓసారి చెప్పారు. ఆ ముచ్చట ఆయన మాటల్లోనే:

'రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా ఆరోగ్యశ్రీ ప్రవేశ పెట్టారు. చాలామంది డబ్బున్నోళ్ళు కూడా ఆరోగ్యశ్రీ కార్డులు తీసుకుని వైద్యం చేయించుకుంటున్నారు. అప్పుడు ఓసారి ఆయన విజయవాడ వచ్చినప్పుడు నేను ఇదే ప్రస్తావించాను. ఆయన నాకు రెండు ఉదాహరణలు చెప్పారు.

1. వరద వచ్చినప్పుడు ముందుగా చెత్తా చెదారం వస్తుంది. మంచినీళ్ళు ఆ తర్వాతే వస్తాయి. ఈ స్కీం ఇప్పుడే పెట్టాం కాబట్టి చెత్తా చెదారం ఉంటుంది.

2. నేను పేదలకు అన్నదానం అని ప్రకటించా. ఓ పెద్దాయన ప్లేట్ పట్టుకుని వరసలో నుంచుంటే, ఆ ప్లేట్‌లో అన్నం పెట్టకుండా ఎలా ఉంటాను!?'

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

మృతదేహం అంటే...

మెహెర్ బాబాకు ప్రియమైన శిష్యుల్లో ఏరచ్ ఒకరు. ఓ ఉదయపు నడకలో తోడు వచ్చిన స్నేహితునితో 'నేను తొందరగా మూత్ర విసర్జనకు వెళ్ళాలి. ఆపుకోలేను' అని రోడ్డు దాటి పక్క పొలంలోకి వెళ్ళి, ఆ పని పూర్తి చేసుకు వచ్చాడు ఏరచ్. 'ఇప్పుడు ఎంత హాయిగా ఉందో చెప్పలేను. ఒక్క నిమిషం ఆలోచించు. కొద్ది పాటి మూత్రం బరువును వదిలించుకొన్నందుకే ఆత్మ ఇంతగా సంతోషపడితే, మరణ సమయంలో దేహం యొక్క అతి పెద్ద బరువును వదిలించుకొన్నందుకు ఆత్మ ఇంకెంతగా సంతోషపడుతుందో గ్రహించగలవా?' అన్నాడు ఏరచ్.



తన తండ్రి చనిపోయినప్పుడు మెహెర్ బాబా, తనూ శ్మశానానికి వెళ్లినప్పటి సంఘటన గురించీ ఈ సందర్భంలో చెప్పాడు ఏరచ్. తన తండ్రి మృతదేహం కేసి వేలు చూపి 'అది ఏమిటి? ఏరచ్' అని అడిగిన బాబాకు తాను 'అది నా తండ్రి మృతదేహం' అని సమాధానం చెప్పాననీ, కానీ ఆయన... 'మరణం అనే ప్రక్రియ ద్వారా ఆత్మ మనిషి దేహాన్ని విసర్జిస్తుంది. నీకు ఎదురుగా ఏదైతే నీ తండ్రి మృతదేహంగా కనిపిస్తున్నదో, అది ఆత్మ విసర్జించిన మలం!' అని బోధించాడనీ చెప్పాడు ఏరచ్. దీని సారాంశాన్ని ఇలా ఒక్క మాటలో తేల్చాడు: 'మనం జీవితం అంతా, ఆత్మ విసర్జించే మలం అయిన దేహానికి ప్రాముఖ్యత ఇస్తాము, ఆత్మను నిర్లక్ష్యం చేసి!!'

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** శు.అష్టమి ప.1.55 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర రా.1.39వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** ప.12.11 నుండి 1.40 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.36 నుండి 12.19 వరకు, **అమృత ఘడియలు:** రా.9.10 నుండి 10.41 వరకు ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.28, **సూర్యాస్తమయం:** 5.26.

క్లుప్తంగా...

శ్రీవారి సేవలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్



తిరుమల ఆలయంలో ధ్వజ స్తంభానికి మొక్కుతున్న గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్

తిరుమల: తిరుమల శ్రీవారిని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ మంగళవారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయం వద్దకు చేరుకున్న గవర్నర్‌కు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి ఆహ్వానించగా, అర్చక బృందం ఇస్తికఫాల్ (ఆలయ మర్యాదలతో) స్వాగతం పలికారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా, తీర్థప్రసాదాలు, శ్రీవారి చిత్రపటాన్ని చైర్మన్, ఈవో అందించారు.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



శుద్ధి కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ధర్మారెడ్డి

తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం మంగళవారం వేడుకగా నిర్వహించారు. ఈ నెల 23న వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వేకువజామున స్వామివారికి తిరుప్పావై నివేదించిన అనంతరం శ్రీవారి మూలవిరాట్టును పట్టు పరదాలతో కప్పివేశారు. ఉదయం ఆరు గంటలకు ఆలయ శుద్ధి కార్యక్రమం జరిపారు. తర్వాత పవిత్ర పరిమళ జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి, పలువురు బోర్డు సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అష్టదళ పాద పద్మారాధన సేవ రద్దయింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కరోనాపై వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు సమీక్ష

సాక్షి, అమరావతి: కేరళతోపాటు పలు రాష్ట్రాల్లో కరోనా కేసులు పెరుగుతున్నందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆందోళనకర పరిస్థితులు లేవని ఆయన స్పష్టంచేశారు. అయినప్పటికీ శబరిమల, కేరళలోని ఇతర ప్రాంతాలను సందర్శించి రాష్ట్రానికి వచ్చే ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. కరోనా అనుమానిత లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కరోనా వైరస్ పట్ల రాష్ట్రాలను కేంద్ర ఆరోగ్యశాఖ అప్రమత్తం చేసిన నేపథ్యంలో మంగళవారం రాష్ట్ర సచివాలయంలో వైద్యశాఖ అధికారులతో కృష్ణబాబు సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ బోధనాస్పత్రుల్లోని ఆర్టీపీసీఆర్ ల్యాబ్‌లలో రోజుకు 1,000 చొప్పున పరీక్షలు చేయాలన్నారు. తీవ్రమైన శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న రోగులకు తప్పనిసరిగా ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. కరోనా పాజిటివ్ రోగులకు చికిత్సలు అందించడానికి ఆస్పత్రుల్లో మందులు, మాస్క్‌లు, మెడికల్ ఆక్సిజన్, ఇతర సదుపాయాలన్నీ ఉన్నాయని చెప్పారు.

48 కార్పొరేషన్ల చైర్మన్‌ల పదవీకాలం పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 48 కార్పొరేషన్ల చైర్మన్ల పదవీకాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ముత్యాలరావు రేవు అన్ని శాఖల కార్యదర్శులకు ఉత్తర్వులిచ్చారు. ఇప్పటికే పదవీకాలం పూర్తైన చైర్మన్ల పదవీకాలం కొనసాగించేలా చర్యలు తీసుకున్నారు. తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు వారు ఆ పదవుల్లో కొనసాగుతారని పేర్కొన్నారు.

ఒంగోలు-నెల్లూరు సెక్షన్‌లో టికెట్ చెకింగ్ డ్రైవ్



ఒంగోలు స్టేషన్‌లో ఆహారం తనిఖీ చేస్తున్న డీసీఎం ఎండీ అలీఖాన్

రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ కమర్షియల్ విభాగం అధికారులు, సిబ్బంది ఒంగోలు-నెల్లూరు సెక్షన్ మధ్యలో సర్‌ప్రైజ్ టికెట్ చెకింగ్ డ్రైవ్ నిర్వహించారు. డీసీఎం ఎండీ అలీఖాన్ పర్యవేక్షణలో స్క్వాడ్ టీటీలు పలు రైళ్లలో తనిఖీలు చేపట్టి 318 మంది టికెట్ లేని ప్రయాణికులు, సరైన టికెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న 99 మందిపై కేసులు నమోదు చేసి రూ. 3.35 లక్షల పెనాల్టీ వసూలు చేశారు.

విదేశాలకు కోనసీమ పీత

గోదావరి, సముద్ర సంగమ ప్రాంతంలో లభ్యం

కాలుష్యం కాటుతో తగ్గిపోతున్న పచ్చ పీతలు

సాగుకు తెగుళ్ల బెడద

గోదావరి జిల్లాలో దొరికే పులస చేపలతోపాటు ఇతర మత్స్య సంపదకూ బాగా డిమాండ్ ఉంది. వీటిల్లో పచ్చ పీత (స్కిల్లా సెరాటా) ఒకటి. ఈ పీత దొరికితే మత్స్యకారులకు పండగే. విదేశాల్లో దీనికి గిరాకీ అంతా ఇంతా కాదు. మడ అడవులలో లభ్యమయ్యే ఔషధ గుణాలు కలిగిన ఈ పీత రుచి అమోఘం. ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుందని నమ్ముతారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కాసుల వర్షం కురిపించిన పచ్చ పీత కాలుష్యం కాటున పడి ఇప్పుడు అరుదైన మత్స్య ఉత్పత్తిగా మారిపోయింది. – సాక్షి అమలాపురం



పసుపు పచ్చ పీత (స్కిల్లా సెరాటా)

రుచికరం.. ఆరోగ్యకరం

అమెరికా, చైనా, థాయ్‌లాండ్, సింగపూర్ దేశాల్లో పచ్చ పీత (పచ్చ/పసుపు/ముదురు గోధుమ రంగు)ను ఇష్టంగా తింటారు. ఔషధ గుణాలు కలిగిన వృక్ష జాతులు పెరిగే కోరంగి అభయారణ్యం పరిసరాలలో పెరిగే పీతలు రుచిగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల శరీరానికి రాగి, పాస్పరస్ సమృద్ధిగా అందుతుంది. ఎముకలు గట్టి పడతాయి. ఒమేగా–3 ఉండటంతో గుండె సంబంధిత జబ్బులు దరి చేరవు. అల్జీమర్స్ (మతిమరుపు) లాంటి వ్యాధులు వచ్చే అవకాశాలు చాలా తక్కువ. రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. అందుకే విదేశీయులకు ఈ పీతలంటే మక్కువ.

మడ అడవుల్లో...

కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లం, చిర్రయానాం, కొత్తపాలెం, పండి, పొర, ఐ.పోలవరం మండలం భైరవపాలెం, కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం చినవలసల, పెదవలసల, చినబొడ్డు వెంకటాయపాలెం, పెదబొడ్డు వెంకటాయపాలెం, గాడిమొగ, రామన్నపాలెం గ్రామాల మత్స్యకారులు పీతల వేట అధికంగా చేపడతారు. ఏటిమొగతోపాటు సముద్ర సంగమ ప్రాంతంలో సహజ సిద్ధంగా ఏర్పడే పర్రభూములు, వీటిని ఆనుకుని ఉన్న మడ అడవుల వద్ద ఈ పీతలు ఎక్కువగా దొరుకుతాయి. వ్యాపారులు వీటిని రైళ్లలో చెన్నై, కోల్‌కతా తరలిస్తారు. అక్కడ నుంచి విమానంలో మలేషియా, సింగపూర్, థాయ్‌లాండ్, ఆస్ట్రేలియాకు ఎగుమతి చేస్తున్నారు.

కాలుష్యం కాటు

చమురు సంస్థల కార్యకలాపాలు, ఆక్వా చెరువుల నుంచి వదులుతున్న వ్యర్థాల వల్ల పచ్చ పీతలు కనుమరుగవుతున్నాయి. గత ఐదేళ్లుగా దీని లభ్యత చాలా



ఎగుమతులకు సిద్ధంగా ఉన్న పచ్చపీత

అరుదుగా మారింది. కోనసీమ జిల్లా కాట్రేనికోన ప్రాంతంలో కొంత వరకు పీత లభ్యమవుతోంది. గతంలో రోజుకు ఐదు నుంచి ఆరు టన్నుల వరకు పీతలు చెన్నై మీదుగా విదేశాలకు ఎగుమతి కాగా ఇప్పుడు రోజుకు అర టన్నుకు మించి దొరకడం లేదు. మూడేళ్ల క్రితం పచ్చ పీత కిలో రూ.500 వరకు ఉండగా కేజీ రూ.2 వేల వరకు పలుకుతోందంటే డిమాండ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

కలిసిరాని సాగు

అంతర్జాతీయంగా డిమాండ్ ఉండడంతో కోనసీమ జిల్లాలో కొంతమంది రైతులు ప్రయోగాత్మకంగా పచ్చ పీతల సాగు చేపట్టారు. కాట్రేనికోన మండలం పల్లం, చిర్రయానాం, ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లి వంటి ప్రాంతాల్లో పెద్ద ఎత్తున సాగు చేశారు. అయితే వీటికి వైరస్ సోకడంతో పీత ఎదుగుదల ఆశించిన స్థాయిలో లేదు. హేచరీల నుంచి తెచ్చిన సీడ్ (పిల్లలు) పెద్దగా ఎదగడం లేదు. దీంతో గిట్టుబాటు కాకపోవడంతో వీటి సాగుకు దూరమవుతున్నారు.

ధర ఉన్నా.. పీత లేదు!



పచ్చ పీత ఎగుమతులకు 2002 నుంచి 2008 వరకు స్వర్ణయుగం లాంటిది. అప్పట్లో డిమాండ్‌కు తగినట్టుగా సరఫరా చేయలేకపోయేవాళ్లం. 2017 నుంచి పీత లభ్యత తగ్గిపోతూ వచ్చింది. గతంలో పోల్చుకుంటే పది శాతం కూడా లేదు. ఇప్పుడు ధర రెట్టింపైనా పీత లభ్యత దాదాపు లేకపోవడం వల్ల ప్రయోజనం లేకుండా పోయింది.

– పోతాబత్తుల నూకరాజు, పీతలవ్యాపారి, తాళ్లరేవు, కాకినాడ జిల్లా

ప్రభుత్వ ప్రోత్సాహం


వెనామీ తరహాలో విదేశీ మారక ద్రవ్యం అధికంగా వచ్చే అవకాశమున్నందున తీరంలో పీతల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. కాట్రేనికోన మండలం చిర్రయానాం వద్ద ప్రైవేట్ హేచరీని ప్రోత్సహించేలా ప్రణాళిక రూపొందించారు. స్థానికంగా హేచరీ ఏర్పాటైతే పీతల సీడ్ తక్కువ ధరకు దొరకడంతోపాటు సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. సాగుకు బ్యాంకుల ద్వారా అందించే రుణాన్ని ఎకరాకు రూ.78 వేల నుంచి రూ.లక్షకు పెంచుతూ అధికార యంత్రాంగం నిర్ణయం తీసుకుంది.

సామాజిక రంగానికి రూ.4.03 లక్షల కోట్ల వ్యయం



- విద్య, వైద్యం, వ్యవసాయం తదితర రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యత
- ఏటా ఈ రంగాలపై పెరుగుతున్న ఖర్చు
- ఆర్బీఐ నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం సామాజిక రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఈ రంగం పరిధిలోకి వచ్చే విద్య, వైద్యం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి, పౌష్టికాహారం, పారిశుధ్యం, మంచినీటి సరఫరాలకు 2019–20 నుంచి 2022–23 ఆర్థిక సంవత్సరం వరకు ఏకంగా రూ.4.03 లక్షల కోట్ల వ్యయం చేసింది. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నివేదిక తాజాగా వెల్లడించింది. సామాజిక రంగంపై ప్రభుత్వం ఏటా చేసే వ్యయం పెరుగుతోందని తెలిపింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది. వీటితోపాటు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. సామాజిక రంగంపైన చేసే వ్యయాన్ని మానవ వనరుల అభివృద్ధితో పాటు ప్రజలకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాల కల్పనగా పరిగణిస్తారు. కాగా విద్యా రంగంలో ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలు చేపట్టిన సంగతి తెలిసిందే. మన బడి నాడు-నేడు ద్వారా 45 వేల ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చింది. జగనన్న విద్యా కానుక, జగనన్న అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద వంటి పథకాలను అందిస్తోంది. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ, డిజిటల్ బోధన, 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు, టోఫెల్‌కు శిక్షణ, పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించినవారికి జగనన్న ఆణిముత్యాల కింద సత్కారం... ఇలా ఎన్నో కార్యక్రమాలను చేపట్టింది. అలాగే వైద్య రంగంలో కూడా నాడు-నేడు కింద ప్రభుత్వ ఆస్పత్రులన్నింటిలో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. అంతేకాకుండా కొత్తగా 17 మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టింది. వీటిలో కొన్ని ఈ ఏడాది ప్రారంభం కాగా మరికొన్ని వచ్చే ఏడాది మొదలవుతాయి. మరోవైపు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పేదరికాన్ని తరిమికొట్టేందుకు, పేదలు వారి కాళ్లపై వాళ్లు నిలబడేందుకు ఎన్నో పథకాలను ప్రభుత్వం అందిస్తోంది. అలాగే గ్రామీణాభివృద్ధికి, సురక్షిత తాగునీటి సరఫరాకు పెద్దపీట వేస్తోంది. ఈ నేపథ్యంలోనే సామాజిక రంగ వ్యయం నాలుగేళ్లలో భారీగా పెరిగినట్లు ఆర్బీఐ నివేదిక స్పష్టం చేసింది.



ఆయువుదాతలు!

దేశంలో పెరుగుతున్న అవయవదానాలు

- ఈ ఏడాది సెప్టెంబర్ వరకు దేశంలో 88,400 మంది అవయవదానాలకు ప్రతిజ్ఞ
- దేశవ్యాప్తంగా గత ఐదేళ్లలో 58,749 మందికి అవయవ మార్పిడి
- రాష్ట్రంలోనూ గత ఐదేళ్లలో 1,060 మంది అవయవదానాలు
- మూడేళ్లలో 756 మందికి అవయవ మార్పిడి
- దేశంలో అత్యధికంగా కిడ్నీల మార్పిడి
- ఇటీవల లోక్‌సభలో ప్రకటించిన కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ



సాక్షి, అమరావతి: తాను కన్నుమూసినా... మరికొందరికి కొత్త జీవితం ఇచ్చేందుకు చాలామంది ముందుకువస్తున్నారు. ఫలితంగా దేశంలో అవయవదానం చేసే వారి సంఖ్య పెరుగుతోంది. ముఖ్యంగా గత ఐదేళ్ల నుంచి అవయవదానానికి అంగీకరిస్తున్న వారి సంఖ్య పెరుగుతోందని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఇటీవల లోక్‌సభలో వెల్లడించింది. ఈ ఏడాది సెప్టెంబర్ వరకు దేశంలో 88,400 మంది అవయవదానానికి అంగీకరిస్తూ ప్రతిజ్ఞ చేశారని తెలిపింది. కేంద్ర ప్రభుత్వం జాతీయ అవయవ మార్పిడి కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, అవయవదానం, మార్పిడిని ప్రోత్సహించడానికి మూడంచెల సమర్థవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేసిందని పేర్కొంది. ఐదు ప్రాంతీయ అవయవ మార్పిడి సంస్థలను కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌తో పాటు 20 రాష్ట్రాల్లో అవయవ మార్పిడి సంస్థలను ఏర్పాటు చేసినట్లు వివరించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవయవదానాన్ని ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొంది. గత ఐదేళ్లలో (2018 నుంచి 2022 వరకు) 52,594 మంది అవయవాలను దానం చేయగా, 58,749 మందికి అవయవాలను మార్పిడి చేసినట్లు తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లోనూ గత ఐదేళ్లలో 1,060 మంది అవయవదానం చేశారని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఏపీలో 2020 నుంచి 2022 వరకు మూడేళ్లలో 756 మందికి అవయవ మార్పిడి చేసినట్లు తెలిపింది. అయితే, కోవిడ్ సమయంలో అవయవదానాలు చేసిన వారి సంఖ్య తగ్గిందని, ఆ తర్వాత మళ్లీ పెరిగిందని పేర్కొంది. దేశంలో గత ఐదేళ్లలో అత్యధికంగా కిడ్నీల మార్పిడి జరిగిందని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ వెల్లడించింది.

గత ఐదేళ్లలో దేశంలో అవయవాల మార్పిడి ఇలా...

అవయవాలు	2018	2019	2020	2021	2022
కిడ్నీ	7,936	9,751	5,486	9,105	11,705
కాలేయం	1,945	2,592	1,780	2,847	3,920
గుండె	241	187	89	151	243
ఊపిరితిత్తులు	191	114	67	133	144
క్లోమం	25	22	14	19	26
చిన్న ప్రేగు	2	--	7	4	3
మొత్తం	10,340	12,666	7,443	12,259	16,041

దేశంలో గత ఐదేళ్లలో మొత్తం అవయవ దాతల సంఖ్య

సంవత్సరం	2018	2019	2020	2021	2022
దాతల సంఖ్య	8,961	11,323	6,812	11,198	14,300

రాష్ట్రంలో గత ఐదేళ్లలో మొత్తం అవయవదాతల సంఖ్య

సంవత్సరం	2018	2019	2020	2021	2022
దాతల సంఖ్య	102	270	120	235	333

రాష్ట్రంలో గత మూడేళ్లలో అవయవ మార్పిడి సంఖ్య ఇలా

సంవత్సరం	2020	2021	2022
అవయవాల మార్పిడి	122	260	374

ట్రాన్స్‌ప్లాంట్ కో-ఆర్డినేటర్లకు శిక్షణ

నేషనల్ ఆర్గాన్, టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ తొలిసారిగా ఈ ఏడాది నవంబర్ 28 నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు ప్రత్యేకంగా సాయుధ దళాలకు సంబంధించిన 22 ఆస్పత్రులకు చెందిన నర్సింగ్ అధికారులకు ట్రాన్స్‌ప్లాంట్ కో-ఆర్డినేటర్లుగా శిక్షణ ఇచ్చినట్లు ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ తెలిపింది. జాతీయ అవయవమార్పిడి కార్యక్రమం మార్గదర్శకాల మేరకు బ్రెయిన్ డెడ్ దాతల నుంచి కిడ్నీ, గుండె, కార్నియా, మూత్రపిండాలు, కాలేయం, ఊపిరితిత్తులను సేకరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని వివరించింది.

చల్లని ప్రయాణం




భారతీయ రైల్వేలో పెరుగుతున్న ఏసీ బోగీలు

దశాబ్ద కాలంగా మొత్తం 12.70లక్షల సీట్లు పెంపు	ఎయిర్ కండిషన్డ్ బోగీల్లో 133 శాతం వృద్ధి	3-టైర్ ఏసీలో 163 శాతం పెరుగుదల

సాక్షి, అమరావతి: భారతీయ రైల్వేలో దశాబ్ద కాలంగా సాధారణ శ్రేణి కంటే ఏసీ సీట్ల సామర్థ్యం గణనీయంగా పెరుగుతున్నది. సాధారణ శ్రేణి (స్లీపర్ క్లాస్), సెకండ్ క్లాస్ కోచ్‌ల స్థానాన్ని ఎయిర్ కండిషన్డ్ కోచ్‌లు ఆక్రమిస్తున్నాయి. ఫలితంగా సామాన్య ప్రయాణికులపై తీవ్రభారం పడుతున్నది. నాన్-సబర్బన్ (ఎక్కువ దూరం ప్రయాణించే) రైళ్లలో 2012 నుంచి 2022 మధ్య మొత్తం సీట్ల సామర్థ్యం 42.60 శాతం పెరిగింది. ఇందులో ఎయిర్ కండిషన్డ్ బోగీల్లో 133 శాతం పెరుగుదల కనిపిస్తుంటే..అత్యధికంగా 3-టైర్ ఏసీలో సీట్ల సంఖ్య 163 శాతానికి వృద్ధి చెందినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

సాధారణ శ్రేణి ప్రయాణికులకు నిరాశే

గడిచిన పదేళ్లలో నాన్-సబర్బన్ రైళ్లలో మొత్తం 12.70 లక్షల సీట్లను పెంచగా.. మూడింట ఒక వంతు (4.48లక్షలు) ఏసీ 3-టైర్ కోచ్‌లకు వెళ్లాయి. సెకండ్ క్లాస్‌లో 3.5లక్షలు, స్లీపర్ క్లాస్‌లో 3.4లక్షలు సీట్లు పెరిగాయి. ఏసీ కోచ్‌లలోని సీట్లతో పోలిస్తే ఎక్కువ మంది ప్రయాణించే నాన్-ఏసీ బోగీల్లో సీట్ల పెరుగుదల చాలా స్వల్పంగా ఉంది. ఫలితంగా ఏసీ ప్రయాణ భారాన్ని భరించలేని, టికెట్ కన్ఫామ్ కాని ప్రయాణికులకు తీవ్ర నిరాశే ఎదురవుతున్నది. శతాబ్ది ఎక్స్‌ప్రెస్, వందే భారత్ వంటి రైళ్లలో ఉండే ఏసీ చైర్ కార్ కోచ్‌లలో సీట్లు 65వేల నుంచి 1.08 లక్షలకు (66 శాతం)పెరిగాయి. కానీ, రైల్వే మంత్రిత్వ శాఖ మాత్రం దేశవ్యాప్తంగా 60వేల కోచ్‌లు ఉంటే 40 వేల నాన్ ఏసీ కోచ్‌లున్నాయని చెబుతున్నది.



పెరిగిన ఆదాయం..

భారతీయ రైల్వే 2022లో నాన్-సబర్బన్ ప్రయాణాల ద్వారా రూ.37,855.42 కోట్లు ఆర్జించింది. ఇందులో రూ.12,225 కోట్లు (32.3 శాతం) 3-టైర్ ఏసీ తరగతి నుంచి వచ్చింది. ఇది 2012లో రూ.4,523.94 కోట్ల (17 శాతం)కంటే గణనీయమైన పెరుగుదల. ఇక్కడ కేవలం 7.6 శాతం మంది ప్రయాణికులు, 19 శాతం రైలు సీట్లతో, రైల్వే ఆదాయంలో దాదాపు మూడింట ఒక వంతు 3-టైర్ ఏసీ అందిస్తుండటం విశేషం. మొత్తం ఆదాయంలో స్లీపర్ క్లాస్ (రూ.7,261.53 కోట్లు), సెకండ్ క్లాస్ (రూ.11,207.55 కోట్లు) వాటా 2012లో 70.2 శాతం నుంచి 2022 నాటికి కేవలం 54 శాతానికి తగ్గింది.

3-టైర్ ఏసీలో భారీగా పెరిగిన రద్దీ

రైల్వే వార్షిక నివేదిక, జాతీయ రవాణా సంస్థ నివేదిక ప్రకారం.. 2021–22 ఆర్థిక సంవత్సరంలో నాన్-సబర్బన్ రైల్వే 135 కోట్ల మంది ప్రయాణికులను రవాణా చేసింది. అదే 2012లో మొత్తం ప్రయాణికుల్లో 88 శాతం మంది సెకండ్ క్లాస్‌లో తిరిగితే 2022 నాటికి అది 66 శాతానికి పడిపోయింది. ఇక 2012లో మొత్తం ప్రయాణికుల్లో స్లీపర్ క్లాస్ వాటా 8.6శాతం ఉంటే 2022 నాటికి 21.76 శాతానికి చేరుకుంది. అదే ఏసీ 3-టైర్‌లో ప్రయాణికుల రద్దీ 1.5 శాతం నుంచి 7.6 శాతానికి దూసుకెళ్లింది.

సాక్షి బిజినెస్
బుధవారం
20-12-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	122	71,437
నిఫ్టీ ▲	34	21,453

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	14,947	▲ 43
డోజోన్స్	37,483	▲ 177
ఎఫ్‌టీఎస్ఈ 100	7,638	▲ 24
డాక్స్	16,744	▲ 94
షాంఘై	2,932	▲ 2
నికాయ్	33,219	▲ 460

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,084	▲ 182
బంగారం (99.5 స్వచ్ఛత)	61,836	▲ 182
వెండి (కేజీ)	73,652	▲ 64

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.73	83.75
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.10	106.67
€	యూరో	ఒకటి	89.77	92.14
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	57.35	58.67
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.96	56.89
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.45	63.44
SAR	సౌదీ రియాల్	ఛాయిస్‌కి	21.23	22.85
UAE D	యూఏఈ దిర్హామ్	ఛాయిస్‌కి	21.75	23.54
¥	చైనా యువాన్	ఛాయిస్‌కి	10.53	12.61

వరుణ్ బెవరేజెస్ చేతికి బెవ్కో

డీల్ విలువ రూ. 1,320 కోట్లు



న్యూఢిల్లీ: పానీయాల దిగ్గజం పెప్సీకో ఫ్రాంచైజీ సంస్థ వరుణ్ బెవరేజెస్.. దక్షిణాఫ్రికా కంపెనీ బెవరేజ్ కంపెనీ(బెవ్కో)తోపాటు అనుబంధ సంస్థలను కొనుగోలు చేయనుంది. దక్షిణాఫ్రికా, లెసోతో, ఎస్వటీని ప్రాంతాలలో పెప్సీకో ఫ్రాంచైజీ హక్కులను బెవ్కో కలిగి ఉంది. 3 బిలియన్ రాండ్ల(జెడ్ఏఆర్) (రూ. 1,320 కోట్లు) ఎంటర్‌ప్రైజ్ విలువలో సొంతం చేసుకోనున్నట్లు వరుణ్ బెవరేజెస్ వెల్లడించింది. తద్వారా దక్షిణాఫ్రికా మార్కెట్లో కార్యకలాపాలు విస్తరించనుంది. నమీబియా, బోట్స్‌వానా పంపిణీ హక్కులతోపాటు.. అత్యంత కెఫైన్ కంటెంట్ డ్రింక్ రీఫ్రెష్, ఎనర్జీ డ్రింక్ రీబూస్ట్, కార్బొనేటెడ్ డ్రింక్ కూతఈ, జైవ్, ఫిజ్జీ లెమనేడ్ బ్రాండ్లను బెవ్కో కలిగి ఉంది. 2024 జులై31లోగా నగదు ద్వారా లావాదేవీని పూర్తి చేసే వీలున్నట్లు వరుణ్ అంచనా వేస్తోంది.

5 తయారీ కేంద్రాలు

2023లో బెవ్కో రూ. 1,590 కోట్ల టర్నోవర్ సాధించినట్లు వరుణ్ తెలియజేసింది. జోహన్నెస్‌బర్గ్‌లో రెండు, దర్బన్, ఈస్ట్ లండన్, కేప్‌టౌన్‌లో ఒకటి చొప్పున మొత్తం ఐదు తయారీ యూనిట్లను కలిగి ఉంది. నిమిషానికి 3,600 బాటిళ్ల(బీపీఎం) సామర్థ్యం సంస్థ సొంతం. బెవ్కో కొనుగోలు ద్వారా దక్షిణాఫ్రికా మార్కెట్లో విస్తరించనున్నట్లు వరుణ్ వెల్లడించింది. ఆఫ్రికా ఖండంలో దక్షిణాఫ్రికా అతిపెద్ద పానీయాల మార్కెట్‌కాగా.. రానున్న నాలుగేళ్లలో అంటే 2027కల్లా వార్షిక సగటున 5.3 శాతం చొప్పున వృద్ధి చూపగలదని అంచనా. దేశీయంగా పెప్సీకో అమ్మకాల పరిమాణంలో వరుణ్ బెవరేజెస్ 90 శాతాన్ని ఆక్రమిస్తున్న సంగతి తెలిసిందే. గతేడాది(2022–23) రూ. 10,596 కోట్ల ఆదాయం సాధించింది.

బెవ్కో కొనుగోలు వార్తలతో వరుణ్ బెవరేజెస్ షేరు ఎన్ఎస్ఈలో 3.7 శాతం జంప్‌చేసి రూ. 1,174 వద్ద ముగిసింది.

ఐపీవో బాటలో ఓలా, ఫస్ట్‌క్రై

వచ్చే వారం ప్రాస్పెక్టస్ దాఖలుకు చాన్స్



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన కంపెనీ ఓలా, ఈకామర్స్ సంస్థ ఫస్ట్‌క్రై పబ్లిక్ ఇష్యూ బాటలో సాగుతున్నాయి. వచ్చే వారం క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌లను దాఖలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఓలా ఎలక్ట్రిక్ యాజమాన్యం దేశ, విదేశీ ఇన్వెస్టర్లను ఆకట్టుకునేందుకు రోడ్‌షోలను నిర్వహిస్తోంది. ఇక ఫస్ట్‌క్రై కొత్త ఏడాది(2024)లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల తదుపరి స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టకావచ్చని అంచనా. పీఈ దిగ్గజం సాఫ్ట్‌బ్యాంక్‌కు రెండు సంస్థలలోనూ పెట్టుబడులున్న సంగతి తెలిసిందే. కాగా.. రెండు కంపెనీలూ వచ్చే వారం సెబీకి ప్రాస్పెక్టస్‌లను దాఖలు చేసే సన్నాహాల్లో ఉన్నట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఐపీవో ద్వారా ఫస్ట్‌క్రై 50 కోట్ల డాలర్లు(సుమారు రూ. 4,150 కోట్లు) సమీకరించే అవకాశముంది. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం దీనిలో 60 శాతం వరకూ ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనుండగా.. మిగిలిన 40 శాతం ఈక్విటీని కొత్తగా జారీ చేసే వీలుంది. కాగా.. రంజన్ పాయ్ కంపెనీ ఎంఈఎంజీ ఫ్యామిలీ ఆఫీస్, హర్ష్ మరియావాలా సంస్థ షార్ప్ వెంచర్స్, హేమేంద్ర కొఠారీ సంస్థ డీఏఎస్‌పీ ఫ్యామిలీ ఆఫీస్ ఇటీవలే ఫస్ట్‌క్రైలో రూ. 435 కోట్ల విలువైన వాటాలను సొంతం చేసుకోవడం గమనార్హం!

గో ఫస్ట్‌పై 3 కంపెనీల కన్ను

- లిస్టులో స్పైస్‌జెట్, స్కై వన్, సాఫ్రిక్ ఇన్వెస్ట్‌మెంట్స్
- డెడ్‌లైన్ పొడిగించాలని ఆర్‌పీకి విజ్ఞప్తి



న్యూఢిల్లీ: దివాలా తీసిన గో ఫస్ట్ ఎయిర్‌లైన్స్‌ను కొనుగోలు చేయడంపై మూడు సంస్థలు పోటీపడుతున్నాయి. దేశీ విమానయాన సంస్థ స్పైస్‌జెట్, షార్జాకి చెందిన ఏవియేషన్ కంపెనీ స్కై వన్, ఆఫ్రికా కేంద్రంగా పని చేసే సాఫ్రిక్ ఇన్వెస్ట్‌మెంట్స్ వీటిలో ఉన్నాయి. గో ఫస్ట్ కొనుగోలుపై ఆసక్తిగా ఉన్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు స్పైస్‌జెట్ తెలియజేసింది. మదింపు ప్రక్రియను పూర్తి చేసిన తర్వాత త్వరలోనే తమ ఆఫర్ ప్రకటించే యోచనలో ఉన్నట్లు వివరించింది. మదింపు ప్రక్రియను చేపట్టేందుకు గత పది రోజులుగా ఈ మూడు సంస్థల నుంచి దివాలా పరిష్కార నిపుణుడు (ఆర్‌పీ) శైలేంద్ర అజ్మీరాకు అభ్యర్థనలు వచ్చినట్లు తెలుస్తోంది. వాస్తవానికి గో ఫస్ట్ కొనుగోలు కోసం బిడ్లు దాఖలు చేసేందుకు గడువు నవంబర్ 22తో ముగిసింది. అయితే, గడువు లోపల స్పందించని కంపెనీలు.. ఆ తర్వాత ఆసక్తి వ్యక్తం చేయడం గమనార్హం. తాజా పరిస్థితుల నేపథ్యంలో బిడ్డింగ్ డెడ్‌లైన్‌ను మరికొంత కాలం పొడిగించాలని బిడ్డర్లు కోరినట్లు సమాచారం. దీనిపై రుణదాతల కమిటీ (సీఓసీ) నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న గో ఫస్ట్ మే 3 నుంచి కార్యకలాపాలు నిలిపివేసిన సంగతి తెలిసిందే. మరోవైపు, ఒడుదుడుకులు ఎదుర్కొంటున్న స్పైస్‌జెట్, ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు 270 మిలియన్ డాలర్లను సమీకరించుకునే ప్రయత్నాల్లో ఉంది.

మంగళవారం స్పైస్‌జెట్ షేర్లు ఇంట్రా–డేలో బీఎస్ఈలో దాదాపు 8 శాతం ఎగిసి 52 వారాల గరిష్ట స్థాయి రూ. 69.20కి చేరింది. చివరికి సుమారు 3% లాభంతో రూ. 66.08 వద్ద ముగిసింది.

పీహెచ్‌ను దక్కించుకున్న విజయా డయాగ్నోస్టిక్

డీల్ విలువ రూ. 135 కోట్లు



న్యూఢిల్లీ: లిస్టెడ్ హైదరాబాద్ కంపెనీ విజయా డయాగ్నోస్టిక్ పుణేకు చెందిన పీహెచ్ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను కొనుగోలు చేయనున్నట్లు పేర్కొంది. పీహెచ్‌లో 100% షేర్ల కొనుగోలు ఒప్పందానికి(ఎస్‌పీఏ) బోర్డు ఆమోదముద్ర వేసినట్లు హెల్త్‌కేర్ సంబంధ సర్వీసులందించే విజయా డయాగ్నోస్టిక్ సెంటర్ తెలియజేసింది. ఇందుకు దాదాపు రూ. 135 కోట్లు వెచ్చించనున్నట్లు వెల్లడించింది. అంతేకాకుండా మరో రూ. 13 కోట్లవరకూ రుణాలివ్వడం లేదా పీహెచ్‌కున్న రుణ చెల్లింపులు చేపట్టడం ద్వారా ఇన్వెస్ట్ చేయనున్నట్లు తెలిపింది. కొనుగోలు తదుపరి సొంత అనుబంధ సంస్థగా పీహెచ్ ఆవిర్భవించనున్నట్లు వివరించింది. సమీకృత కార్యకలాపాలు కలిగిన పీహెచ్ 23 ఏళ్లుగా డయాగ్నోస్టిక్ సేవలందిస్తున్నట్లు పేర్కొంది.

ఈ వార్తలతో విజయా డయాగ్నోస్టిక్ షేరు 2.8% ఎగసి రూ. 632 వద్ద ముగిసింది.

మళ్లీ కొత్త రికార్డులు



సెన్సెక్స్ 122 పాయింట్లు ప్లస్

ముంబై: ఎఫ్ఎంసీజీ, ఆయిల్అండ్‌గ్యాస్, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు ఒక రోజు నష్టాల ముగింపు తర్వాత మళ్లీ లాభాల బాట పట్టాయి. అంతర్జాతీయ సానుకూల సంకేతాలూ కలిసొచ్చాయి. ఫలితంగా మంగళవారం సెన్సెక్స్ 122 పాయింట్లు పెరిగి 71,437 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 34 పాయింట్లు బలపడి 21,453 వద్ద నిలిచింది. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు ట్రేడింగ్ ప్రారంభంలోనే అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటీసీ, నెస్లే షేర్లు ఒక శాతం రాణించడంతో సూచీలు నష్టాలు భర్తీ చేసుకోవడంతో పాటు లాభాలు ఆర్జించగలిగాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 309 పాయింట్లు పెరిగి 71,624 వద్ద, నిఫ్టీ 86 పాయింట్లు బలపడి 21,505 వద్ద కొత్త చరిత్రాత్మక గరిష్టాలు నమోదు చేశాయి. మరో వైపు ఐటీ, ఆటో, మెటల్, రియల్టీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.603 కోట్ల షేర్లను విక్రయించగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.294 కోట్ల షేర్లను కొన్నారు. బ్యాంక్ ఆఫ్ జపాన్ సరళతర ద్రవ్య విధాన వైఖరికి మొగ్గుచూపడంతో ఆసియా మార్కెట్లు ఒక శాతం లాభపడ్డాయి. యూరోజోన్ ద్రవ్యోల్బణ డేటా వెల్లడికి ముందు యూరప్ మార్కెట్లు పరిమిత లాభాల్లో కదలాడాయి.

''స్టాక్ మార్కెట్లో ఆశావాదం కొనసాగింది. స్థిరీకరణ దశలో భాగంగా సూచీలు పరిమిత శ్రేణిలో కదలాడాయి. ఎర్ర సముద్రం నౌకా మార్గానికి రక్షణ కల్పిస్తామంటూ అమెరికా ప్రకటనతో క్రూడాయిల్ ధరల్లో స్థిరంగా నెలకొంది. వృద్ధి ఆధారిత స్టాకుల ర్యాలీ తర్వాత ఇన్వెస్టర్లు విలువ షేర్లను కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు'' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

- పెట్రోలియం క్రూడ్, డీజిల్‌పై ప్రభుత్వం విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను తగ్గించడంతో ఆయిల్‌అండ్‌గ్యాస్ కంపెనీల షేర్లు లాభపడ్డాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.50%, ఓఎన్‌జీసీ, హిందూస్తాన్ పెట్రోలియం, బీపీసీఎల్, ఐఓసీ, పెట్రోనెట్ షేర్లు ఒకటి నుంచి అరశాతం చొప్పున పెరిగాయి.
- భారత ఐటీ కంపెనీలపై ప్రభావం చూపే అమెరికా దిగ్గజ ఐటీ కన్సల్టింగ్ సంస్థ యాక్సెంచర్ ఆర్థిక సంవత్సరం 2024 తొలి త్రైమాసిక ఫలితాలు ప్రకటన(మంగళవారం)కు ముందు దేశీయ ఐటీ షేర్లలో అప్రమత్తత చోటు చేసుకొంది. కోఫోర్జ్ 3%, విప్రో 2%, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా షేర్లు ఒకశాతం పతనమయ్యాయి. ఎంఫసీస్, ఇన్ఫోసిస్, ఎల్అండ్‌టీఎం షేర్లు అరశాతం నష్టపోయాయి.
- షేర్ల విభజన రికార్డు తేదీ జనవరి 5 గా నిర్ణయించడంతో నెస్లే ఇండియా షేరు 4.50% లాభపడి రూ.25,485 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 5.50% పెరిగి రూ.25,699 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.

తెలుగు రాష్ట్రాల్లో మరిన్ని శాఖలు

ఎస్ఎంఎఫ్‌జీ గృహశక్తి ఎండీ దీపక్ పాట్కర్ వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అల్పాదాయ, మధ్య తరగతి వర్గాలకు అఫోర్డబుల్ హౌసింగ్ రుణాలిచ్చే ఎస్ఎంఎఫ్‌జీ గృహశక్తి (గతంలో ఫులర్టన్ ఇండియా హోమ్ ఫైనాన్స్) తెలుగు రాష్ట్రాలపై మరింతగా దృష్టి పెడుతోంది. ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లో 15 శాఖలు ఉండగా ఈ ఆర్థిక సంవత్సరం ఆఖరు నాటికి 20కి పెంచుకోనున్నట్లు సంస్థ ఎండీ దీపక్ పాట్కర్ తెలిపారు. దేశవ్యాప్తంగా తమ నిర్వహణలోని ఆస్తుల పరిమాణం (ఏయూఎం) రూ. 7,576 కోట్లుగా ఉందని మంగళవారమిక్కడ విలేకరులకు చెప్పారు. తెలంగాణలో సుమారు 639 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌లో రూ. 201 కోట్ల పోర్ట్‌ఫోలియో ఉన్నట్లు వివరించారు. తెలంగాణలో ప్రస్తుతం 7 శాఖల్లో 120 మంది, ఏపీలో 8 శాఖల్లో 100 మంది పైచిలుకు ఉద్యోగులు ఉన్నట్లు చెప్పారు. సగటు రుణ పరిమాణం రూ. 15–20 లక్షల శ్రేణిలో ఉంటోందని చెప్పారు. ఏయూఎంపరంగా టాప్ 5 రాష్ట్రాల్లో తెలంగాణ ఉన్నట్లు వివరించారు. అందుబాటు ధరల్లోని గృహాల ఫైనాన్సింగ్ మార్కెట్ ఏటా 20 శాతం వృద్ధి చెందుతుందని అంచనాలు ఉన్నట్లు పాట్కర్ చెప్పారు. తమకు దేశవ్యాప్తంగా 150 శాఖలు ఉండగా.. 2025 మార్చి నాటికి ఆ సంఖ్యను 300కు పెంచుకోనున్నామని ఆయన తెలిపారు.

ఎంబసీ రీట్‌కు బ్లాక్‌స్టోన్ టాటా!



న్యూఢిల్లీ: రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్(రీట్) లిస్టెడ్ సంస్థ.. ఎంబసీ ఆఫీస్ పార్క్స్ నుంచి పీఈ దిగ్గజం బ్లాక్‌స్టోన్ గ్రూప్ వైదొలగనున్నట్లు తెలుస్తోంది. బ్లాక్‌డీల్ ద్వారా ఎంబసీ ఆఫీస్ పార్క్స్ రీట్‌లో తమకుగల మొత్తం 23.6 శాతం వాటాను విక్రయించే యోచనలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. దీనిలో భాగంగా ఒక్కో షేరుకి రూ. 310 ఫ్లోర్ ధరను ఖరారు చేస్తున్నట్లు తెలుస్తోంది. వెరసి సుమారు 83.3 కోట్ల డాలర్ల(సుమారు రూ. 6,914 కోట్లు) డీల్‌కు తెరలేవనున్నట్లు అంచనా.

జాబ్ పాయింట్

బెల్, వైజాగ్‌లో 57 పోస్టులు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్), విశాఖపట్నంలోని బెల్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో.. తాత్కాలిక ప్రాతిపదికన ట్రైనీ ఇంజనీర్, ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 57
» పోస్టుల వివరాలు: ట్రైనీ ఇంజనీర్1–45, ప్రాజెక్ట్ ఇంజనీర్1–12.
» అర్హత: 55శాతం మార్కులతో బీఎస్సీ(ఇంజనీరింగ్)/బీఈ, బీటెక్(సీఎస్ఈ /ఐఎస్/ఐటీ/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/టెలికమ్యూనికేషన్/కమ్యూనికేషన్/మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)తో పాటు సంబంధిత విభాగంలో పని అనుభవం ఉండాలి.
» వయసు: 01.02.2023 నాటికి టీఈ పోస్టులకు 28 ఏళ్లు,పీఈ ఖాళీలకు 32ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం:రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 27.12.2023
» వెబ్‌సైట్: www.bel-india.in

యూఐఐసీలో 300 అసిస్టెంట్ పోస్టులు

చెన్నైలోని యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ(యూఐఐసీ).. రెగ్యులర్ ప్రాతిపదికన దేశవ్యాప్తంగా యూఐఐసీ కార్యాలయాల్లో అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 300 (ఆంధ్రప్రదేశ్‌లో 08, తెలంగాణలో 03 ఖాళీలు).
» అర్హత: గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.సంబంధిత ప్రాంతీయ భాష చదవడం,రాయడం,మాట్లాడటం వచ్చి ఉండాలి.
» వయసు: 30.09.2023 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» పే స్కేల్: రూ.22,405 నుంచి రూ.62,265.
» ఎంపిక విధానం: ఆన్‌లైన్ పరీక్ష, రీజనల్ లాంగ్వేజ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిచేస్తారు.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 06.01.2024
» వెబ్‌సైట్: www.uiic.co.in

సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ రాజస్థాన్‌లో 15 టీచింగ్ పోస్టులు

అజ్మీర్ జిల్లా(రాజస్థాన్) బందార్‌సింద్రీలోని సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ రాజస్థాన్.. టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 15
» పోస్టుల వివరాలు: ప్రొఫెసర్–05, అసోసియేట్ ప్రొఫెసర్–03,అసిస్టెంట్ ప్రొఫెసర్–07
» విభాగాలు: పబ్లిక్ పాలసీ, లా అండ్ గవర్నెన్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్ అండ్ అనలిటిక్స్,కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కల్చర్ అండ్ మీడియా స్టడీస్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, సొసైటీ–టెక్నాలజీ ఇంటర్‌ఫేస్, కంప్యూటర్ సైన్స్, మ్యాథమేటిక్స్ తదితరాలు.
» అర్హత: పీజీ, పీహెచ్‌డీ, నెట్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రిక్రూట్‌మెంట్ సెల్, సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ రాజస్థాన్, ఎన్‌హెచ్–8, బందార్‌సింద్రీ, రాజస్థాన్ చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 31.01.2024.
» వెబ్‌సైట్: www.curaj.ac.in

ఇండియా ఎగ్జిమ్ బ్యాంక్‌లో 12 పోస్టులు

ముంబైలోని ఎక్స్‌పోర్ట్–ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. మేనేజర్, మేనేజ్‌మెంట్ ట్రైనీల ఖాళీల భర్తీకి స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 15
» పోస్టుల వివరాలు: మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఎంటీ)–12, మేనేజర్(మిడిల్ మేనేజ్‌మెంట్)–03.
» అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ/ఎంబీఏ/పీజీడీబీఏ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: ఆన్‌లైన్ పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 01.01.2024
» ఆన్‌లైన్ పరీక్ష: జనవరి 2024.
» ఇంటర్వ్యూ తేదీలు: జనవరి/ఫిబ్రవరి 2024.
» వెబ్‌సైట్: www.eximbankindia.in

ఎన్‌టీపీసీ మైనింగ్ లిమిటెడ్, న్యూఢిల్లీలో 114 పోస్టులు

న్యూఢిల్లీలోని ఎన్‌టీపీసీ మైనింగ్ లిమిటెడ్.. ఫిక్స్‌డ్ టర్మ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 114
» పోస్టుల వివరాలు: మైనింగ్ ఓవర్‌మ్యాన్–52, మ్యాగజైన్ ఇన్‌ఛార్జ్–07, మెకానికల్ సూపర్‌వైజర్–21, ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్–13, ఒకేషనల్ ట్రైనింగ్ ఇన్‌స్ట్రక్టర్–03, జూనియర్ మైన్ సర్వేయర్–11, మైనింగ్ సర్దార్–07.
» అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, స్కిల్/కాంపిటెన్సీ టెస్ట్, సర్టిఫికేట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 31.12.2023.
» వెబ్‌సైట్: www.ntpc.co.in

అడ్వాన్స్‌డ్.. సమన్వయంతోనే సక్సెస్!

» జేఈఈ మెయిన్ స్కోర్ ఆధారంగా అర్హత
» అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకుతో ఐఐటీల్లో ప్రవేశం
» జేఈఈ–అడ్వాన్స్‌డ్–2024 తేదీ విడుదల
» 2024, మే 26న పరీక్ష నిర్వహణ
» అందుబాటులో దాదాపు 17 వేల సీట్లు



జేఈఈ అడ్వాన్స్‌డ్-2024

జేఈఈ అడ్వాన్స్‌డ్.. దేశంలోని ప్రతిష్టాత్మక ఇంజనీరింగ్ విద్యా సంస్థలు.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) క్యాంపస్‌ల్లో బీటెక్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్.. కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష! దేశవ్యాప్తంగా లక్షల మంది విద్యార్థులు ఇంటర్ తొలిరోజు నుంచే ఈ పరీక్షకు సన్నద్ధమవుతున్న పరిస్థితి! ఒకవైపు జేఈఈ మెయిన్స్.. మరోవైపు బోర్డ్ పరీక్షలు.. ఇంకోవైపు అడ్వాన్స్‌డ్.. ఈ మూడింటినీ సమన్వయం చేసుకుంటూ ప్రిపరేషన్ సాగిస్తేనే విజయం వరిస్తుంది! తాజాగా జేఈఈ అడ్వాన్స్‌డ్ -2024 పరీక్ష తేదీలను నిర్వాహక సంస్థ ఐఐటీ చెన్నై ప్రకటించింది. ఈ నేపథ్యంలో.. అడ్వాన్స్‌డ్ పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, టాప్ స్కోర్‌కు మార్గాలపై ప్రత్యేక కథనం..

ఈ ఏడాది విద్యార్థులు అడ్వాన్స్‌డ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఎందుకంటే.. అడ్వాన్స్‌డ్‌కు అర్హతగా నిర్దేశించిన జేఈఈ మెయిన్స్ సిలబస్‌లో పలు అంశాలను తొలగించారు. కానీ అడ్వాన్స్‌డ్‌లో మాత్రం గత ఏడాది మాదిరిగానే సిలబస్ ఉంటుందని పేర్కొన్నారు. దీంతో.. విద్యార్థులు ఈ రెండు పరీక్షల ప్రిపరేషన్ విషయంలో నిర్దిష్ట వ్యూహాలు అనుసరించాలని నిపుణులు సూచిస్తున్నారు. రెండింటి సమన్వయంతో సక్సెస్ సాధించొచ్చని పేర్కొంటున్నారు.

అర్హతలు

- 2023లో ఇంటర్మీడియెట్ ఎంపీసీ ఉత్తీర్ణులు లేదా 2024లో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు అర్హులు.
- వయసు: జనరల్ కేటగిరీ అభ్యర్థులు అక్టోబర్ 1,1999 తర్వాత; ఎస్సీ,ఎస్టీ,పీడబ్ల్యూడీ అభ్యర్థులు అక్టోబర్ 1,1994 తర్వాత జన్మించి ఉండాలి.

మెయిన్ నుంచి 2.5 లక్షల మంది

ఐఐటీల్లో ప్రవేశానికి నిర్వహించే అడ్వాన్స్‌డ్ పరీక్షకు.. జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించిన టాప్ 2.5 లక్షల మందిని ఎంపిక చేస్తారు. అదే విధంగా ఐఐటీల్లో సీట్ల కేటాయింపులో అడ్వాన్స్‌డ్‌లో ఉత్తీర్ణతతోపాటు బోర్డ్ పరీక్షల్లో టాప్–20 పర్సంటైల్‌లో నిలవాలనే నిబంధనను కూడా కొనసాగించనున్నారు.

మే 26న అడ్వాన్స్‌డ్

అడ్వాన్స్‌డ్ పరీక్ష మే 26న జాతీయ స్థాయిలో జరుగుతుంది. ఒకేరోజు రెండు పేపర్లు నిర్వహిస్తారు. పేపర్–1 ఉదయం, పేపర్–2ను మధ్యాహ్నం ఉంటుంది.

పరీక్ష ఇలా

జేఈఈ–అడ్వాన్స్‌డ్–2024 పరీక్షను రెండు పేపర్లుగా (పేపర్ 1, పేపర్ 2) కంప్యూటర్ బేస్ట్ టెస్ట్ విధానంలో నిర్వహిస్తారు. మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి ప్రశ్నలు ఉంటాయి. ప్రతి పేపర్‌లో మూడు సెక్షన్‌లు ఉంటాయి. ప్రతి పేపర్‌కు కేటాయించిన సమయం మూడు గంటలు. నెగెటివ్ మార్కుల నిబంధన ఉంది.

మారని సిలబస్

జేఈఈ అడ్వాన్స్‌డ్–2024 సిలబస్ గతేడాది మాదిరిగానే ఉంటుందని నిర్వాహక ఇన్‌స్టిట్యూట్ ఐఐటీ–చెన్నై వర్గాలు పేర్కొన్నాయి. దీంతో అడ్వాన్స్‌డ్ కోసం విద్యార్థులు ఇంటర్మీడియెట్ మొదటి, ద్వితీయ సంవత్సరాల సిలబస్ అంశాలను సంపూర్ణంగా చదవాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు: 2024, ఏప్రిల్ 21– ఏప్రిల్ 30
- ఫీజు చెల్లింపు చివరి తేదీ: 2024, మే 6
- అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం: 2024, మే 17 – మే 26
- అడ్వాన్స్‌డ్ పరీక్ష తేదీ: మే 26 (పేపర్–1 ఉదయం 9 నుంచి 12 వరకు; పేపర్–2 మధ్యాహ్నం 2:30 నుంచి 5:30 వరకు)
- ఫలితాల వెల్లడి: 2024, జూన్ 9
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://jeeadv.ac.in/index.html

రివిజన్+ ప్రాక్టీస్

మ్యాథమెటిక్స్

పరీక్షలో ఎంతో కీలకంగా భావించే మ్యాథ్స్‌లో రాణించడానికి కోఆర్డినేట్ జామెట్రీ, డిఫరెన్షియల్ కాలిక్యులస్, ఇంటిగ్రల్ కాలిక్యులస్, మ్యాట్రిక్స్ అండ్ డిటర్మినెంట్స్‌పై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ముఖ్యంగా 3–డి జామెట్రీ; కో ఆర్డినేట్ జామెట్రీ; వెక్టార్ అల్జీబ్రా; ఇంటిగ్రేషన్; కాంప్లెక్స్ నెంబర్స్; పారాబోలా; క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్; థియరీ ఆఫ్ ఈక్వేషన్స్; పెర్ముటేషన్ అండ్ కాంబినేషన్; బైనామియల్ థీరమ్; లోకస్ అంశాలపై పూర్తి స్థాయి పట్టు సాధించాలి.

ఫిజిక్స్

న్యూమరికల్ టైప్ కొశ్చన్స్ కూడా ఉండే ఈ విభాగంలో మంచి స్కోర్ కోసం ఎలక్ట్రో డైనమిక్స్; మెకానిక్స్; హీట్ అండ్ థర్మో డైనమిక్స్, మోడ్రన్ ఫిజిక్స్, ఆప్టిక్స్, ఎస్‌హెచ్ఎం అండ్ వేవ్స్‌కు ప్రాధాన్యమివ్వాలి. అదే విధంగా సెంటర్ ఆఫ్ మాస్, మొమెంటమ్ అండ్ కొలిజన్; సింపుల్ హార్మోనిక్ మోషన్, వేవ్ మోషన్ అండ్ స్ట్రింగ్ వేవ్స్‌పై అవగాహన పెంచుకోవాలి.

కెమిస్ట్రీ

అభ్యర్థులు కొంత సులభంగా భావించే సబ్జెక్ట్.. కెమిస్ట్రీ. ఇందులో మంచి మార్కుల కోసం కెమికల్ బాండింగ్, ఆల్కైల్ హలైడ్; ఆల్కహాల్ అండ్ ఈథర్, కార్బొనైల్ కాంపౌండ్స్, అటామిక్ స్ట్రక్చర్ అండ్ న్యూక్లియర్ కెమిస్ట్రీ, థర్మోడైనమిక్స్ అండ్ థర్మో కెమిస్ట్రీ అంశాలపై ఎక్కువ దృష్టి సారించాలి. వీటితోపాటు మోల్ కాన్సెప్ట్, కోఆర్డినేషన్ కెమిస్ట్రీ, ఆల్కహాల్, ఫినాల్స్, ఈథర్స్, పి–బ్లాక్ ఎలిమెంట్స్, అటామిక్ స్ట్రక్చర్, గ్యాసియస్ స్టేట్, ఆల్డిహైడ్స్ అండ్ కీటోన్స్, జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, డి అండ్ ఎఫ్ బ్లాక్ ఎలిమెంట్స్‌పై పట్టు సాధించాలి.

అన్వయ దృక్పథం

అభ్యర్థులు ప్రిపరేషన్ సమయంలో అప్లికేషన్ ఓరియెంటేషన్‌ను అనుసరించాలి. కాన్సెప్ట్‌లను వాస్తవ పరిస్థితుల్లో అన్వయం చేసే విధంగా సాధన చేయాలి. తద్వారా పరీక్షలో అడిగే మల్టిపుల్ సెలక్ట్ కొశ్చన్స్, మ్యాచింగ్ టైప్ కొశ్చన్స్ వంటి వాటికి సులభంగా సమాధానం ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది.

బోర్డ్ పరీక్షలు, మెయిన్‌తో సమన్వయం

అభ్యర్థులు బోర్డ్ పరీక్షలు, జేఈఈ–మెయిన్ పరీక్షతో సమన్వయం చేసుకుంటూ అడ్వాన్స్‌డ్ దిశగా అడుగులు వేయాలి. మెయిన్ తొలి సెషన్‌కు హాజరయ్యే అభ్యర్థులు ముందుగా మెయిన్ సిలబస్‌పైనే దృష్టి పెట్టాలి. ఆ తర్వాత బోర్డ్ పరీక్షలకు సమయం కేటాయించాలి. బోర్డ్ పరీక్షలు ముగిసిన తర్వాత అడ్వాన్స్‌డ్‌కు పూర్తి స్థాయిలో ప్రిపరేషన్ సాగించాలి. జేఈఈ–మెయిన్ రెండో సెషన్‌కు కూడా హాజరయ్యే అభ్యర్థులు ఆ సమయంలో అడ్వాన్స్‌డ్ సిలబస్‌ను పరిగణనలోకి తీసుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి.

పునశ్చరణ

బోర్డు పరీక్షలు, జేఈఈ–మెయిన్ రెండో సెషన్ ముగిసిన తర్వాత అడ్వాన్స్‌డ్‌కు పూర్తి స్థాయి ప్రిపరేషన్ ప్రారంభించాలి. అధిక శాతం సమయాన్ని రివిజన్‌కు కేటాయించాలి. అప్పటికే తాము పూర్తి చేసుకున్న అంశాలను పునశ్చరణ చేసుకుంటూ వాటికి సంబంధించి ప్రాక్టీస్ కొశ్చన్స్, ప్రీవియస్ కొశ్చన్స్‌ను సాధన చేయాలి. ప్రతి వారం వీక్లీ టెస్ట్‌లు, గ్రాండ్ టెస్ట్‌లకు హాజరవుతూ లోటుపాట్లు సరిచూసుకోవాలి. ప్రిపరేషన్ తుది దశలో రివిజన్, ప్రాక్టీస్‌కు పెద్దపీట వేయాలి.